

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 55

బుధవారం 17-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'క్యాంపస్'కు కార్ల కంపెనీలు

డేటా అనలిటిక్స్, ఎలక్ట్రిఫికేషన్ నైపుణ్యాలకు ప్రాధాన్యం -13లో



లచ్చుమమ్మను చూసి నేర్చుకోవాలె..! -11లో



'ఉద్యోగాల్లో' అవినీతికి చెక్‌పెట్టాం

ఉద్యోగ నియామకాల వ్యవస్థలో అవినీతి, బంధుప్రీతికి తమ ప్రభుత్వం చెక్‌పెట్టిందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



30న సెంట్రల్ విస్టా ప్రారంభం!

ఢిల్లీలో నిర్మించిన నూతన పార్లమెంట్ భవనాన్ని ఈ నెల 30న ప్రధాని మోదీ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

వివరాలు 6లో ▸



నేడే విడుదల

కర్ణాటక సీఎం పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ పట్టువీడకపోవడంతో అధిష్టానం నిర్ణయం నేటికి వాయిదా పడింది.

వివరాలు 6లో ▸



మళ్లీ కాల్పులు.. ముగ్గురు మృతి

అమెరికాలోని న్యూమెక్సికోలో ఓ యువకుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

అమరావతి భూములు.. సింగపూర్‌లో సంతర్పణ!

- సింగపూర్ ప్రభుత్వమంటూ చివరకు ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం
- కేంద్ర ప్రభుత్వం అనుమతి లేదు
- టెండర్ల ప్రక్రియ మాటే లేదు
- సింగపూర్ కంపెనీకి ముందుగానే అమరావతి మ్యాపులు.. ఆపై బినామీల పేరుతో భూముల కొనుగోలు
- బాబు–నారాయణ భూదందాకు కేంద్రస్థానంగా సీడ్ క్యాపిటల్
- స్విస్ చాలెంజ్ పేరుతో భూదోపిడీ
- హెరిటేజ్, లింగమనేనికి లబ్ధి చేకూరేలా 'ఇన్నర్' మెలికలు
- గత సర్కారు పెద్దల ఆదేశంతో రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు..
- సీఐడీ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు

- వివరాలు 10లో▶

సుప్రీం జడ్జిగా ఏపీ సీజే జస్టిస్ మిశ్రా



జస్టిస్ మిశ్రా



కేవీ విశ్వనాథన్

ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతోపాటు, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షాలు ఇటీవల పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 34 నుంచి 32కు తగ్గింది. - వివరాలు 2లో▶

పొలిటికల్ హీట్

అక్కడ ఓడినా.. ఇక్కడ ఒడ్డెక్కేలా..

కర్ణాటక ఓటమితో రాష్ట్ర బీజేపీలో మార్పులకు సిద్ధమైన జాతీయ నాయకత్వం

- బీఆర్‌ఎస్‌ను మరింత బలంగా ఢీకొట్టే స్థాయిలో పార్టీలో మార్పులు
- ఈటల రాజేందర్‌కు కీలక బాధ్యతలు అప్పగించే యోచన
- మరికొందరు నేతలకూ చేతినిండా 'పని'.. కొత్త నియామకాలు కూడా..
- దీనిపైనే ఈటలతో అమిత్‌షా చర్చించారంటున్న పార్టీ వర్గాలు
- చేరికలతో పాటు ఎన్నికల ప్రణాళిక, వ్యూహాలపైనా కసరత్తు
- పార్టీ నేతల మధ్య సమన్వయ లేమిని చక్కదిద్దడంపై దృష్టి
- పలువురు ముఖ్య నేతలతోనూ మాట్లాడనున్న అగ్ర నాయకత్వం
- వారం, పదిరోజుల్లో 'బాధ్యతల'పై ప్రకటన ఉండొచ్చనే అంచనాలు
- నేడు ఢిల్లీ వెళ్లనున్న రాష్ట్ర చీఫ్ బండి సంజయ్?

కర్ణాటక ఎన్నికల్లో ఎదురుదెబ్బతో బీజేపీ అగ్రనాయకత్వం వెంటనే అప్రమత్తమైంది. కేసీఆర్ సర్కార్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని బలంగా ఎదుర్కొని ఢీ అంటే ఢీ అనేలా తెలంగాణలో పార్టీని సంసిద్ధం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం పార్టీలో అవసరమైన మార్పుల దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత అనుభవమున్న, బీఆర్‌ఎస్ పార్టీ వ్యూహాలను పసిగట్టి తిప్పికొట్టగలిగిన సీనియర్ నేత ఈటల రాజేందర్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలని.. మరికొందరు నేతలకూ చేతినిండా 'పని' అప్పగించాలని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. ఈటలను ఢిల్లీకి పిలిపించి మాట్లాడారని, మరికొందరు నేతలతోనూ మాట్లాడనున్నారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.



సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్: కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో.. దక్షిణాదిలో ఆశలు పెట్టుకున్న మరో రాష్ట్రం తెలంగాణలోనైనా గెలవాలన్న దిశగా బీజేపీ అగ్ర నాయకత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. కొన్ని నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో రాష్ట్ర పార్టీలో పలు కీలక మార్పులకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా పలు కొత్త నియామకాలు చేపట్టడంతోపాటు ముఖ్య నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే పనిలో పడింది. సామాజిక సమీకరణాలు, రాజకీయ అనుభవం ఆధారంగా.. ప్రస్తుతం పార్టీ చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్‌కు కీలక బాధ్యతలు కట్టబెట్టాలని భావిస్తున్నట్టు బీజేపీలోని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. దీనికి సంబంధించి వారం, పది రోజుల్లోనే జాతీయ నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని అంటున్నాయి.

అమిత్‌షాతో ఈటల భేటీ.. కీలక బాధ్యతపై సంకేతాలు..

పార్టీ పెద్దల పిలుపు మేరకు సోమవారం ఢిల్లీకి చేరుకున్న ఈటల రాజేందర్.. మంగళవారం బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో

మిగతా 3వ పేజీలో ▶

మునగాల 45.2 | దామరచర్ల 45.1



సమ్మర్ సలసల

రాష్ట్రంలో పలుచోట్ల 44-45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

- వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- నేడు కూడా పొడి వాతావరణం.. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- గురువారం అక్కడక్కడా జల్లులు కురుస్తాయన్న వాతావరణ శాఖ
- మధ్యాహ్నం వేళ బయటికి రావొద్దు: డీహెచ్ శ్రీనివాసరావు
- వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 42–44 డిగ్రీల వరకు.. పలుచోట్ల ఏకంగా 45 డిగ్రీ లకుపైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 45.2 డిగ్రీలు, నల్లగొండ జిల్లా దామరచర్లలో 45.1 డిగ్రీలతో ఎండ సెగలు కక్కింది. వాయవ్య దిశ నుంచి దిగువస్థాయిలో వేడిగాలులు తెలంగాణ వైపు వీస్తున్నాయని.. దీనితో బుధవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని హెచ్చరించింది. అయితే గురువారం అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక హైదరాబాద్, చుట్టుపక్కల జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదు అవుతాయని అంచనా వేసింది.

మధ్యాహ్నం ఇంట్లోంచి బయటికి రావొద్దు: డీహెచ్ శ్రీనివాసరావు

తీవ్రమైన ఎండల నేపథ్యంలో జనం జాగ్రత్తలు పాటించాలని ప్రజారోగ్య సంచాలకుడు డా. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఎండల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మిగతా 2వ పేజీలో ▶

'హీట్ ఇండెక్స్..'

వేడికి అసలు లెక్క!



2లో

'కూల్' అప్‌డేట్

4న నైరుతి రాక



6లో

ఎయిర్‌పోర్టు మెట్రోకు గ్లోబల్ టెండర్లు

- నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్‌ఏఎంఎల్
- జూలై 5 వరకు దరఖాస్తుకు గడువు
- కాంట్రాక్ట్ అంచనా రూ.5,688 కోట్లు
- రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కి.మీ. మేర నిర్మాణం

- వివరాలు 14లో



రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

సీఎం కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం జరగనుంది. కొత్త సచివాలయంలో ఇదే తొలి మంత్రివర్గ సమావేశం కానుండటం గమనార్హం. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ మంత్రివర్గ సమావేశం నిర్వహిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

- వివరాలు 3లో

రాష్ట్ర 'జల విజయం'పై ప్రపంచానికి పాఠాలు!

- 'ప్రపంచ పర్యావరణ, జల వనరుల సదస్సు'లో పాల్గొననున్న కేటీఆర్
- కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులపై ప్రజెంటేషన్ ఇవ్వనున్న మంత్రి
- అమెరికాకు పయనం.. 25 వరకు టూర్

- వివరాలు 2లో





మంగళవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కిలాట్‌నగర్‌లో భట్టి పాదయాత్ర. చిత్రంలో ఎమ్మెల్యే సీతక్క తదితరులు

ఆ నలుగురే పంచుకుంటున్నారు

- పోరాటాలతో వచ్చిన రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భట్టి విక్రమార్క
- పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగిందని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/కొందుర్గు: నాలుగు కోట్ల మందికి పంచాల్సిన ప్రజా సంపదను నలుగురే పంచుకుంటూ.. రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కేసీఆర్ సర్కారుపై సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఈ తీరును చూసి ప్రజలు విసిగిపోయారని.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కిలాట్‌నగర్ వరకు భట్టి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు, కొల్లూరు గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన మిగతా 3వ పేజీలో ▶

9 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులు 3లో

'నీట్'లా ఇంజనీరింగ్‌కూ

ఒకే ఎంట్రన్స్!



- జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష నిర్వహణ దిశగా కేంద్రం కసరత్తు
- రాష్ట్రాల పరిధిలో జరుగుతున్న ఎంసెట్ తరహా ఎంట్రన్స్‌లకు ఇక స్వస్తి.. ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ముసాయిదా... ఎక్కువ రాష్ట్రాల ఆమోదం!
- ప్రతిపాదన అమలైతే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల బేరసారాలకు తెర

- వివరాలు 14లో

క్లుప్తంగా...



రాజ్‌భవన్‌లో 'సిక్కిం' దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను జరుపుకోవడం ద్వారా ఏక్‌భారత్–శ్రేష్ఠ భారత్ లక్ష్యం నెరవేరుతుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన సిక్కిం దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. సిక్కింకు ఘనమైన సాంస్కృతిక వారసత్వం, చరిత్ర ఉందని కొనియాడారు.

నేడు భద్రాచలంలో తమిళిసై పర్యటన

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మంగళవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి భద్రాచలం పర్యటనకు బయలుదేరి వెళ్లారు. జిల్లా రెడ్‌క్రాస్ కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొంటారు. మధ్యాహ్నం ఖమ్మంలో జరిగే వై20 సదస్సులోనూ పాల్గొంటారు.

పూర్తిస్థాయి పీసీసీఎఫ్‌గా డోబ్రియాల్



సాక్షి, హైదరాబాద్: అటవీశాఖలో పూర్తిస్థాయి అటవీ సంరక్షణ ప్రధాన అధికారి–అటవీ దళాల అధిపతిగా (పీసీసీఎఫ్–హెచ్‌ఓఎఫ్ఎఫ్) రాకేశ్ మోహన్ డోబ్రియాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గతేడాది ఫిబ్రవరిలో అప్పటి పీసీసీఎఫ్ పదవీ విరమణ అనంతరం డోబ్రియాల్‌కు పీసీసీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. తాజాగా ఆయననే కొనసాగిస్తూ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

'కుల' నమోదు అవసరమా?

విద్యాశాఖకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పాఠశాల అడ్మిషన్ సమయంలో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)ల్లోనూ విద్యార్థుల కుల సమాచారాన్ని నమోదు చేయడం అవసరమా.. అనేదానిపై వివరణ తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 31కి వాయిదా వేసింది. పాఠశాల అడ్మిషన్ సమయంలో విద్యార్థుల రికార్డుల్లో కుల సమాచారం లేకుండా చూడాల్సి ఉండగా, అధికారులు ఆ మేరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రధాన న్యాయమూర్తికి బీహెచ్ఈఎల్ మాజీ మేనేజర్ నారాయణ లేఖ రాశారు. విద్యార్థుల రికార్డుల్లో కులం బహిర్గతం కావడం ద్వారా వారి గోప్యత హక్కుకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల రికార్డుల నుంచి కుల వివరాలు తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీన్ని హైకోర్టు.. పిల్‌గా విచారణకు స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదుల వాదనల కోసం విచారణను వాయిదా వేసింది.

బెంగాల్‌లో బాలిక మిస్సింగ్.. ఛేదించిన రాష్ట్ర పోలీసులు

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ బెంగాల్‌లో అదృశ్యమైన బాలిక జాడను నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో తెలంగాణ పోలీసులు కనుగొన్నారు. సైబరాబాద్, పశ్చిమబెంగాల్ పోలీసులు, మహిళా భద్రత విభాగంలోని మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ ఆధ్వర్యంలో జాయింట్ ఆపరేషన్ నిర్వహించి బాలిక జాడను కనిపెట్టినట్టు రాష్ట్ర మహిళా భద్రత విభాగం అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జోహ్రా ఖాతూన్ అనే బాలిక గతేడాది ఫిబ్రవరి 25న ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అష్రఫ్ అన్సారీ అనే యువకుడు కిడ్నాప్ చేసినట్టు అనుమానం ఉందని బాలిక తల్లి హేమతాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నట్టు సమాచారం అందడంతో పశ్చిమ బెంగాల్ పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించి బాలిక జాడ కనిపెట్టి వారికి అప్పగించారు.




హీట్ ఇండెక్స్.. ఉష్ణోగ్రత + ఉక్కపోత

సమ్మర్‌కు సిసలైన సూచికను రూపొందిస్తున్న ఐఎండీ

మహారాష్ట్రలోని నవీ ముంబై శివార్లలో భారీ సభ.. లక్షల్లో జనాలు వచ్చారు.. ఎండాకాలమే అయినా ఉష్ణోగ్రత మరీ ఎక్కువగా ఏమీ లేదు.. అయినా వడదెబ్బ తగిలి ఏకంగా 14 మంది చనిపోయారు. అధిక ఉష్ణోగ్రతకు మరికొన్ని వాతావరణ అంశాలు తోడుకావడమే దీనికి కారణం. అందుకే కేవలం ఉష్ణోగ్రతను కాకుండా.. 'హీట్ ఇండెక్స్'ను పరిగణనలోకి తీసుకోవాలని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నిర్ణయించింది. ఏయే ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉండవచ్చన్న అంచనాలతో కలర్ కోడింగ్ మ్యాప్‌లనూ విడుదల చేస్తోంది. మరి ఏమిటీ 'హీట్ ఇండెక్స్'? ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు? దీనితో ఏమిటి లాభం? వంటి వివరాలు తెలుసుకుందామా..

– సాక్షి సెంట్రల్ డెస్క్



హీట్ ఇండెక్స్ అంచనాలివీ

ఉష్ణోగ్రత (డిగ్రీలలో)	హ్యూమిడిటీ	అనుభూతి చెందే వేడి (డిగ్రీలలో)
30	40%	30
30	50%	31
30	60%	33
30	70%	35
35	40%	37
35	50%	41
35	60%	45
35	70%	50
40	40%	48
40	50%	54
40	60%	59
40	70%	65 ఆపైన

(అమెరికా వెదర్ సర్వీస్ నివేదిక ప్రకారం..) మన దేశ పరిస్థితులను బట్టి ఇండెక్స్ మారుతుంది

ఎంత ఉష్ణోగ్రతకు, ఎంత హ్యూమిడిటీ ఉంటే.. ఏంటి పరిస్థితి?

- ఒక్కో స్థాయిలో ఉష్ణోగ్రతకు, ఒక్కో స్థాయి వరకు హ్యూమిడిటీ ఉంటే ఇబ్బందిగా ఉండదు. అవి పరిమితి దాటితే సమస్యగా మారుతుంది.
- 26 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత, 40% వరకు హ్యూమిడిటీ ఉంటే వాతావరణం హాయి గా ఉన్నట్టు. ఈ పరిస్థితిని మన శరీరం సులువుగా తట్టుకోగలుగుతుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.
- ఈ ఉష్ణోగ్రతలు, హ్యూమిడిటీకి తోడు నేరుగా ఎండలో ఉండటం, వడగాడ్పులు వంటివి కూడా ఉంటే హీట్ ఇండెక్స్ మరింత ఎక్కువగా ఉంటుంది.

ఉష్ణోగ్రత, హ్యూమిడిటీ కలిస్తే..


ఎప్పుడైనా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటే.. కాస్త వేడిగా అనిపిస్తుంది. కానీ దీంతోపాటు వాతావరణంలో నీటిఆవిరి శాతం (రిలేటివ్ హ్యూమిడిటీ) కూడా పెరిగితే.. వేడికి తోడు ఉక్కపోత మొదలవుతుంది. ఆచోట నీడ లేకపోయినా, గాలివీయకపోయినా పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. విపరీతంగా చెమటపడుతుంది. అప్పటికీ ఎండ/వేడిలోనే ఉంటే శరీరంలో డీహైడ్రేషన్ మొదలవుతుంది. ఒకదశలో ఊపిరి తీసుకోలేక, స్పృహ తప్పే పరిస్థితి ఏర్పడుతుంది.

వీటికి ఏమిటి సంబంధం?

మామూలుగా ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటే.. అందుకు తగినట్టుగా గాలి, నీరు వేడెక్కుతూ ఉంటాయి. వేడెక్కిన నీరు వేగంగా ఆవిరి అవుతూ గాలిలో హ్యూమిడిటీ పెరిగిపోతూ ఉంటుంది. మరోవైపు ఎండ, వేడి గాలి కారణంగా మన శరీరం వేడెక్కి చెమటపడుతుంది. మామూలుగా అయితే చెమట ఆరినకొద్దీ శరీరం చల్లబడుతుంది. కానీ వాతావరణంలో అప్పటికే హ్యూమిడిటీ ఎక్కువగా ఉండటంతో చెమట ఆరక.. శరీరం వేడెక్కిపోతూనే ఉంటుంది. ఇది శరీరంలోని అవయవాల పనితీరుపై ప్రభావం చూపి.. అస్వస్థతకు గురవుతారు.

ఏమిటి దీనితో ప్రయోజనం?

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు బయటికి వెళ్లినా తొలుత బాగానే అనిపిస్తుంది. కానీ కాసేపటికే ఇతర అంశాల ప్రభావంతో ఇబ్బందిగా మారుతుంది. అదే 'హీట్ ఇండెక్స్'తో పరిస్థితి ఎలా ఉందన్నది తెలిస్తే.. ముందు జాగ్రత్త పడొచ్చు. ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు కూడా ఆయా ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేసేందుకు వీలుంటుంది. → ఉదాహరణకు ఢిల్లీ, విశాఖపట్నం రెండు చోట్లా 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై.. ఢిల్లీలో 40%, విశాఖలో 50% హ్యూమిడిటీ ఉంటే.. ఢిల్లీలో పరిస్థితి బాగానే ఉంటుంది. కానీ విశాఖలో మాత్రం ఉక్కపోత, వేడి తీవ్రత ఎక్కువ.



ఇప్పటికే ఫీల్స్ లైక్‌పేరిట..

ఉష్ణోగ్రత, ఇతర అంశాలను కలిపాక.. వాతావరణం ఎంత వేడిగా ఉన్నట్టు అనుభూతి కలుగుతుందనే దాన్ని 'ఫీల్స్ లైక్', 'రియల్ ఫీల్'వంటి పేర్లతో సూచిస్తుంటారు. ఇప్పటికే పలు ప్రైవేటు వాతావరణ సంస్థలు దీనిని అమలు చేస్తున్నాయి. స్మార్ట్ ఫోన్లలోని వెదర్ యాప్స్‌లో కూడా ఈ హీట్ ఇండెక్స్ అంచనాలను చూడవచ్చు. → ఉష్ణోగ్రత, హ్యూమిడిటీతోపాటు మేఘాలు ఆవరించి ఉండటం, గాలి వీచే వేగం, సదరు ప్రాంతం ఎత్తు, సమీపంలో భారీ జల వనరులు ఉండటం, తీర ప్రాంతాలు కావడం, వర్షాలు కురవడం వంటివాటిని బట్టి హీట్ ఇండెక్స్ మారే అవకాశం ఉంటుంది. ఆయా పరిస్థితులకు అనుగుణంగా 'హీట్ ఇండెక్స్'ను నిర్ధారించాల్సి ఉంటుంది. → 'హీట్ ఇండెక్స్'ఏ రోజుకారోజు, ఉదయం నుంచి రాత్రి వరకు సమయాన్ని బట్టి మారుతుంది.



ఉప్పల్ భగాయత్‌లో గౌడ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఏపీ మంత్రి జోగి రమేశ్, సినీ నటుడు సుమన్ తదితరులు

గీత కార్మికులకు రక్షణ యంత్రాలు

- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి
- ఉప్పల్ భగాయత్ లో గౌడహాస్టల్ నూతన భవనం ప్రారంభం
- హాజరైన ఏపీ మంత్రి జోగి రమేశ్, సినీ నటుడు సుమన్

సాక్షి, హైదరాబాద్/ఉప్పల్: తాటి చెట్లు ఎక్కే కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ యంత్రాలను సమకూర్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఉప్పల్ భగాయత్‌లో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన గౌడ హాస్టల్‌ను మంగళవారం ఆయన అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు గౌడ్, ఏపీ మంత్రి జోగి రమేష్, సినీనటుడు సుమన్ తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గౌడ హాస్టల్ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైతుబీమా తరహాలో తాటి చెట్లపై నుంచి కిందపడి మృతి చెందే గీత వృత్తిదారుల కోసం 'గీత బీమా'అమలు చేసేందుకు విధి విధానాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గీత వృత్తిదారుల కోసం నాలుగున్నర కోట్ల తాటి, ఈత చెట్లను పెంచే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందన్నారు. నీరా కేఫ్‌లు, కల్లు దుకాణాలు కేవలం గౌడ కులస్తులే నిర్వహించేలా నిబంధనలు విధించినట్లు చెప్పారు. సర్వాయి పాపన్న పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ మీద ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ రంగాల్లో గీతకార్మికులు ఉన్నతస్థాయికి చేరేలా తమ వర్గాలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. విజయవాడలో కూడా గౌడ హాస్టల్ నిర్మించనున్నట్లు చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ గీత వృత్తికి తెలంగాణ ప్రభుత్వం వన్నె తెచ్చిందని, అన్ని రంగాల్లో కల్లు గీత కార్మికులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. సినీనటుడు సుమన్ మాట్లాడుతూ గౌడ వర్గీయులంతా ఐకమత్యంగా.. తోటి వారికి అండగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్, మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, శివకాశి ఎమ్మెల్యే అశోకన్, మధ్యప్రదేశ్‌కు చెందిన జైనారాయణ్ చోక్సీ, పద్మశ్రీ గ్రహీత బీఎల్ చోక్సే, కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బిక్షమయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్, రాజేశం గౌడ్ పాల్గొన్నారు.



గౌడ హాస్టల్ నూతన భవనం

ముస్తాబవుతున్న 41 బీసీ కులాల భవనాలు

- కోకాపేటలో రూ.95.25 కోట్ల వ్యయంతో 87.3 ఎకరాల్లో నిర్మాణ పనులు
- ప్రారంభానికి సిద్ధంగా యాదవ, కురుమ ఆత్మ గౌరవ భవనాలు
- మంత్రి గంగుల కమలాకర్ క్షేత్రస్థాయి సమీక్ష

సాక్షి , హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 41 బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలు శరవేగంగా నిర్మాణ పనులు జరుపుకుంటున్నాయని బీసీ సంక్షేమ శాఖమంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని కోకాపేట, ఉప్పల్ భగాయత్‌లలో నిర్మిస్తున్న ఈ భవనాలను త్వరలోనే పూర్తి చేసి ఆయా కులాల వారికి అందజేయనున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆయన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఇతర బీసీ సంఘాల నేతలతో కలిసి కోకాపేట ఆత్మగౌరవ భవనాల నిర్మాణ సముదాయంలో పర్యటించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. రెవెన్యూ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, ట్రాన్స్‌కో విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

నిర్మాణ దశలో మున్నూరుకాపు, ముదిరాజ్, గౌడ, బసవేశ్వర భవనాలు


మొత్తం 87.3 ఎకరాల్లో రూ.95.25 కోట్లతో 41 కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలను కేటాయించామని, కోకాపేటలో యాదవ, కురుమ ఆత్మగౌరవ భవనాలు ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యాయని, మున్నూరు కాపు, ముదిరాజ్, గౌడ, బసవేశ్వర భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని, మిగతా వాటికి సైతం భూమి పూజలు చేసుకున్నట్లు తెలిపారు. 5 ఎకరాల స్థలంలో రూ. 5కోట్లతో నిర్మిస్తున్న మున్నూరుకాపు ఆత్మగౌరవ భవనం డిజైన్లను పరిశీలించిన మంత్రి గంగుల నిర్మాణం విషయంలో పలు సూచనలు చేశారు. రిక్రియేషన్, లైబ్రరీ, వసతి సదుపాయాలతో పాటు ఫంక్షన్ హాల్ తదితర నిర్మాణాలుండాలని సూచించారు.

తెలంగాణ 'జల విజయం'పై ప్రపంచానికి పాఠాలు

'ప్రపంచ పర్యావరణ, జల వనరుల సదస్సు'లో పాల్గొననున్న కేటీఆర్

- కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులపై ప్రజెంటేషన్ ఇవ్వనున్న మంత్రి
- మంగళవారమే అమెరికాకు పయనం.. ఈనెల 25 వరకు పర్యటన
- వివిధ రంగాల కంపెనీలతో పెట్టుబడి ప్రణాళికలపై సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో జరగనున్న ప్రపంచ పర్యావరణ, జల వనరుల సదస్సు (వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్, వాటర్ రిసోర్సెస్ కాంగ్రెస్)లో.. జలాల విషయంలో తెలంగాణ సాధించిన విజయాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు వివరించనున్నారు. అమెరికాలోని నెవడా రాష్ట్రం హెండర్సన్ నగరంలో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (ఎఎస్‌సీఈ) ఈ సదస్సును నిర్వహిస్తోంది. అందులో కేటీఆర్ ప్రారంభోన్యాసం చేయనున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టు కాళేశ్వరం, ఇంటింటికీ తాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథ పథకాల ఫలితాలను ఈ సందర్భంగా వివరించనున్నారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఆహ్వానం మేరకు ఈ సదస్సులో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్ మంగళవారమే అమెరికాకు వెళ్లారు. మొత్తంగా సుమారు పది రోజుల పర్యటన తర్వాత ఈ నెల 25న కేటీఆర్ తిరిగి రాష్ట్రానికి వస్తారని ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.



అప్పట్లో ప్రణాళికలు.. ఇప్పుడు విజయాలు

మంత్రి కేటీఆర్ 2017లోనే అమెరికాలోని సాక్రమెంటో వేదికగా జరిగిన ఎఎస్‌సీఈ సదస్సులో పాల్గొని సాగునీటి రంగంలో తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలు, చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి, మిషన్ భగీరథ తదితరాలను వివరించారు. 2022లో తెలంగాణలో పర్యటించిన ఎఎస్‌సీఈ బృందం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించింది. ఆ ప్రాజెక్టు తెలంగాణ సాగునీటి రంగంలో గేమ్ చేంజర్‌గా అభివర్ణించింది. అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును స్వల్ప సమయంలో పూర్తి చేయడాన్ని ప్రశంసిస్తూ.. జల విజయాన్ని వివరించేందుకు అమెరికా రావాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. అమెరికా నలుమూలల నుంచి సివిల్ ఇంజనీర్లు పాల్గొనే ఈ సదస్సులో కేటీఆర్ ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ద్వారా తెలంగాణ సాధించిన సామాజిక, ఆర్థిక ప్రగతిని వివరిస్తారు. ఇక అమెరికా పర్యటనలో భాగంగా ఐదు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో వివిధ రంగాల కంపెనీల ప్రతినిధులతో కేటీఆర్ సమావేశం కానున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూలతలను వివరిస్తారు. ఈ సందర్భంగా పలు అమెరికన్ దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనలు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి.

సుప్రీం జడ్జిగా ఏపీ సీజే జస్టిస్ మిశ్రా

- ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరును సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం
- సీనియర్ లాయర్ కేవీ విశ్వనాథన్ పేరూ సిఫార్సు



జస్టిస్ మిశ్రా

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షాలు ఇటీవల పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 34 నుంచి 32కు తగ్గింది. జూలై రెండో వారం కల్లా మరో నలుగురు న్యాయమూర్తులు రిటైర్ కానున్నారు. దీంతో న్యాయమూర్తుల సంఖ్య 28కి పడిపోనుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇద్దరి పేర్లను సిఫారసు చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో మంగళవారం సమావేశమైన కొలీజియం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ సంజీవ్ ఖన్నా సభ్యులు. జస్టిస్ మిశ్రా ఎంపికపై కొలీజియం తీర్మానం వివరణ ఇచ్చింది. 'జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా 13 సంవత్సరాలకు పైగా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. హైకోర్టు న్యాయమూర్తుల ఆల్ ఇండియా సీనియారిటీ జాబితాలో 21వ స్థానంలో ఉన్నారు. సుమారు 12 ఏళ్ల పాటు ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ మిశ్రా పలు న్యాయ రంగాల్లో గణనీయమైన అనుభవాన్ని సంపాదించారు. జస్టిస్ మిశ్రా ఇచ్చిన తీర్పులు చట్టం, న్యాయానికి సంబంధించిన అనేక సమస్యలను స్పృశించాయి. ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారెవరూ లేరు. 2009 మార్చి 31న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై ప్రస్తుత అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి... జస్టిస్ పీకే మిశ్రా కన్నా సీనియర్ ర్యాంకులో ఉన్నారు. ఏది ఏమైనప్పటికీ అన్ని విధాలా పరిగణించి జస్టిస్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తగిన వారిగా నిర్ణయించాం' అని కొలీజియం తీర్మానంలో పేర్కొంది.

కేవీ విశ్వనాథన్ పేరునూ...

అదేవిధంగా, జస్టిస్ పీఎస్ నరసింహ ఒక్కరే ప్రస్తుతం బార్ అసోసియేషన్ నుంచి నేరుగా సుప్రీం జడ్జిగా ఎంపికై కొనసాగుతున్నారు. అందుకే సీనియర్ న్యాయవాది అయిన కేవీ విశ్వనాథన్ పేరును బార్ ప్రాతినిధ్యంగా పరిగణిస్తూ సిఫారసు చేస్తున్నట్లు కొలీజియం వివరించింది. తమిళనాడుకు చెందిన విశ్వనాథన్ సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు. జస్టిస్ జేబీ పార్దీవాలా 2030 ఆగస్టు 11న రిటైరవుతారు. ఆయన తర్వాత సుప్రీంకోర్టులో కేవీ విశ్వనాథనే అత్యంత సీనియర్. కొలీజియం సిఫార్సును కేంద్రం ఆమోదించి ఆయన సుప్రీంకోర్టులో జడ్జి అయితే తర్వాతి కాలంలో ఈయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఉంది. సీజేఐగా ఈయన 2031 మే 25వ తేదీ వరకు 9 నెలలపాటు కొనసాగే అవకాశాలున్నాయని కొలీజియం తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆగస్టు 29, 1964లో జన్మించారు. డిసెంబర్ 10, 2009న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం అక్టోబర్ 13, 2021న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

యాదాద్రీశా.. ఇదేమిగోస!

నీడ లేదు.. నీళ్లూ లేవు.. భక్తుల విలవిల



మాఢ వీధుల్లో ఫ్లోరింగ్‌పై కాళ్లు కాలుతుండడంతో పిల్లలను ఎత్తుకొని పరుగులు తీస్తున్న భక్తులు



ఫ్లోరింగ్ కాలుతుండడంతో బాటిల్‌తో నీళ్లు పోసుకుంటూ నడిచి వెళ్తున్న భక్తులు

సాక్షి, యాదాద్రి: రూ.వందల కోట్లతో పునర్నిర్మాణం చేసిన యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తులకు ఇంకా కనీస స్థాయి వసతులు సమకూరకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. గడిచిన వారం రోజులుగా పగటి పూట ఎండ తీవ్రతకు కొండపైన భక్తులు విలవిలలాడుతున్నారు. 43 డిగ్రీలు దాటుతున్న ఎండ ధాటికి కృష్ణ శిలలతో నిర్మించిన ప్రధానాలయం, దాని పరిసరాలు మరింత వేడెక్కుతున్నాయి. ప్రధానాలయంలో సెంట్రల్ ఏసీలో శ్రీస్వామి దర్శనం చేసుకుని బయటకు వచ్చిన భక్తులకు ఎండ వేడిమితో పట్టపగలే చుక్కలు కన్పిస్తున్నాయి. ప్రసాదాల కొనుగోలుకు, శివాలయానికి వెళ్లడానికి, కొండపైన బస్టాండ్‌కు వెళ్లడానికి కాలినడకన వెళ్లాల్సిన ప్రాంతాలు నిప్పుల కుంపటిలా మారాయి. స్వామి దర్శనం కోసం చెప్పులు లేకుండా వెళ్లే భక్తులు తిరుగు ప్రయాణంలో పాదాలు కాలుతుండడంతో పరుగులు తీస్తున్నారు. పిల్లలతో వచ్చిన వారి పరిస్థితి దయనీయంగా ఉంది. వృద్ధులు కాళ్లకు సాక్స్ మాదిరిగా టవల్స్ చుట్టుకుని నడుస్తున్నారు.

కూలింగ్ పెయింట్‌తోనే సరి

భక్తులకు కనీస వసతులు కల్పించాల్సిన దేవస్థానం చేతులెత్తేసింది. చలువ పందిళ్లు, జూట్ మ్యాట్‌లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. కేవలం కొంత ప్రాంతంలో వైట్ కూలింగ్ పేయింట్ వేసి చేతులు దులుపుకుంది. వేసిన కొన్ని జ్యూట్ మ్యాట్‌లపై వాటిపై క్రమం తప్పకుండా నీళ్లు చల్లడంలేదు. మంచినీటి నల్లాల వద్ద ఎలాంటి నీడ లేకపోవడంతో వాటి నుంచి చల్లని నీటికి బదులు వేడి నీరు వస్తోంది. దీంతో కొండపైన నీటి వ్యాపారం జోరందుకుంది. వ్యాపారులు రూ.20 ఉన్న కూల్ వాటర్ బాటిల్ రూ.30కి విక్రయిస్తున్నారు.

సమ్మర్ సలసల

▶ మొదటి పేజీ తరువాయి

ఒక ప్రకటన జారీచేశారు. అందులోని అంశాలివీ..

- దాహం వేయకపోయినా అవసరమైనంత మేర నీరు తాగుతూ ఉండాలి. వీలైతే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్)గానీ, నిమ్మరసం, మజ్జిగ, లస్సీ, పండ్ల రసాలు తీసుకోవాలి.
- పుచ్చకాయ, నారింజ, ద్రాక్ష, పైనాపిల్, కీరదోస, ఇతర స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- సన్నని, వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం మంచిది.
- ఎండలో ఉన్నప్పుడు తప్పనిసరిగా గొడుగు, టోపీ వాడాలి. లేదా టవల్, ఇతర వస్త్రాలు ఏవైనా కప్పుకోవాలి.
- ఉదయం, సాయంత్రం మాత్రమే బయటికి వెళ్లాలి. మధ్యాహ్నం పూట వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. బాగా గాలి, వెలుతురు వచ్చే చల్లని ప్రదేశాలలో ఉండాలి.
- ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల మధ్య ఎండలో తిరగడం, కఠినమైన శారీరక శ్రమ చేయడం మంచిదికాదు.
- ఆల్కాహాల్, టీ, కాఫీ, కార్బోనేటెడ్ శీతల పానీయాలు, ఎక్కువ చక్కెరతో కూడిన పానీయాలకు దూరంగా ఉండాలి.
- తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. నిల్వ ఉంచిన వాటికి దూరంగా ఉండాలి.
- పార్క్ చేసిన వాహనంలో పిల్లలను, పెంపుడు జంతువులను వదిలివేయవద్దు.
- ఎండ తీవ్రతకు లోనై.. గందరగోళం, ఆందోళన, చిరాకు, అటాక్సియా, మూర్ఛ, కోమా, వికారం, వాంతులు, అధిక గుండె వేగం, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. కాగా, మిర్యాలగూడలోని సీతా రాంపురానికి చెందిన కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగి ఎండీ జానీబాబా (56) వడదెబ్బ గురై మృతి చెందాడు.

మంగళవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలివీ..

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
మునగాల (సూర్యాపేట)	45.2
దామరచర్ల (నల్లగొండ)	45.1
తనుగుల (కరీంనగర్)	44.9
నల్లగొండ	44.8
గరిమెళ్లపాడు (కొత్తగూడెం)	44.8
జూలూరుపాడు (కొత్తగూడెం)	44.7
ధర్మపురి (జగిత్యాల)	44.5
మామిడాల (నల్లగొండ)	44.5
పెన్‌పహాడ్ (సూర్యాపేట)	44.3
పులిచెర్ల (నల్లగొండ)	44.2
భద్రాచలం	43.4
ఖమ్మం	43.4
రామగుండం	42.6
హనుమకొండ	41.5
ఆదిలాబాద్	41.3
మెదక్	41.2
నిజామాబాద్	41.1
మహబూబ్‌నగర్	40.2
హైదరాబాద్	39.1

ఏపీలోనూ భానుడి భగభగలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం 6 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం 9 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు, మరో 10 జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. మిగిలిన జిల్లాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటింది. 13 మండలాల్లో 46 డిగ్రీలు, 39 మండలాల్లో 45 డిగ్రీలు, 255 మండలాల్లో 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్లుప్తంగా...

నేడు బీఆర్‌ఎస్ లెజిస్లేటరీ, పార్లమెంటరీ పార్టీల భేటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ లెజిస్లేటరీ, పార్లమెంటరీ పార్టీల సంయుక్త సమావేశం బుధవారం జరగనుంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్ వేదికగా జరిగే ఈ భేటీలో బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గంతో పాటు ప్రభుత్వ సంస్థల కార్పొరేషన్ల చైర్మన్లు కూడా హాజరుకానున్నారు. సుమారు 290 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ ఈ భేటీకి హాజరయ్యే అవకాశం లేదు. మంత్రి హరీశ్‌రావు విదేశీ పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకొని సమావేశానికి హాజరవుతారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధత, పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, గవర్నర్ తిరస్కరించిన బిల్లులను తిరిగి ఆమోదింపజేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం తదితరాలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసే అవకాశముంది.

అందరివాడు ఎన్టీఆర్: కాసాని



సాక్షి, హైదరాబాద్: తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ అందరివాడని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సావనీర్, వెబ్‌సైట్ ఆవిష్కరణ సభను రాజకీయాలకతీతంగా విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మే 20న ఎన్టీఆర్‌పై ప్రత్యేకంగా రూపొందించిన 'శక పురుషుడు'సావనీర్ ప్రత్యేక సంచిక, 'జయహో ఎన్టీఆర్'వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాలను అన్ని జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు.

నేను పార్టీ మారడం లేదు..



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారుతున్నట్టు, కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని బీజేపీ నేత, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ఖండించారు. మే 27న తన కుమారుడి పెళ్లి ఉందని, ఆ పెళ్లికార్డు ఇచ్చేందుకే టీపీసీసీ నేత రేవంత్‌రెడ్డి, ఇతర విపక్ష పార్టీ నేతలను కలుస్తున్నట్టు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బాపూరావు మీడియాతో మాట్లాడుతూ తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అవసరమనుకుంటే సీఎం కేసీఆర్‌ను కూడా కలిసి వివాహ ఆహ్వానపత్రిక ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తనకు బీజేపీని వీడే ఆలోచన ఏమాత్రం లేదన్నారు.

కర్ణాటక తరహాలోనే ఇక్కడా అధికారంలోకి..



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కూడా కర్ణాటక స్ఫూర్తితో ముందుకెళ్తామని, అక్కడ బీజేపీని ఓడించినట్టే ఇక్కడ బీఆర్‌ఎస్‌ను ఓడించి అధికారంలోకి వస్తామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు 40 శాతం కమీషన్లు తీసుకున్నట్టుగానే తెలంగాణలోనూ 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని, ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సంపత్ జోస్యం చెప్పారు.

బీజేపీ కార్యవర్గభేటీలు 22 నుంచి 26 దాకా..

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరగనున్నాయి. సమావేశాలకు రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్, పార్టీ జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శివ ప్రకాష్, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జ్‌లు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇంచార్జ్ అరవింద్ మీనన్ హాజరుకానున్నారు. ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా, 25, 26 తేదీల్లో మండల కార్యవర్గ సమావేశాలు ఉంటాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర మహిళా నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని వివిధ పార్టీలకు చెందిన మహిళా నేతలు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమం, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు మహిళా నేతలు చెప్పారు. కారంజా కార్పొరేటర్ మాలతై సరోదే, మంగళాతాయి అడ్వికర్, బీజేపీ మహిళా అఘాడీ చీఫ్ సరికాతై ఠాకరే, శివసేన మహిళా అఘాడి అధ్యక్షురాలు వనితాతై ఠోక్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

- ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో కీలక అంశాలపై చర్చ
- పథకాల అమలు, కొత్త పథకాలపై సమీక్షించనున్న మంత్రివర్గం
- పెండింగ్ హామీల అమలుపై నిర్ణయాలు తీసుకునే చాన్స్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన గురువారం (ఈ నెల 18న) మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. కొత్త సచివాలయంలో ఇదే తొలి కేబినెట్ భేటీ కానుండటం గమనార్హం. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. ఈ భేటీలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరును లోతుగా సమీక్షించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి.

నాలుగు నెలలే గడువు ఉండటంతో..

కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను అక్టోబర్‌లో ప్రకటించే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ఆ వెంటనే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుంది. అంటే స్థూలంగా రాష్ట్ర ప్రభుత్వం చేతిలో మరో నాలుగు నెలల సమయం మాత్రమే ఉంది. దీంతో ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు లక్ష్యంగా.. ఈ నాలుగు నెలల్లో అనుసరించిన వ్యూహాలు, పథకాలు, కార్యక్రమాల అమలు తీరుపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో.. తెలంగాణలో దాని ప్రభావంపై సైతం చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలో అమలు చేయాల్సిన కొత్త పథకాలు, జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

పెండింగ్ హామీల అమలుపై నిర్ణయాలు

గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న నిరుద్యోగ భృతి, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.3లక్షల ఆర్థిక సాయం వంటి పథకాల విషయంలో కేబినెట్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. దళితబంధులో అవినీతి, పోడు భూములకు పట్టాల పంపిణీ, ఉద్యోగ నియామకాల్లో జాప్యం, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల వ్యవహారం, ధరణి సమస్యలు వంటి అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది. ఇక ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న ఫారూఖ్ హుస్సేన్, డి.రాజేశ్వర్‌రావుల పదవీ కాలం ఈ నెల 27న ముగియనుంది. ఈ రెండు స్థానాలకు అభ్యర్థుల పేర్లను గవర్నర్‌కు సిఫార్సు చేస్తూ కేబినెట్ తీర్మానం చేసే అవకాశం ఉంది.

బిల్లుల ఆమోదం కోసం శాసనసభ సమావేశాలు

గవర్నర్ తమిళిసై తిరస్కరించిన, తిప్పి పంపించిన బిల్లులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి శాసనసభ సమావేశాలు నిర్వహించాల.ని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. గవ ర్నర్ తిరస్కరించిన తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్(రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ యాన్యుయేషన్) చట్ట సవరణ బిల్లును మళ్లీ శాసనసభలో ఆమోదించి గవర్నర్ సంతకం కోసం పంపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలా రెండోసారి ఆమోదించి పంపితే.. గవర్నర్ తప్పనిసరిగా పాస్ చేయాల న్న నిబంధన ఉందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

అక్కడ ఓడినా.. ఇక్కడ ఒడ్డెక్కేలా..

▶ మొదటి పేజీ తరువాయి

భేటీ అయ్యారు. గంట పాటు సాగిన ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయాలు, చేరికలు, ఎన్నికలకు వ్యూహ రచన, నేతలకు బాధ్యతలు వంటి అంశాలపై చర్చించినట్టు తెలిసింది. వాస్తవానికి తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కార్‌ను, బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా, ఇతర అంశాల్లో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో రాష్ట్ర పార్టీని సంసిద్ధం చేయాలని.. ప్రస్తుతమున్న స్పీడ్, అనుసరిస్తున్న పద్ధతులు ఇందుకు సరిపోవని పలువురు సీనియర్లు అధిష్టానం వద్ద ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీని పూర్తిస్థాయిలో సమాయత్తం చేయడం కోసం కొందరిని బాధ్యతల నుంచి తప్పించడంతోపాటు మరికొందరు నేతలకు కీలక బాధ్యతలు అప్పగించాలన్న అంశంపైనే అమిత్‌షాతో ఈటల భేటీలో ఎక్కువగా చర్చలు సాగినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి ఎన్నికల కమిటీ, ప్రచార కమిటీ చైర్మన్ వరకు కీలక నియామకాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్న సంకేతాలను అమిత్‌షా ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వీటిలో ఏదో ఒక బాధ్యతను ఈటలకు అప్పగిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

మరికొందరు ముఖ్యనేతలతో సంప్రదింపులు?

రాష్ట్ర పార్టీలో చేపట్టబోయే కీలక మార్పులు, ముఖ్యమైన బాధ్యతలను అప్పగింతకు సంబంధించి మరికొందరు ముఖ్య నేతలను ఢిల్లీకి పిలిపించి సంప్రదింపులు జరిపే అవకాశాలు ఉన్నాయని బీజేపీ ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. ఆయా నేతల అభిప్రాయాలు కూడా తీసుకున్నాక.. వారం, పది రోజుల్లోనే నియామకాలపై అధికారిక ప్రకటన ఉండొచ్చనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. ఇతర పార్టీల నుంచి ముఖ్య నేతల చేరికలకు సంబంధించి సైతం ఈ భేటీలో కొంత స్పష్టత వచ్చినట్టు తెలుస్తోంది. ఈటల హైదరాబాద్‌కు వచ్చాక మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులతోపాటు బీఆర్‌ఎస్ అసంతృప్త నేతలతో భేటీ అయి చేరికల ప్రక్రియను వేగవంతం చేయాలని అమిత్‌షా సూచించినట్టు సమాచారం. తాను ఈ నెలాఖరులో లేదా వచ్చే నెల మొదట్లో తెలంగాణ పర్యటనకు వస్తానని చెప్పినట్టు తెలిసింది. ఆ పర్యటన సందర్భంగా ఎన్నికల వ్యూహాలు, పార్టీ మేనిఫెస్టో, పార్టీ బలోపేతం, రాష్ట్రస్థాయి నుంచి నియోజకవర్గాల వరకు ముఖ్య నేతల బహిరంగ సభలు, ఇతర అంశాలపై అమిత్‌షా దిశానిర్దేశం చేస్తారని పార్టీవర్గాలు చెప్తున్నాయి.

నేడు ఢిల్లీకి సంజయ్?

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు కూడా జాతీయ నేతల నుంచి పిలుపు వచ్చిందని, ఆయన బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే తాను ఆరోగ్యపరమైన అంశంపై ఢిల్లీ వెళ్లాలని ముందుగానే నిర్ణయించుకున్నానని.. దీనికి రాజకీయాలతో సంబంధం లేదని సంజయ్ తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్టు తెలిసింది.

అసంతృప్తిని చక్కదిద్దేందుకే?

బీజేపీలో చేరినప్పటి నుంచీ ప్రాధాన్యత లభించడం లేదని జాతీయ నాయకత్వం వద్ద ఈటల రాజేందర్ అసంతృప్తి వెలిబుచ్చినట్టు తెలిసింది. ఇదే సమయంలో పార్టీ ముఖ్య నేతల మధ్య సత్సంబంధాలు కొరవడటం, పాత-కొత్త నేతల మధ్య సమన్వయ లేమి, బీఆర్‌ఎస్ వైఫల్యాలపై ఉమ్మడిగా ప్రజల్లోకి వెళ్లలేకపోవడం, ఇతర పార్టీల నుంచి చేరికలు ఆగిపోవడం, ముఖ్య నేతలు వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేందుకే ప్రాధా న్యతనివ్వడం వంటి అంశాలను జాతీయ నాయకత్వం గుర్తించినట్టు సమాచారం. దీనికితోడు తాజాగా కర్ణాటకలో అధికారాన్ని కోల్పోవడంతో.. అసంతృప్తులను చక్కదిద్దడం, సమన్వయాన్ని నెలకొల్పడం కీలకమనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే మార్పుచేర్పులకు సిద్ధమైనట్టు తెలిసింది.

ఇలాంటి ప్రభుత్వం పోవాలి

ప్రొఫెసర్ కోదండరాం



ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

నల్లగొండ రూరల్: ప్రజా ప్రతినిధుల కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, ఇలాంటి ప్రభుత్వం పోవాలని, ప్రజల సంక్షేమం కోసం పనిచేసే పాలన రావాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మరో పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండలో జరిగిన ఆ పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత బలిదానాలతో వచ్చిన తెలంగాణలో అన్యాయమే జరుగుతోందని ఆయన విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఖర్చు దుబారా అయ్యిందని, ఫలితంగా ఇతర ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తే పాలన తీరు తెలుస్తుందన్నారు. వ్యవసాయ అధికారి నిర్ధారణ మేరకు ధాన్యం తూకం వేయాల్సి ఉండగా మిల్లర్లు ఇష్టారాజ్యంగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం అమ్మకం రైతులకు నరక యాతనగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలనూ నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం దోపిడి వర్గాలకు మాత్రం పెద్దపీట వేసిందన్నారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, పాపయ్య, పాపిరెడ్డి, వీరానాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ నలుగురే పంచుకుంటున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

మినీ కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. ''ఎన్నికల కోసమో, రాజకీయాల కోసమో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేయట్లేదు. నీళ్లు, నియామకాలు, నిధులు, ఆత్మగౌరవం కోసం కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు. సోనియాగాంధీ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఇచ్చారు. ఆ తర్వాత వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసింది? వెనుకబడ్డ పాలమూరుకు కృష్ణా నీళ్లు తేలేదు. పదేళ్లు అవుతున్నా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా ప్రజలకు అన్యాయం చేశారు'' అని మండిపడ్డారు. ఈసారి రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించి పూర్తి చేస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లయినా కృష్ణా జలాలకు సంబంధించిన వాటా ఎంతో తేల్చలేకపోయిందని భట్టి విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో శ్రీశైలం, జూరాల మధ్య సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి రోజుకు 3 టీఎంసీలను తరలించుకునే ప్రాజె క్టు చేపట్టారని.. మరి తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. సీఎం క్యాంప్ ఆఫీసులో ఉండే స్మితా సబర్వాల్ ఏ హోదాలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను సమీక్షించారని ప్రశ్నించారు.

9 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులు

నియామక ఉత్తర్వులు విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు కాంగ్రెస్ అధిష్టానం డీసీసీ అధ్యక్షులను నియమించింది. పెండింగ్‌లో ఉన్న ఈ జిల్లాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కె.విశ్వప్రసాద్‌రావు (ఆసిఫాబాద్) ఎ.ప్రకాశ్‌రెడ్డి (భూపాలపల్లి), పి.దుర్గాప్రసాద్ రావు (ఖమ్మం), పైడాకుల అశోక్ (ములుగు), చల్లా నర్సింహారెడ్డి (రంగారెడ్డి), చెవిటి వెంకన్నయాదవ్ (సూర్యాపేట), ఎం.అనిల్ కుమార్‌యాదవ్ (సికింద్రాబాద్), నిర్మలాగౌడ్ (సంగారెడ్డి), ఎర్రబెల్లి స్వర్ణ (వరంగల్) ఆయా జిల్లాలకు పార్టీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. అలాగే, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎంఆర్‌సీ) కార్యక్రమంలో భాగంగా రిజర్వుడు పార్లమెంట్ నియోజకవర్గాలైన నాగర్‌కర్నూలుకు అలుగొండ మధుసూదన్‌రెడ్డి, మహబూబాబాద్‌కు మార్క విజయ్‌కుమార్‌గౌడ్‌ను సమన్వయకర్తలుగా నియమిస్తూ కూడా కాంగ్రెస్ అధిష్టానం ఉత్తర్వులు జారీచేసింది.

ఇదా ధాన్యం కొనుగోలు తీరు?

అవకతవకలు సరిచేయాలని సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ



సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అవకతవకలను సరిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో 7 వేల కేంద్రాలు తెరిచి కోటి టన్నుల యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ వరి కోతలు ప్రారంభించి 20 రోజులైనా ఇంతవరకూ 10 శాతం కూడా సేకరించలేదన్నారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడవటమే కాక నీటిలో కొట్టుకుపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. దీనికి తోడు కొనుగోళ్లలో ఐకేపీ, మార్కెట్ కమిటీ, మిల్లర్లు మిలాఖతై తేమ, తాలు, తరుగు పేరుతో రైతులను మోసగిస్తున్నారన్నారు. రైతుకు చెల్లించాల్సిన డబ్బుల్లో 10 శాతం కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విజిలెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి మార్కెట్‌లో క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించి ధాన్యం నాణ్యతా ప్రమాణాలను సర్టిపై చేయాలని తమ్మినేని ఆ లేఖలో కోరారు.

ఉత్తమ్‌పై ట్రోలింగ్ చేసింది ప్రశాంత్

- నిందితుడు యూత్ కాంగ్రెస్ నేత అని గుర్తించిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై దుష్ప్రచారం కేసులో యూత్ కాంగ్రెస్ నేత, వార్ రూమ్ ఇన్‌చార్జ్ ప్రశాంత్ నిందితుడిగా తేలాడు. సోమవారం రాత్రి పోలీసులు ఇతడి కార్యాలయంలోనే దాడి చేశారు. నోటీసులు జారీ చేసిన ముగ్గురినీ మంగళవారం విచారించిన నేపథ్యంలో ఈ కేసులో ప్రశాంత్ కీలకమని గుర్తించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఉత్తమ్ కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేస్తున్నట్లు, మరో పార్టీ నేతలతో సన్నిహితంగా ఉంటున్నట్లు కొన్నాళ్లుగా సోషల్‌మీడియాలో ట్రోలింగ్ నడుస్తోంది. అనేక వాట్సాప్ గ్రూపుల్లో ఒకే ఫోన్ నంబర్ నుంచి వీడియోలు పోస్ట్ అవుతున్నట్లు ఉత్తమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన ఈ నెల 5న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. టవర్ లొకేషన్ ఆధారంగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఓ అపార్ట్‌మెంట్ కేంద్రంగా ఆ సెల్‌ఫోన్ పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమ వారం రాత్రి అక్కడ దాడి చేసిన పోలీసులు 3 కంప్యూటర్లతోపాటు కొన్ని హార్డ్‌డిస్క్‌లు, పెన్ డ్రైవ్స్, కొన్ని ఫైళ్లు సీజ్ చేశారు. ఆ వార్ రూమ్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాజేష్, రాజు, అజయ్‌లకు నోటీసులు జారీ చేసి విచారించారు. అల్వాల్‌కు చెందిన ప్రశాంత్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా సెల్‌కు నేతృత్వం వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రశాంత్ కోసం గాలిస్తున్నారు. యూత్ కాంగ్రెస్ వార్ రూమ్ ఉత్తమ్ ఇంటికి కూత వేటు దూరంలో ఉండటం కొసమెరుపు.

అనేక జాగ్రత్తలు తీసుకున్న ప్రశాంత్

సొంత పార్టీ నేత పైనే ట్రోలింగ్స్ చేసిన ప్రశాంత్ ఈ వ్యవహారం బయటపడకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. వీడియోలు సోషల్‌మీడియాలో పోస్టు చేయ డానికి వాడిన ఫోన్ నంబర్ కూడా తమ పేరుపై లేకుండా చూసుకున్నాడు. నల్లగొండకు చెందిన ఓ వ్యక్తి పేరు, చిరునామాతో సిమ్ కార్డు కొన్నాడు. దీన్ని యథాతథంగా వాడితే టవర్ లొకేషన్ ఆధారంగా పోలీసులు గుర్తిస్తారని భావించి, ఫోన్‌ను వైఫైకి కనెక్ట్ చేసి, వాట్సాప్ యాక్టివేట్ చేసే వరకే ఆ సిమ్‌కార్డును వాడాడు. తర్వాత ఆ సిమ్‌కార్డును తీసేసి వైఫై ద్వారానే యాప్స్ వినియోగించాడు.

ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?

- కేసీఆర్ ప్రభుత్వంపై బండి సంజయ్ ధ్వజం
- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్



ఝాన్సీని పరామర్శిస్తున్న బండి సంజయ్

చైతన్యపురి: విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించటం సిగ్గు చేటని, ఆడకూతురుపై దాడి చేసిన ఘటనలో ఏసీపీ సహా బాధ్యులైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏబీవీపీ విభాగ్ కార్యాలయానికి వచ్చిన ఆయన ఝాన్సీని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో ఆటలాడుతోందని, చివరకు విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతున్నా పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. ప్రయివేటు వర్సిటీ హోదా రాకుండానే కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలు అడ్మిషన్ల దందా చేస్తున్నాయని ఆరోపించారు. ఉన్నత విద్యామండలి వద్ద ధర్నాకు పిలుపునిస్తే ధర్నా కన్నా ముందే ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించటం అన్యాయమన్నారు. విద్యార్థుల పక్షాన యుద్ధం చేస్తున్న వారికి అండగా ఉండాల్సింది పోయి దాడులు చేసి పోలీసుల ప్రతిష్టను దెబ్బతీసుకుంటారా.? అని బండి ప్రశ్నించారు. ఈ అంశాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్‌కు చేస్తామన్నారు. పేపర్ లీకేజీతో లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు నాశనం చేశారని, వీటికి కారణమైన మంత్రి కేటీఆర్ లండన్ వెళ్లి ఎంజాయ్ చేస్తున్నారని, లీకేజి నిందితులు బెయిల్‌పై బయటకు వచ్చి జల్సాలు చేస్తున్నారని బండి విమర్శించారు. బీఆర్‌ఎస్‌ది ఫాల్స్, మూర్ఖ, రాక్షస ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ఈటల రాజేందర్ తమ పార్టీ నాయకుడని, జాతీయ నాయకత్వాన్ని కలవటానికి ఢిల్లీ వెళితే తప్పేంటని ప్రశ్నించారు.

నెలరోజుల పాటు బీజేపీ 'అభియాన్' కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నెల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రస్థాయిలో మహాజన సంపర్క్ అభియాన్ రాష్ట్ర కమిటీని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఏర్పాటు చేశారు. కమిటీకి కన్వీనర్‌గా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, సభ్యులుగా పార్టీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ, ఎన్వీ సుభాష్, కట్టా సుధాకర్, పి.పాపారావు, గుండగోని భరత్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, ఎం.వెంకటరమణ నియమితులయ్యారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 30 నుంచి జూన్ 30 దాకా అన్ని జిల్లాలు, మండలాలు, శక్తికేంద్రాలు, పోలింగ్‌బూత్‌లలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు చేరువయ్యేలా కార్యాచరణను రూపొందించారు.

పార్లమెంటుకు అంబేడ్కర్ పేరుపై ప్రధాని మౌనమెందుకు?

- కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకోలేరా!
- సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అభివాదం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గజ్జెల కాంతం తదితరులు

కవాడిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును పార్లమెంటు భవనానికి పెట్టాలని దేశప్రజలు కోరుతున్నా ప్రధాని మౌనం వహించడం ఏమిటని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినందుకు తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభను మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అంబేడ్కర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... అంబేడ్కర్ రచించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తెలంగాణ సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే.. బీసీనని చెప్పుకొనే ప్రధాని.. బీసీ జనగణన లెక్కలు ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్, టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఓరుగంటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ కుట్రలు

- తెలంగాణలో గెలిచేది మేమే... బీఆర్‌ఎస్‌తో పొత్తు అంశమే ఉత్పన్నం కాదు
- ఏఐసీసీ పబ్లిసిటీ, మీడియా సెల్ చైర్మన్ పవన్‌ఖేరా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మతసామరస్య వాతావరణాన్ని చెడగొట్టేందుకు బీజేపీ యత్నిస్తోందని, అసోం సీఎం ఇటీవల కరీంనగర్‌లో చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని ఏఐసీసీ పబ్లిసిటీ, మీడియా కమిటీ చైర్మన్ పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. ఈ దేశం ఏమైనా ఫర్వాలేదు తమకు అధికారం మాత్రమే ముఖ్యమనే రీతిలో బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన తనను కలిసిన మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర ప్రజలిచ్చిన తీర్పు ఓ చరిత్ర లాంటిదని, ప్రధాని మోదీ ప్రచారం చేసిన 48 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువ చోట బీజేపీని అక్కడి ప్రజలు ఓడించారని చెప్పారు. కర్ణాటక ప్రజలిచ్చిన తీర్పును ప్రపంచమంతా అర్థం చేసుకుందని, మోదీకి కూడా ఈ తీర్పు సారాంశం అర్థమవుతోందన్నారు.

తెలంగాణలో నంబర్1 మేమే

తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత తామే నెంబర్1గా నిలుస్తా మని పవన్‌ఖేరా ధీమా వ్యక్తం చేశారు. 2, 3 స్థానాల కోసం బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య పోటీ ఉంటుందని, ఇందులో ఎవరు మూడు, ఎవరు రెండో స్థానంలో ఉంటారో తనకు తెలియదు కానీ, మొదటి స్థానంలో నిలిచేది కాంగ్రెస్సేనని స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌తో పొత్తు అనే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. బీఆర్‌ఎస్ ఏర్పాటు ద్వారా తనను తాను విస్తృతం చేసుకునేందుకు కేసీఆర్ తరహాలోనే గతంలో చాలా మంది చేసి ప్రయత్నించి విఫలమయ్యారని, అందులో ఒక రిగా కేసీఆర్ మిగిలిపోతారని చెప్పారు. తెలంగాణలో ప్రియాంకాగాంధీ పాత్ర ఏమిటన్నదానిపై ఆమే నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

వైఎస్ లేని కాంగ్రెస్ ఇప్పుడు జీరో

- వైఎస్‌లా డీకే కష్టపడ్డారు.. అందుకే కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి
- వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి లేని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు జీరో అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. వైఎస్ హయాం తర్వాత క్యాడర్, లీడర్‌ను నిలుపుకుంటే కాంగ్రెస్‌పై నమ్మకం ఉండేదన్నారు. మంగళవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం లేదన్నారు. ఒకప్పుడు ఎంతో వైభవం కలిగిన పార్టీ ఇప్పుడు బయట నుంచి లీడర్లను తెచ్చుకునే పరిస్థితిలో ఉందన్నారు. కర్ణాటక కాంగ్రెస్‌లో డీకే శివకుమార్ వైఎస్‌లా కష్టపడ్డారు కాబట్టి పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆయన లేకుంటే కర్ణాటకలో కాంగ్రెస్ అనేదే లేదన్నారు. డీకేతో తమకు ముందు నుంచి పరిచయముందని..ఆయన వైఎస్‌ను ఆదర్శంగా తీసుకున్నారని చెప్పారు.

విలీనం చేయాలంటే పార్టీ ఎందుకు పెట్టాలి..

కాంగ్రెస్‌లో విలీనం చేయాలనుకుంటే తాను పార్టీ ఎందుకు పెట్టాలని షర్మిల ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీకి చెందిన ఒక సంస్థ సర్వేలో తమ పార్టీ 44 అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం చూపిస్తుందని తేలిందన్నారు. 44 సీట్లలో తన ప్రభావం ఉంటే.. 5 సీట్లకో.. 10 సీట్లకో పొత్తులకు పోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. విలీనం చేయాలనుకుంటే రెండేళ్లుగా కష్టపడి పార్టీని ఎందుకు నడపాలన్నారు. పార్టీ పెట్టక ముందే తనకు ఎన్నో ఆఫర్లు వచ్చాయన్నారు.



“ భూమ్మీది అన్ని జీవులూ అశాశ్వతమైనవే – ఎవరైనా దీన్ని వివేకంతో గమనించగలిగితే, అప్పుడు బాధల నుంచి దూరం కాగలుగుతాడు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 17 మే 2023

సంక్షోభం నుంచి సంక్షోభానికి!

రాజకీయాల్లో సంక్షోభాలు సహజమే కానీ, నిరంతరం సంక్షోభం నుంచి సంక్షోభానికి ప్రయాణించడం కష్టమే. జాతీయ వేదికపై మోదీ ఆవిర్భావం, బీజేపీ దూకుడు ఆరంభమైనప్పటి నుంచి వరుస ఎదురుదెబ్బలతో ఇబ్బంది పడుతున్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అలానే ఉంది. కర్ణాటకలో శనివారం దక్కిన ఘన విజయాన్ని ఆస్వాదించక ముందే అక్కడ సీఎం సీటుకై ప్రత్యర్థుల పోటీ మూడు రోజులుగా సాగుతూ పార్టీకి తలనొప్పిగా తయారైంది. మరోపక్క కన్నడనాట పోలింగ్‌కు సరిగ్గా ముందురోజు రాజస్థాన్‌లో సొంత ప్రభుత్వంపైనే మళ్ళీ ధ్వజమెత్తి, పాత కుంపటి కొత్తగా రాజేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ వ్యవహారంతో అధిష్ఠానానికి తలబొప్పి కడుతోంది. మరో ఆరేడు నెలల్లో అసెంబ్లీకి ఎన్నికలున్న వేళ రాజస్థాన్‌లో పొంచివున్న అంతర్గత తిరుగుబాటుతో పార్టీ సతమతమవుతోంది. అజ్మీర్ నుంచి జైపూర్ దాకా 5 రోజులు 125 కిలోమీటర్ల 'జన్ సంఘర్ష్ పాద యాత్ర' చేసిన సచిన్, సోమవారం ముగింపు ర్యాలీలో అశోక్ గెహ్లోత్ సారథ్యంలోని సొంత పార్టీ సర్కారుకే ఇచ్చిన అల్టిమేటమ్ అలాంటిది మరి. మరో 15 రోజుల్లో, మే నెలాఖరుకల్లా తన డిమాండ్లను నెరవేర్చకపోతే, రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతానన్న సచిన్ గర్జన ఆందోళన రేపుతోంది.

తాజా హెచ్చరికతో రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్‌కూ, ఆయన జూనియర్ సహచరుడు సచిన్ పైలట్‌కూ మధ్య కొన్నేళ్ళుగా సాగుతున్న పోరాటం కీలక దశకు చేరుకున్నట్టు కనిపిస్తోంది. సచిన్ డిమాండ్లు మూడు: 'అవినీతిమయ' రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రద్దు చేసి, నిపుణులతో పునర్వ్యవస్థీకరించాలి. పేపర్ లీకులతో ఉద్యోగ భర్తీ పరీక్షలు రద్దు చేసినందున యువతరానికి తగిన పరిహారం చెల్లించాలి. 2013 నుంచి 2018 వరకు పాలన సాగించిన మునుపటి వసుంధరా రాజె సర్కార్ అవినీతిపై నిష్పాక్షిక విచారణకు ఆదేశించాలి. నిజానికి, అధిష్ఠానం హెచ్చరించి ఏప్రిల్ 10న జైపూర్‌లో ఒక రోజు నిరసన నిరాహార దీక్ష, ఇప్పుడీ యాత్ర చేసి, తాజాగా డిమాండ్లు నెరవేరకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన తప్పదంటూ సచిన్ పూర్తిస్థాయి ధిక్కార స్వరంలోకి దిగిపోవడం గమనార్హం. తాను చేస్తున్న ఈ పోరాటం పార్టీ మీద, వ్యక్తుల మీద కాదు... అవినీతిపైన, యువతరం కోసమని ఈ యువ నేత పైకి చెబుతున్నారు. కానీ, ఆయన గురిపెట్టింది తనను సీఎం కానివ్వకుండా చేసిన అశోక్ గెహ్లోత్‌ను అనీ, అసలు లక్ష్యం సీఎం పీఠమనీ బహిరంగ రహస్యం.

అశోక్‌కి చెప్పులో రాయి చెవిలో జోరీగలా తయారైన సచిన్‌ను అంత తొందరగా పక్కన పెట్టడం పార్టీకి కష్టమే. ఎందుకంటే, ఆయన కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో గణనీయంగా ఉన్న గుజ్జర్ల వర్గానికి చెందిన నేత. పైగా యువతరంలో పాపులర్. పైగా, వయసు మీరిన అశోక్ పార్టీకి గతమైతే, 45 ఏళ్ల యువ సచిన్ పార్టీకి అవసరమైన భవిష్యత్తు. సచిన్ పార్టీని వీడినా, సొంత కుంపటి పెట్టుకున్నా కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బే. గడచిన 2018 ఎన్నికల్లో పీసీసీ రథసారథిగా రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రంగా శ్రమించిన చరిత్ర సచిన్‌ది. అప్పుడే సీఎంను చేస్తామని సచిన్‌కు మాటిచ్చి, అశోక్‌తో రాజీ ఫార్ములాలో డిప్యూటీ సీఎంగా సరిపుచ్చి, అనివార్యతలు ఏమైనా గడువు తీరినా సీఎంను మార్చక ఏమార్చడం అధిష్ఠానం స్వయంకృతాపరాధం. అందుకే, సచిన్ పదే పదే లక్ష్మణరేఖ దాటుతున్నా ఉపేక్షించక తప్పని పరిస్థితి. మూడేళ్ళ క్రితం 2020లోనే సచిన్ తిరుగుబాటు చేశారు. అప్పుడే అశోక్, సచిన్‌ల మధ్య విభేదాలు సర్కార్‌ను సంక్షోభంలోకి నెట్టాయి. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఎప్పటికప్పుడు సర్దుబాట్లు, బుజ్జగింపులతో ఉద్రిక్తతలు తగ్గించే ప్రయత్నం అధిష్ఠానం చేస్తున్నా అవేవీ ఆచరణలో ఫలించడం లేదన్నది తాజా పరిణామాల తాత్పర్యం.

అశోక్ తప్పులూ అనేకం. రాజస్థాన్‌ను వదిలి, పార్టీ జాతీయ అధ్యక్ష పీఠం తీసుకొమ్మని అధిష్ఠానం కోరినా, మన్నించని ఆయన గత సెప్టెంబర్‌లో తన ఎమ్మెల్యేలతో నడిపిన నాటకం తెలిసిందే. అధిష్ఠానం అభీష్టాన్ని సైతం తెలివిగా పక్కకు తప్పించి అశోక్ సీఎంగానే కొనసాగడం, దూతగా వెళ్ళిన ఖర్గే విఫలమై చివరకు అనూహ్యంగా పార్టీ అధ్యక్షుడు కావడం, సీఎం సీటుపై సచిన్ ఆశలు మళ్ళీ నీరుగారడం ఒకప్పటి బలసంపన్న కాంగ్రెస్‌లోనైతే కలలో కూడా ఊహించలేం. అశోక్‌కు వసుంధరా రాజెతో అవగాహన, ఆత్మీయత ఉన్నాయనేది సచిన్ ఆరోపణ. అప్పట్లో అశోక్ వర్గ ఎమ్మెల్యేల పైన, ఇప్పుడు సచిన్ పైన చర్యలు తప్పవని పార్టీ నాయకత్వం బీరాలు పలికినా, చెబుతున్న 'పెద్ద శస్త్రచికిత్స' మాటలకే పరిమితమైంది. కాంగ్రెస్ అనివార్యత అర్థం చేసుకోదగినదే. ఎన్నికలకు అశోక్ సారథ్యాన్ని సహించే పరిస్థితిలో సచిన్ లేరు. అలాగని ఎన్నికలకు ముందు 2021 సెప్టెంబర్‌లో పంజాబ్‌లో సీఎంను మార్చి, చేజేతులా ఓటమి తెచ్చుకున్న హస్తం పార్టీకి మరో దుస్సాహసం చేసే ధైర్యం లేదు. ఇక, అశోక్ సారథ్యంలోనే రాజస్థాన్‌లో పార్టీ మళ్ళీ గెలిచినా, మరో అయిదున్నరేళ్ళు నిరీక్షించే ఓపిక ఇప్పటికే ఒకసారి మోసపోయాననుకుంటున్న సచిన్‌కు లేదు.

రాజకీయ ధురంధరుడైన అశోక్ సంక్షేమం, సామాజిక న్యాయమే మంత్రాలుగా పేదల ప్రభుత్వమనే పేరుకై పరిశ్రమిస్తున్నారు. ఇదే తననూ, తమ పార్టీనీ ఎన్నికల్లో గట్టెక్కిస్తుందని బలంగా నమ్ముతున్నారు. ఆ మాటేమో కానీ, అంతర్గత పోరుతో పార్టీ పలచనైపోతోంది. అశోక్ వివేకాన్ని ప్రదర్శిస్తూ సచిన్‌ను కలుపుకొనిపోవడం, పిన్న వయస్కుడైన సచిన్ సహనంతో నిరీక్షించడం, అధిష్ఠానం తన పెద్దరికాన్నీ, నాయకత్వాన్నీ చూపడం అత్యవసరం. పార్టీ పెద్దలు తక్షణమే పరిస్థితిని చక్కదిద్దకపోతే కష్టం. జాప్యమయ్యేకొద్దీ బీజేపీకి కలిసొస్తుంది. పిట్ట పోరు, పిట్ట పోరు పిల్లి తీరుస్తుంది.

కాలం చెల్లిన వృద్ధి నమూనా

విశ్లేషణ



దేవీందర్ శర్మ

ఆర్థిక వృద్ధి రేటుపై ప్రపంచానికి మితిమీరిన వ్యామోహం ఉంది. దీనివల్ల పర్యావరణానికి సంబంధించిన క్రమశిక్షణ కనుమరుగైపోయింది. ఆర్థిక వృద్ధి రేటు ఒక్కటి మెరుగ్గా ఉంటే చాలు, 'అంతా బాగానే ఉంది' అనే స్థితి అదే వస్తుందనే నమ్మకానికి అనుగుణంగా మనల్ని మలిచారు. కానీ ఈ పేరుతో సహజ వనరుల దోపిడీ ఎంత జరుగుతున్నదో మనం విస్మరిస్తున్నాం. నిజానికి 'సహజ వనరులు, పర్యావరణ సేవలు' అనేవి పరిశ్రమలకు ఉచితంగా అందిస్తూ చాలా వస్తువుల ఖర్చును సమాజమే పరోక్షంగా భరిస్తున్నది. పైగా ఇప్పటి ఆర్థిక విధానాలన్నీ సంపద ఒక్కచోట పోగయ్యేలా మాత్రమే పనిచేస్తున్నాయి. అందుకే వాతావరణ ఉపద్రవానికి దారితీస్తున్న ఆర్థిక రూపకల్పనకు మరమ్మతు చేయగలిగిన నాయకత్వం ప్రపంచానికి అవసరం.

ఐర్లండ్ అధ్యక్షుడు మైఖేల్ డేనియల్ హిగ్గిన్స్, ఆర్థిక పురోగతిపై మితిమీరిన వ్యామోహాన్ని తీవ్రంగా విమర్శించారు. చాలామంది ఆర్థికవేత్తలు ఎడతెగని వృద్ధి కథనంలో చిక్కుకుపోయి ఉన్నారనీ, సంకుచితంగా నిర్వచించిన సామర్థ్యం, ఉత్పాదకత, శాశ్వతమైన వృద్ధి ఫలితంగా పర్యావరణానికి సంబంధించిన క్రమశిక్షణ కనుమరుగైందనీ, మనం ఇప్పుడు ఎదుర్కొంటున్న జీవావరణ విపత్తుకు అదే కారణమనీ ఆయన పేర్కొన్నారు.

ఇది, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ముందు ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శి బాన్ కి మూన్ దశాబ్దం క్రితం చేసిన ప్రసంగంలో చెప్పిన విషయాన్ని నాకు మళ్లీ గుర్తుకు తెస్తోంది. 'వాతావరణ ఉపద్రవానికి దారితీస్తున్న ఆర్థిక రూపకల్పనను మరమ్మతు చేయగలిగిన నాయకత్వం ప్రపంచానికి అవసరం' అని ఆయన అన్నారు. మరో మాటల్లో చెప్పాలంటే, ఆయన కూడా, ప్రపంచాన్ని ఆకస్మికమైన, కోరుకోలేని మార్పులకు సన్నిహితంగా ప్రమాదకరంగా తీసుకెళుతున్న ఆర్థిక వృద్ధి నమూనాను మరమ్మతు చేయాల్సిన అవసరముందని మాట్లాడుతూ వచ్చారు.

అయితే ఈ హెచ్చరికను ఎవరూ వినిపించుకోలేదు. వాతావరణాన్ని తట్టుకోగల విధానాలను చేపట్టవలసిన ఆవశ్యకతకతపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసినప్పటికీ, మార్పు తేగలిగేలా చేపట్టాల్సిన విధానాలు ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి. చివరకు వాతావరణ మార్పుపై అంతర్ ప్రభుత్వ ప్యానెల్ (ఐపీసీసీ) తాజా సంశ్లేషణాత్మక నివేదిక కూడా అందరూ జీవించదగిన, స్థిరమైన భవిష్యత్తును పదిలపర్చే అవకాశాల గవాక్షం వేగంగా మూసుకుపోతోందని స్పష్టంగా చెబుతోంది. అయినా జంట బ్రెట్టన్ వుడ్స్ సంస్థలు లేదా విదేశీ సంస్థాగత మదుపుదారులు, వేళ్లమీద లెక్కించదగిన క్రెడిట్ రేటింగ్ సంస్థలు ఇంకా మేల్కొనలేదు. మార్పు ఎంత ఎక్కువగా అవసరమో, మరింత ఎక్కువగా పరిణామాలు అలాగే ఉన్నాయి.

ప్రధాన స్రవంతి ఆలోచనను సవాలు చేసేలా సముచిత ప్రశ్నలను ఎప్పుడు లేవనెత్తినా, ఆర్థిక సమాజం నుంచి వచ్చే సామూహిక స్పందన ఏమిటంటే, ఆర్థికాన్ని అర్థం చేసుకోని వ్యక్తుల ఊహగా వాటిని పేర్కొంటూ ఆ బలమైన స్వరాలను కొట్టి వేస్తుంటారు. కార్పొరేట్ మీడియా స్పష్టంగానే ఈ అభిప్రాయాన్ని చాటిచెప్పడాన్ని ఇష్టపడుతుంటుంది. నిజానికి ముఖ్యమైన వార్తాపత్రికలలో ప్రచురితమైన కథనాలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, ఇంకా అత్యధిక వృద్ధి వైపు తరలివెళ్లడం వైపు వాదనను బహిరంగంగా మళ్లించే విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, బ్యాంకులకు చెందిన ప్రధాన ఆర్థిక వేత్తలు పత్రికల స్థలాన్ని ఆక్రమించడం పెరుగుతున్నట్లు కనబడుతుంది. ఇవి సాధారణ సమర్థనలను కలిగి ఉంటాయి. కానీ ప్రపంచం ఎదుర్కొంటున్న మనుగడకి సంబంధించిన ప్రమాదం రీత్యా వారి స్వరంలో కొంతైనా మార్పు ఉండాలని నేను ఆశించాను.



మీడియాలో ఒక వర్గానికీ, వీధుల్లోని విద్యావంతులకూ ఇది సాధారణ వ్యవహారమే. దీనికి ప్రధానంగా మన సామూహిక ఆలోచనలో పాతుకుపోయిన 'టిఐఎన్ఏ' (దేర్ ఈజ్ నో ఆల్టర్నేటివ్- ప్రత్యామ్నాయం అనేది లేదు) భావనే కారణం. మనం దీన్ని ఇష్టపడినా లేకున్నా చెప్పాల్సింది ఏమంటే– 'అంతా బాగానే ఉంది' అనే స్థితికి ఆర్థిక వృద్ధి దారి తీస్తుందనే నమ్మకానికి అనుగుణంగా మనం మల్చబడ్డాము. దిగజారే వాతావరణ పరిస్థితులకు కూడా ఆర్థిక వృద్ధి రక్షకురాలిగా ఆవిర్భవిస్తుంది అనే సాధారణ ఆలోచన ఇప్పటికీ ఉనికిలో ఉంది. ఎందుకంటే పర్యావరణ విధ్వంసంలోనూ, సహజవనరుల క్షీణతలోనూ, వాతావరణ విపత్తులోనూ మనం చూస్తున్న ఆదాయ అసమానత్వ విస్ఫోటనంలోనూ, ప్రపంచం కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని మనకు చెప్పడాన్ని ఆర్థికవేత్తలు మానుకున్నారు. ఇవన్నీ కాలం చెల్లిపోయిన ఆర్థిక సూత్రాల ఫలితమే. కానీ అభివృద్ధి అనే సంతోషంలో మనం వాటిని విస్మరిస్తున్నాం.

తరం తర్వాత తరం గ్రహిస్తున్న ఆర్థిక వృద్ధి సిద్ధాంతాలకు కాలేజీలలో, యూనివర్సిటీలలో చెబుతూ వస్తున్న బోధనలే సంపూర్ణ బాధ్యత వహిస్తున్నాయని ఐరిష్ అధ్యక్షుడు భావిస్తున్నారు. ఆర్థిక శాస్త్రాన్ని ఎలా బోధిస్తున్నారు, ఎలా ప్రశ్నిస్తున్నారు అనే అంశం అతి ముఖ్యమైనది అంటున్న ఆయన, 'ఆర్థిక శాస్త్ర బోధనలో విధానాల బహుళత్వానికి వీలు కల్పించడం అంటే విద్యార్థుల ప్రాథమిక హక్కులను, నిజానికి పౌరుల హక్కుల్ని లేకుండా చేయడమే' అని చెప్పారు.

ఈ రచయిత కూడా, వృద్ధిని ప్రజాకేంద్రకంగా మార్చేందుకు, ఆర్థిక అధ్యయనాలకు సామాజికంగా, పర్యావరణపరంగా ప్రాసంగికతను చేకూర్చడం కోసం, పైవిధమైన ప్రశ్నలను మళ్లీ మళ్లీ అడుగుతూ వచ్చాడు. కానీ ప్రజలకు, భూమండలానికి సంబంధించినంత వరకు ఆర్థిక శాస్త్రంపై పునరాలోచన చేసే దిశగా మన ప్రధాన స్రవంతి చొరవ చేపట్టడం చివరిసారిగా ఎప్పుడు జరిగింది?

మొత్తం వ్యవస్థ ఎలా డిజైన్ చేయబడిందంటే, ఉచిత సహజ పెట్టుబడితో పాటు (అంటే సహజ వనరులు, పర్యావరణ సేవలు అని అర్థం) ప్రభుత్వం నుంచి కూడా పరిశ్రమలు భారీ స్థాయిలో లాభాలను పొందుతున్నాయి. అసలైన మూల్యాన్ని పరోక్షంగా భారీ స్థాయిలో సమాజం భరించాక ధరలు స్థిరపడు తున్నాయి. మనం కొంటున్న డాలర్ ఆహారం ధర నిజానికి మూడురెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే ఆహారం ధర చౌకగా ఉండాలని కోరుకుంటున్నాము కాబట్టి మనం దాన్ని ప్రశ్నించము. ఐక్యరాజ్యసమితి తరఫున 'ది ఎకనమిక్స్ ఆఫ్ ఎకో సిస్టమ్స్ అండ్ బయోడైవర్సిటీ' (టీఈఈబీ) ఇటీవల ఓ అధ్యయనం చేసింది. దక్షిణాసియాలో వరి, గోధుమతో సహా ప్రపంచ వ్యాప్తంగా వేలాది ప్రాథమిక ఉత్పత్తి, ప్రాసెసింగ్ రంగాలు, అలాగే అమెరికాలో పశువుల పెంపకం వంటి వివరాలను ఇది పరిశీలించింది. ప్రతి యేటా వీటి కోసం 7.3 ట్రిలియన్ డాలర్ల విలువైన సహజ వనరులను మింగేస్తున్నారని తెలిపింది. ఇదంతా కూడా అధిక వృద్ధి రేటు అన్వేషణ పేరుతో జరుగుతోంది.

మనం మౌలిక వసతులపై ఉచితాలు, ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలు, గుణాత్మక సడలింపు (అదనపు డబ్బును ముద్రించడం). భారీ ఎత్తున పన్ను రాయితీలు, బ్యాంకుల బకాయిల రద్దు వంటివాటిని చూసినట్లయితే, ఆర్థిక సమతూకం సంపన్నులకు సేవ చేయడానికే ఎక్కువగా ఉపయోగపడుతోందని తెలుస్తుంది. ప్రయోజనాలు కింది దాకా ప్రయాణించాయన్న ఊహ కూడా చాలావరకు నిరాధారమైనదే. ఉదాహరణకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ జరిపిన అధ్యయనం 50 సంవత్సరాల కాలంలో (1965–2015), 18 సంపన్న దేశాల్లో పన్ను రాయితీలు ఆర్థికాభివృద్ధిపై, నిరుద్యోగంపై ఏమంత గణనీయ ప్రభావం చూపలేదని తెలిపింది. సులభంగా చెప్పాలంటే, ప్రభుత్వ ఖజానా నుంచి అత్యంత సంపన్న వర్గాల జేబుల్లోకి ఆదాయాన్ని పంపిణీ చేయడంలోనే ఈ పన్ను రాయితీలు విజయం సాధించాయి.

ప్రపంచ సంపదలో 48 శాతాన్ని 1 శాతం అగ్రశ్రేణి వర్గం సొంతం చేసుకుందని క్రెడిట్ స్విస్ సంస్థ అంచనా వేస్తుండగా, బహుళ జాతీయ సంస్థల లాభాల్లో 40 శాతం ప్రతి సంవత్సరం పన్నులు లేని దేశాలకు తరలిపోతున్నాయని అంచనా వేశారు. ఈ మొత్తం 2019లోనే 1 ట్రిలియన్ డాలర్లుగా ఉండేది. గత దశాబ్దంలో వాల్ స్ట్రీట్ బ్యాంకులు సంపాదించిన మరొక ట్రిలియన్ డాలర్ల లాభాలను కూడా దీనికి జోడించండి. అసమర్థ ఆర్థిక వ్యవస్థ ఒకేచోట సంపదను కూడగట్టడంలో సాయపడిందని తెలుస్తుంది.

ఆర్థిక వృద్ధి నమూనాకు కాలం చెల్లిపోయింది. ముంచుకొస్తున్న వాతావరణ విపత్తు గురించిన భయం, ప్రపంచాన్ని వృద్ధిపై తప్పని సరి వ్యామోహాన్ని వదులుకునేలా చేస్తుందని ఆశిద్దాము.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వాళ్లే పొడవు



భారతీయుల్లో చాలా మంది తూర్పు ఆసియన్లు (ముఖ్యంగా చైనీయులు) పొట్టివాళ్లని అనుకుంటారు. 2020 లాన్సెట్ అధ్యయనం, అత్యధిక తూర్పు ఆసియన్ దేశాల జనం (ప్రత్యేకించి చైనా) భారతీయుల కంటే పొడవైనవాళ్లని తేల్చింది. సగటు పొడవు – చైనా: 175.7 సెం.మీ. ఇండియా: 166.5 సెం.మీ.

– ఆరన్ గ్యాంగ్, పరిశోధకుడు

మనవి ధరించొద్దా?



వందేభారత్ రైల్లో ఢిల్లీకి కుర్తా ధోతీ ధరించి వెళ్తున్నాను. చాలామంది 'పండిట్‌జీ! మీరు ఇక్కడ ఎందుకున్నారు?' అన్నట్టుగా నా వైపు చూస్తున్నారు. అమ్మో, నిర్వలసీకరణ అనేది ఊహించినదానికంటే చాలా కష్టం.

– ఆదిత్యా రాజ్ సిన్హా, వ్యాఖ్యాత

ఉపశమనం కోసం



హీటింగ్ ప్యాడ్ కోసం అర్ధరాత్రి రెండు గంటలకు ఫార్మసీకి పరుగెత్తాల్సి రావడమా? గర్భిణిగా అనుభవించే నొప్పుల గురించి నేను మరిచిపోయాను.

– సెరెనా విలియమ్స్ టెన్నిస్ క్రీడాకారిణి

తప్పని బంధం



నా కజిన్ ఒకరు వైవాహిక బంధంలో చాలా బాధలు పడుతోంది. దాన్ని తెగతెంపులు చేసుకోవాలని తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లింది. కానీ వాళ్లు మద్దతివ్వలేదు. వాళ్ల పెద్దన్న బాగా డబ్బులు సంపాదిస్తున్నారు. ఆయనా నిలబడలేదు. దాంతో ఆమె మళ్లీ అదే బంధంలోకి వెళ్లిపోయింది; కానీ ఇప్పుడు మామూలు వివాహితుల్లా వాళ్లు ఎటూ ఉండలేరు. చూస్తుంటే ఇది ప్రతి మూడో మహిళ కథలా ఉంది.

– సంజుక్తా బసు, జర్నలిస్ట్

ఆత్మ నిర్భరత?



'అరే ఇది ఇంకో రైడ్ భాయీ' అనే మాట ఇంతకు ముందులా ఇప్పుడు వినబడటం లేదని మీరు గమనించారా?

– అమితాబ్ బచ్చన్ నటుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

దేశంలో మత స్వేచ్ఛకు ఇబ్బందులా?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

భారతదేశంలో మైనారిటీలు మతపరమైన వేధింపులను ఎదుర్కొంటున్నారనీ, భారతదేశాన్ని 'కంట్రీ ఆఫ్ పర్టికులర్ కన్సర్న్' (సీపీసీ) లిస్టులో పెట్టి, దానిపై ఆంక్షలు విధించాలనీ 'యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడమ్'(యూఎస్‌సీఐఆర్‌ఎఫ్) తన వార్షిక నివేదికలో బైడెన్ ప్రభుత్వానికి నివేదిక అందించడం... భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే!

ప్రపంచ దేశాలపై పెద్దన్న పాత్ర పోషించడానికి 1998లో 'ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడమ్ ఏక్ట్' ద్వారా అమెరికా ప్రభుత్వం ఏర్పరిచిన ఒక ప్రభుత్వ సంస్థ యూఎస్‌సీఐఆర్‌ఎఫ్. ఈ సంస్థ ప్రతినిధులను అమెరికా ప్రెసిడెంట్, అమెరికా రెండు చట్ట సభల, రెండు పార్టీల అధ్యక్షులు కలిసి నియమిస్తారు. కాగా భారత్‌కు వ్యతిరేకంగా పనిచేసే మీడియా సంస్థలు దీన్ని ఒక స్వతంత్ర సంస్థగా పేర్కొనడం ఆశ్చర్యం కలిగించే విషయం!

ఇక ఈ సంస్థ నివేదికలోని అంశాలను చూద్దాం! భారతదేశంలో హిందువులను మతం మార్చడానికి అవకాశం లేకుండా చట్టాలను మోదీ ప్రభుత్వం తయారు చేసింది. రాజ్యాంగంలోని గోవధ నిషేధ చట్టాలను అమలు చేసి, గోభక్షకులకు ఇబ్బంది కలిగిస్తోంది. హిజాబ్ ధరించడం పైన ఆంక్షలు విధించి, ముస్లింలను మానసికంగా క్షోభకు గురిచేస్తోంది. ఎఫ్ఆర్‌సీఏ నియమాలను కఠినంగా అమలు చేసి, అనేక ఎన్జీఓలను మూతపడేటట్లు చేసి, క్రైస్తవ మత మార్పిడి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసింది. పైన తెలిపిన పనులను కేంద్ర ప్రభుత్వం, అనేక రాష్ట్రాల్లోని స్థానిక ప్రభుత్వాలు తు.చ. తప్పకుండా అమలు చేయడం వలన దేశంలోని మైనారిటీలకు ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, దళితులు, ఆదివాసీ తెగల ప్రజలు తమ మత ఆచారాల ప్రకారం జీవనాన్ని సాగించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, భారత ప్రభుత్వంపై ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలనీ, సదరు సంస్థ బైడెన్ ప్రభుత్వాన్ని కోరింది.

ఈ సంస్థ నివేదికపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మీడియా ప్రతినిధి అరిందం బాగ్చీ ఘాటుగానే స్పందించారు. ఇది పక్షపాతంతో కూడిన నివేదిక అనీ, ఇలాంటి నివేదిక వల్ల భారత్, అమెరికా దేశ సంబంధాలు దెబ్బతింటాయనీ, ప్రత్యేక ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని ఈ రిపోర్టు తయారైందనీ అన్నారు. ఇందుకు ప్రతిస్పందన ఇంకా రాలేదు. అస్సాం రాష్ట్రంలో ఎన్ఆర్‌సీ అమలు గురించి అస్సాం హైకోర్టు ఆర్డర్ వేస్తే అది అస్సాం ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ అని నివేదికలో పేర్కొనడం, సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్ గురించి, కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే 370 ఆర్టికల్ రద్దు గురించి నివేదికలో పేర్కొనడం సంస్థ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో మైనార్టీలు మత హక్కులను అనుభవిస్తుంటే ఇది మన దేశంపై బురద జల్లుతోంది.. భారత్ రక్షణ పరంగా ఆయుధాలను సమకూర్చుకోవడంలో స్వయం సమృద్ధిని సాధిస్తోంది. ఫార్మా లాబీలో అమెరికా ఆటలు సాగడం లేదు. అమెరికా నుండి పనిచేసే మతమార్పిడి సంస్థల ఆటలు సాగడం లేదు. అందుకే యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ నివేదిక అంతగా భారత్‌పై బురదజల్లుతోంది. దీన్ని దేశంలో ఉన్న కుహనా మేధావులు అర్థం చేసుకోవాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

భారత ప్రతిష్ఠకు ఈ మైత్రి గొడ్డలిపెట్టు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు


"భారత్ – ఇజ్రాయెలీ పాలకులు చెట్టపట్టాలు కట్టుకుని సాగడం భారత్ సార్వభౌమాధికార ప్రతిపత్తికి ప్రమాదకరం."
– నోమ్ చామ్‌స్కీ

"ఇండియాలో పైకి కానరాకుండా గోప్యంగా కొందరు కాపాడుతున్నది 'హిందూస్థాన్' నినాదం. ఈ పదం ప్రభుత్వ వ్యవస్థను నర్మగర్భంగా తీర్చిదిద్దుతూ స్వేచ్ఛకు, నిర్బంధ విధానానికి మధ్య సరిహద్దుల్ని నిర్ణయిస్తూ ఉంటుంది. దేన్ని అనుమతించాలి, దేన్ని తొక్కిపట్టాలి అన్నదే ఆ నిర్ణయం. 'హిందూస్థాన్' అన్నది అసలు పర్షియన్ పదం. ఆ పదాన్ని ఏకపక్షంగా సంఘ్ పరివార్ తారుమారు చేసింద'ని పెర్రీ ఆండర్సన్ బహిర్గతం చేశాడు (ది ఇండియన్ ఐడియాలజీ, వెర్సో బుక్స్ లండన్, 2013). ఈ వాస్తవాలు తెలుసుకాబట్టే కొందరు భారతీయ హేతువాద ప్రముఖులు కూడా 'నేను హిందువును ఎందుకని కాను', 'నేను భారతీయుణ్ణి' అని బాహాటంగా ప్రకటించుకున్నారు. అలాగే పెర్రీ ఆండర్సన్ తన 'ఇండియన్ ఐడియాలజీ' గ్రంథంలో ఇజ్రాయెల్‌లో 'లికుడ్', ఇండియాలో 'భారతీయ జనతా పార్టీ', ఐర్లాండ్‌లో 'ఫియానా ఫాయిల్' మితవాద పార్టీలుగా ఎలా అవతరించాయి, వాటిమధ్య ఉన్న పోలికలేమిటి వంటి వాటిని వివరంగా పేర్కొన్నారు.

పాలస్తీనియన్లను అణగదొక్కడానికి ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం కావాలి. ఆసియా, ఆఫ్రికాలలో ప్రాబల్యం పెంచుకోవడానికి అమెరికాకు ఇజ్రాయెల్ చేదోడు వాదోడు కావాలి. ఈ మధ్యలో భారత పాలకవర్గాల ప్రయోజనాల కోసం ఇజ్రాయెల్‌తో స్నేహాలు అవసరమయ్యాయి. స్వతంత్ర భారతదేశ గౌరవ ప్రతిష్ఠలకు ఇజ్రాయెల్‌తో 'స్నేహం' మూలంగా ఎంతటి హాని కలిగిందో ప్రసిద్ధ అంతర్జాతీయ జర్నలిస్ట్ అజాద్ ఎస్సా తన తాజా గ్రంథం 'హాస్టయిల్ హోమ్‌లాండ్స్: ది న్యూ అలయెన్స్ బిట్వీన్ ఇండియా అండ్ ఇజ్రాయెల్'లో వివరించారు. ఇలా ఇజ్రాయెల్‌తో భారత స్వతంత్ర ప్రతిపత్తికి విరుద్ధంగా ప్రస్తుత భారత పాలకులు చేతులు కలిపారనేది చామ్‌స్కీ వివరణ.

బీజేపీ (ఆరెస్సెస్) అధికారంలోకి వచ్చిన తరువాత భారత్–ఇజ్రాయెల్‌ల మధ్య సాధారణ దౌత్య సంబంధాల కన్నా ఎక్కువగా సంబంధాలు పెరిగాయి. 'ఎన్ఎస్ఓ గ్రూప్ టెక్నా లజీస్' అనే ఇజ్రాయెలీ సంస్థ రూపొందించిన 'పెగసస్' నిఘా సాఫ్ట్‌వేర్‌ను పొందడం కోసం నేటి భారత్ పాలకులు ఆ దేశంతో అంటకాగుతున్నారని విమర్శ ఉంది. పెగసస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి భారత పౌరులపైన, పౌర హక్కుల ఉద్యమకారులు, శాంతియుత శ్రామికవర్గ ఆందోళనకారులపైనా నిఘాపెట్టి ఉద్యమాలను పాలకులు కర్కశంగా అణచివేస్తున్నారు. ఈ విషయం బయటపడడంతో దేశంలో తీవ్రమైన నిరసన ఉద్యమాలు చెలరేగాయి. భారత్ 'పెగసస్' సాఫ్ట్‌వేర్ కొన్న తర్వాతే ఇజ్రాయెలీ ఆయుధాల కొను గోళ్లు 42 శాతం పెరిగిపోయాయి. ఫలితంగా స్వతంత్ర భారత రిపబ్లిక్ ప్రత్యేక ప్రతిపత్తి, గౌరవం పతనం కాజొచ్చాయని పరిశీలకుల భావన.

రెండో మాట



పాలస్తీనా యూదు జాతీయులకు, అరబ్బులకు మధ్య తగాదాలు సృష్టించడంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఎలా అంతర్గత కలహాలు సృష్టించి లాభించచూశారో గాంధీ, నెహ్రూలు బహిర్గతం చేశారు. ఎక్కడినుంచో యూదుల్ని తీసుకొచ్చి పాలస్తీనియన్లకు స్వదేశం నుంచి ఉద్వాసన చెప్పించడానికి బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారని గాంధీ, నెహ్రూలు విమర్శించారు. ఇండియాలోని వివిధ జాతుల మధ్య తంపులు సృష్టించడం ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ పరిపాలనా రథాన్ని ఎలా కాపాడుకోదలచారో గాంధీ, నెహ్రూలు బహిర్గతం చేశారు. అలాంటి 'విభజించి – పాలించే' విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

వీరితోపాటు విశ్వకవి టాగూర్ లాంటి వారు కూడా జాతుల, వారి వైవిధ్యభరితమైన భాషా, సాంస్కృతిక ప్రత్యేకతలను గౌరవించి, కాపాడటానికే ప్రయత్నించారు. యూదుల్ని, అరబ్బుల మీదకు రొచ్చగొట్టే ప్రయత్నాలను జాతీయ నాయకులు నిరసించారు. అలాగే హిందూ–ముస్లింలను ఒకే దేశ పౌరులుగా భావించకుండా కుల, మతాల ప్రాతి పదికపైన రెండు గొప్ప జాతుల మధ్య చిచ్చు రేపజూచిన కుల, మత మౌఢ్యుల్ని వ్యతిరేకిస్తూ... భారత ప్రజాస్వామ్య సంప్రదాయాలు, సర్వజనులూ సుఖ శాంతులతో బతకాలన్న సువిశాల భావన నిజమైన భారతీయ ఉమ్మడి సొత్తు అనీ బోధించారు.

కానీ 2019 ఆగస్టు 5న బీజేపీ పాలకులు ఇందుకు విరుద్ధంగా జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగిస్తున్న 370, 35 (ఏ) అధికరణలను రాజ్యాంగం నుంచి ఉపసంహరిస్తూ ప్రకటన చేశారు. అప్పటివరకు రాష్ట్రంగా ఉన్న ఈ భూభాగాన్ని జమ్మూ–కశ్మీర్, లదాక్ అనే కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసి కేంద్ర ప్రత్యక్ష పాలన కిందికి తీసుకు వచ్చారు. 2020 అక్టోబర్‌లో బీజేపీ పాలకులు తెచ్చిన కొత్త చట్టం... కశ్మీరేతరులైన ఇతర రాష్ట్రాల, ప్రాంతాల పౌరులకు కశ్మీర్‌లో స్వేచ్ఛగా ప్రవేశించి, స్థిరపడటానికీ, స్థానికుల భూములను ఆక్రమించడానికీ లేదా కొనుగోలు చేయడానికీ, తద్వారా నివాసయోగ్యత పొందడానికీ, శాశ్వత హక్కు దారులు కావడానికీ తలుపులు తెరచినట్లయింది. ఈ పరిణామం కశ్మీరేతర భారతీయ పౌరుల జనాభా కశ్మీర్‌లో పెరిగిపోవడానికీ, కశ్మీర్... స్థానిక ప్రజలకు దూరం కావడానికీ, సరికొత్త వలస పాలన కశ్మీరీల అనుభవంలోకి రావడానికి తోడ్పడుతుంది.

ఆ మాటకొస్తే కశ్మీర్‌లోనే కాదు, 2020 నుంచీ బీజేపీ పాలకులు భారతదేశంలో అటవీ భూములను సాగుచేసి బతుకుతున్న ఆదివాసీ కుటుంబాలను 'ఆక్రమణదారులని' ముద్ర వేసి, ఆ కుటుంబాల ఇళ్లను కూల్చి వేస్తోంది. ఈ కటిక నిజాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు బీజేపీ పాలకులు 'సరికొత్త మీడియా పాలసీ'ని కూడా ప్రకటించారు. ఈ చట్టం ప్రకారం 'ఏది నిజమైన వార్త, ఏది కాదు' అన్నది ప్రభుత్వ అధికారులే నిర్ణయించి, వారు 'కట్టు కథలని' ముద్ర వేసిన వార్తలు రాసిన జర్నలిస్టులపైన, ప్రచురించిన పత్రికలపైన కూడా అధికారులు చర్యలు తీసుకొంటారు. ఈ నిర్ణయం తర్వాత తమ మీద ఒత్తిళ్లు, అటకాయింపులు, వేధింపులు పెరిగిపోయాయని సర్వత్రా జర్నలిస్టుల ఫిర్యాదుల పరంపర ఎక్కువైందని మరచిపోరాదు.

ఈ వాస్తవాలన్నింటినీ పూసగుచ్చినట్టు అజాద్ ఎస్సా 'భారత–ఇజ్రాయెల్ ప్రభుత్వాల మధ్య పెనవేసుకున్న సరికొత్త అనుబంధం' తాజా గ్రంథంలో తేదీల వారీగా అక్షరబద్ధం చేశారు. మొత్తంమీద నేటి మతతత్త్వ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో నెరపుతున్న చెలిమి ఇప్పటివరకు భారత్ అనుసరిస్తున్న అంతర్గత, విదేశీ విధానాలకు గొడ్డలి పెట్టయ్యిందని చెప్పక తప్పదు.

abkprasad2006@yahoo.co.in

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.త్రయోదశి రా.10.22 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: రేవతి ఉ.7.52 వరకు, తదుపరి అశ్వని, వర్జ్యం: రా.3.23 నుండి 4.56 వరకు, దుర్ముహూర్తం: ప.11.29 నుండి 12.22 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.41.

క్లుప్తంగా...

'బలగం' మొగిలయ్యకు 'దళితబంధు'

మంజూరు పత్రాలు అందజేసిన అధికారులు



మంజూరు పత్రాలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

దుగ్గొండి: 'బలగం'సినిమాలో పాడిన పాటతో అందరి దృష్టినీ ఆకర్షించిన వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పస్తం మొగిలయ్య– కొంరమ్మ దంపతులకు దళితబంధు పథకం మంజూరైంది. మొగిలయ్య రెండు కిడ్నీలు ఫెయిలై డయాలసిస్‌పై ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆయన కుటుంబాన్ని ఆదుకుని చేయూతనివ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి దళితబంధును మంజూరు చేయించారు. ఈ మేరకు మొగిలయ్యకు కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం దళితబంధు మంజూరు పత్రాలు అందించారు. జిల్లా యంత్రాంగం తరఫున ఎల్లప్పుడూ మొగిలి కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా పిట్టల రవీందర్



సాక్షి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సొసైటీల సమాఖ్య లిమిటెడ్ చైర్మన్‌గా పిట్టల రవీందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా దీటి మల్లయ్యను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పిట్టల రవీందర్ ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వీణవంక మత్స్య సహకార సొసైటీ, దీటి మల్లయ్య మేడ్చల్ జిల్లా రామంతాపూర్ మత్స్య సహకార సొసైటీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రేపు నాగోలులో బీజేపీ ఓబీసీ మోర్చా సమ్మేళనం

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



నాగోలు: నాగోలులో శుభం కన్వెన్షన్‌లో ఈ నెల 18న బీజేపీ ఓబీసీ మోర్చా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు భువనగిరి మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం నాగోలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశంలో బీసీ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ చెబుతున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు కాకుండా దొరల గడీల పాలన దశాబ్ది ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఓబీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మే 18న చైతన్యపురి నుంచి నాగోలు వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొంటారని తెలిపారు.

కేసీఆర్ వల్లే బీజేపీ బలోపేతం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మారోజు వీరన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గద్దర్, నారాయణ తదితరులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సీఎం కేసీఆర్ తప్పిదం వల్లే రాష్ట్రంలో బీజేపీ బలోపేతం అవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మతతత్వ పార్టీ అయిన బీజేపీకి వ్యతిరేకంగా అందరూ పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మారోజు వీరన్న వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో 'మారోజు వీరన్న యాదిలో'సభ నిర్వహించారు. మంగళవారం రాత్రి జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కులాలను, మతాలను రెచ్చగొడుతున్నాడని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రూ.20 లక్షల కోట్లు రాయితీ ఇచ్చారని, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు మాత్రం లక్ష కోట్ల రూపాయల రాయితీ ఇవ్వలేదని విమర్శించారు. మారోజు వీరన్న ఆశయాలను సాధించాలని నారాయణ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి పదేళ్లైనా ప్రజాస్వామిక తెలంగాణ రాలేదన్నారు. సామాజిక తెలంగాణ రావాలని చెప్పిన మొదటి వ్యక్తి మారోజు వీరన్నని తెలిపారు. ఆయన లేకపోతే తెలంగాణ పోరాటమే లేదన్నారు. ప్రజా గాయకుడు గద్దర్, ఏపూరి సోమన్న ఆట, పాట అలరించాయి. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్ కాశిం, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్టా రాంరెడ్డి, గట్టు రామచందర్‌రావు, సత్యవతి, కందుకూరి సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.





పాశ్చాత్య దేశాల్లో పండే మామిడి రకాల్లో ఒకటైన కీట్ వెరైటీ మామిడి ఇది. ఈ వెరైటీతో పాటు కెంట్, సెన్సేషన్, కీట్, ఫెర్నాండిన్ వంటి రకాల మామిడి పండ్లు ఉన్నాయి.



ప్రస్తుతం పచ్చళ్ల సీజను కొనసాగుతోంది. మామిడి పచ్చళ్ల రకాలైన హైదర్‌సాహెబ్, ఇరిగిపల్లి తొక్కు కాయ, ముత్‌వర్ పసంద్, జలాల్ వంటి పచ్చళ్ల రకాలను ప్రదర్శించారు. ఈ వెరైటీలు కూడా అరుదుగా పండే రకాలని సైంటిస్టులు చెప్పారు.



తమిళనాడులో సాగయ్యే రుమానీ, ఆంధ్రా ప్రాంతంలో సాగయ్యే నీలం. ఈ రెండు రకాలను క్రాస్ చేసి మంజీరా అనే వెరైటీని సంగారెడ్డి ఫలపరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.



తెలంగాణలో సాగయ్యే అతిపెద్ద మామిడి రకాల్లో రెండోది తెన్నేరీ రకం. ఈ ఒక్కో పండు సగటున సుమారు 1.70 కిలోల నుంచి రెండు కిలోల వరకు ఉంటుందని సైంటిస్టులు చెబుతున్నారు. అతిపెద్ద మామిడిరకం సోర. ఇది అంతకంటే ఎక్కువ బరువు ఉంటుందంటున్నారు.

నీల్‌గోవా.. కాలాపరి.. రుమాణినీలం..

అరుదైన 67 రకాల మామిడి పండ్ల ప్రదర్శన

- జ్యూస్, టేబుల్, పికిల్, కటింగ్‌తో పాటు పలు వెరైటీలు
- సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో ఆకట్టుకున్న ప్రదర్శన

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మామిడిపండ్లు అంటే మనకు బంగినపల్లి, తోతాపురి, బెనేషన్, దశేరీ, కేసరీ, రసాలు.. ఐదారు రకాలు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ ఏకంగా 67 రకాల వెరైటీ మామిడి పండ్లను సంగారెడ్డిలోని ఎఫ్ఆర్ఎస్ (ఫల పరిశోధన స్థానం)లో మంగళవారం ప్రదర్శించారు. కాజు, బాంబేపేడ, దిల్ పసంద్, పానకాలు, నీల్‌గోవా, సుందర్శన్, రంగినిగోవా, గులాబీ, అజమూద్‌సమర్, కాలాపరి, నీలుద్దీన్, గుండు, జమ్–ఆస్–సమర్, కిట్టిట్, దొరగారిపండు, రుమాణి నీలం, ప్రభాత్ శంకర్.. ఇలా అరుదుగా పండే మామిడి రకాలను సందర్శనలో ఉంచారు. ఆయా పండ్లలో తీపి, పీచు, తోలు, ఆకారం, మచ్చలు వైవిధ్యమైన రకాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. కటింగ్ వెరైటీ, జూస్ వెరైటీ, టేబుల్ వెరైటీ, పికిల్ వెరైటీ వంటి వాటిగా మామిడిని వర్గాలుగా విభజిస్తుంటారు.

467 వెరైటీల చెట్లు..

దేశంలో రెండో అతిపెద్ద మామిడి ఫల పరిశోధన కేంద్రం సంగారెడ్డిలో ఉంది. మొత్తం 467 రకాల వెరైటీల మామిడి చెట్లను ఈ పరిశోధన కేంద్రంలో పెంచుతున్నారు. రైతులు ఏ వెరైటీ కోరుకుంటే ఆ వెరైటీని ఉత్పత్తి చేసి మొక్కలను అందజేస్తారు. మామిడి సాగును ప్రోత్సహించేందుకు ఏటా మామిడి రకాల ప్రదర్శన నిర్వహిస్తుంటారు. ఈ ప్రదర్శనకు హాజరైన రైతులకు మామిడి సాగులో మెళకువలను నేర్పిస్తారు.



ప్రదర్శనలో వివిధ రకాల మామిడి పండ్లు

అనుకూలించని వాతావరణం..

కాగా, ఈ ఏడాది మామిడి సాగుకు వాతావరణం అంతగా అనుకూలించలేదని సైంటిస్టులు చెబుతున్నారు. తేనె మంచు పురుగు కాతపై తీవ్ర ప్రభావం చూపిందని చెబుతున్నారు. దీనికి తోడు వడగండ్ల వాన మామిడి పంటను పూర్తిగా దెబ్బతీసిందని సైంటిస్టులు వి.సుచిత్ర, పారిక హరికాంత్‌లు తెలిపారు. సాధారణంగానే మామిడి పంటకు వాతావరణం ఒక ఏడాది అనుకూలంగా ఉంటే, మరో ఏడాది ప్రతికూలంగా ఉంటుందని చెబుతున్నారు.

> **కొత్త రకాల గురించి తెలుసుకునేందుకు వచ్చాను**
>
> నాకున్న ఐదు ఎకరాల్లో ఇప్పటివరకు బేనిషన్, దశేరీ రకాలు సాగు చేశాను. ఈసారి ఏదైనా కొత్త వెరైటీ మామిడి సాగు చేయాలనుకుంటున్నా. ఏ వెరైటీ అనుకూలమో తెలుసుకునేందుకు ఈ ప్రదర్శనకు వచ్చా.
>
> – సి.రవీందర్, మామిడిరైతు, సదాశివపేట





గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

రాష్ట్రంలో గిరిజనులకు స్వర్ణయుగం

అచ్చంపేటలో మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్ర పాలన గిరిజనులకు స్వర్ణయుగంగా నిలుస్తోందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుతో కలసి నల్లమలలోని గిరిజన తండాల్లో పర్యటించారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్ పీహెచ్‌సీలో నిర్మించిన డయాగ్నోస్టిక్ హబ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల్లో 132 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 25 గిరిజన నియోజకవర్గాల్లో ఒక్కో చోట రూ.2కోట్ల వ్యయంతో సేవాలాల్ గిరిజన భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చెంచుల ఉపాధి కోసం కుట్టు మిషన్లు, చేపల సేకరణ యూనిట్లు, మార్కెటింగ్ వాహనాలు, తేనె సేకరణ బాక్సులను మంత్రి పంపిణీ చేశారు. చెంచుపల్లి తండాలో మహిళలతో కలసి మంత్రి సత్యవతిరాథోడ్ నృత్యం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మనూ చౌదరి పాల్గొన్నారు.

తల్లిని గెంటేసి.. ఇంటికి తాళం..

ఆస్తి పంపకంలో విభేదాలతో కొడుకు అమానవీయ చర్య



కుమారుడు ఇంటికి తాళం వేయగా ఆరుబయట కూర్చున్న తల్లి లచ్చవ్వ

దోమకొండ: ఆస్తి పంపకం విషయంలో తల్లిని బయటకు గెంటేసి ఇంటికి తాళం వేసిన ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంఘమేశ్వర్‌లో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన బైకరి లచ్చవ్వకు కుమారులు పెద్ద నర్సయ్య, చిన్న నర్సయ్య ఉన్నారు. ఇద్దరు కొడుకులకు వేర్వేరు ఇళ్లు ఉండగా.. మరో పాత ఇంట్లో లచ్చవ్వ ఉంటోంది. తల్లి ఉంటున్న ఇల్లు విషయంలో అన్నదమ్ముల మధ్య విభేదాలు ఉన్నాయి. దీంతో పెద్ద కుమారుడు పెద్ద నర్సయ్య, అతడి భార్య రేణుక, వారి కుమారులు.. లచ్చవ్వ ఇంటికి వచ్చి దాడి చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న చిన్న నర్సయ్యనూ కొట్టారు. తల్లి లచ్చవ్వను ఇంటి బయటకు గెంటేసి ఇంటికి తాళం వేశారు. చిన్న నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దోమకొండ ఎస్సై సుధాకర్ తెలిపారు. తల్లిని ఇంట్లో నుంచి బయటకు గెంటేసి తాళం వేయడంపై గ్రామస్తులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.

తరుగు తీస్తే చర్యలు తప్పవు

- రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ హెచ్చరిక.. ఫిర్యాదుల కోసం ప్రతి జిల్లాలో టోల్‌ఫ్రీ నంబర్

సాక్షి, హైదరాబాద్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు వచ్చిన తరువాత తేమ, తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల కమిషనర్ వి.అనిల్‌కుమార్ హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మార్గదర్శకాల మేరకు తాలు, తరుగుపై వస్తున్న వార్తలపై విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను నివేదించాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల తీరుపై ఆయన జిల్లా కలెక్టర్‌లతో మంగళవారం మాట్లాడారు. కొన్ని జిల్లాల్లో ధాన్యం దించుకోవడంలో మిల్లర్లు జాప్యం చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం దిగుమతికి మిల్లర్లు ఇబ్బంది పెట్టకుండా తక్షణం దించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ఒక క్రమ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 లోపు ఉండే విధంగా ఆరబెట్టి, తాలు లేకుండా ధాన్యం తెచ్చేలా చూడాలన్నారు. రైతులు వేచి చూసే పరిస్థితి లేకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు జరపాలని ఆదేశించారు. లారీలు, హమాలీల కొరత లేకుండా రెవెన్యూ, రవాణా, సహకార తదితర విభాగాలతో క్షేత్ర స్థాయిలో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

టోల్ ఫ్రీ నంబర్లు 1967, 180042500333

తాలు, తరుగు పేరుతో మిల్లర్ల నుంచి ఎదురవుతున్న సమస్యలతో పాటు ధాన్యం కొనుగోలు, ధాన్యం రవాణా, కనీస మద్దతు ధర తదితర ఫిర్యాదుల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో 1967, 180042500333 టోల్ ఫ్రీ నంబర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా ఈ నెంబర్ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కాగా ఈ ఏడాది యాసంగిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చురుకుగా సాగుతోందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి 16.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, ఈ ఏడాది ఇప్పటివరకు 25.35 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. తడిసిన 3.34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు కేటాయించామన్నారు.

నిద్రలో ఉన్న భార్యకు కరెంట్ షాక్ పెట్టి...

- ఓ భర్త ఘాతుకం
- నిత్యం తాగి వస్తే సంసారం ఎలా నడుస్తుందని భార్య నిలదీసిందని..
- రంగారెడ్డి జిల్లా కొందుర్గులో ఘటన



మమత (ఫైల్)

కొందుర్గు: ఓ తాగుబోతు భర్త భార్యను అతి కిరాతకంగా చంపాడు. రంగారెడ్డి జిల్లా కొందుర్గులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మమత అలియాస్ కవిత(30) అదే గ్రామానికి చెందిన సున్నాల యాదయ్య 2008లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే యాదయ్య.. వచ్చిన డబ్బులతో నిత్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. దాంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మమత కొందుర్గు శివారులోని ఓ పరిశ్రమలో రోజువారీ కూలి పనులు చేస్తూ సంసారం నెట్టుకొస్తోంది. ఈక్రమంలో యాదయ్య ఎప్పటిలాగే సోమవారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ప్రతిరోజూ ఇలా తాగివస్తే సంసారం ఎలా సాగుతుందని నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన యాదయ్య భార్యతో గొడవపడి బయటికి వెళ్లిపోయాడు. రాత్రి భోజనం చేశాక మమత నిద్రలోకి ఉపక్రమించింది. అర్ధరాత్రి ఇంటికొచ్చిన యాదయ్య కరెంట్ షాక్ పెట్టి ఆమెను చంపేశాడు. మంగళవారం ఉదయం మృతురాలు తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

మృత్యువులోనూ వీడని బంధం

తమ్ముడి వెంటే అన్న..

తమ్ముడి మృతిని తట్టుకోలేక అన్న కన్నుమూత





తమ్ముడు జనార్దన్ (ఫైల్) అన్న హన్మండ్లు (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): వాళ్లిద్దరూ అన్నదమ్ములు.. అంతకు మించి మంచి మిత్రులుగా మెలిగేవారు.. అందుకేనేమో.. మృత్యువులోనూ ఇద్దరూ కలిసే 'పోయారు'. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లి గ్రామంలో మంగళవారం జరిగిన విషాద ఘటన వివరాలిలా.. బోగ రామక్క – మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు హన్మండ్లు, జనార్దన్, కూతురు లక్ష్మి ఉన్నారు. కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులు చనిపోగా అన్నదమ్ములు కలిసి అక్క వివాహం చేసి అత్తారింటికి పంపించారు. హన్మండ్లు ఉపాధి కోసం కొన్నేళ్ల పాటు దుబాయ్ వెళ్లి తిరిగి వచ్చాడు. జనార్దన్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఆర్థిక పరిస్థితి అనుకూలించక ఓ రైస్‌మిల్లులో కూలీగా కూడా పనిచేశాడు. లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జనార్దన్ (49) ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. అన్న హన్మండ్లు(52) కిడ్నీ సంబంధిత వ్యాధితో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్నాడు. అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధం రీత్యా.. తమ్ముడి మరణవార్తను హన్మండ్లుకు కుటుంబసభ్యులు తెలియనివ్వలేదు. అయితే స్థానికుల ద్వారా తమ్ముడి మరణవార్త విన్న అన్న హన్మండ్లు.. తీవ్ర మనస్తాపంతో ఆస్పత్రిలోనే కన్నుమూశాడు. గంటల వ్యవధిలోనే అన్నదమ్ములు అనూహ్యంగా చనిపోవడం, ఇద్దరి దహన సంస్కారాలు ఒకేరోజు నిర్వహించాల్సి రావడంతో రెండు కుటుంబాల సభ్యులు, బంధువులే కాదు గ్రామస్తులు కూడా కన్నీటిపర్యంతమయ్యారు.

తనయుడి వెంటే తల్లి..

- కోడలి మృతితో కొడుకు ఆత్మహత్య
- తనయుడి మరణంతో తల్లడిల్లి.. తల్లి కన్నుమూత





కనక లక్ష్మీ (ఫైల్) శ్యాంసుందర్ (ఫైల్)

తిమ్మాపూర్: కొద్దినెలల క్రితం భార్య ఆత్మహత్య.. అది తట్టుకోలేక ఆదివారం ఆమె భర్త బలవన్మరణం.. అతడి ఆత్మహత్యను జీర్ణించుకోలేక సోమవారం అర్ధరాత్రి ప్రాణాలు విడిచిన తల్లి..ఓ కుటుంబంలో చోటు చేసుకున్న వరుస విషాదాలివి. కరీంనగర్ జిల్లా నేదునూరుకు చెందిన ఆర్కెస్ట్రా గాయకుడు బొల్లంపల్లి శ్యాంసుందర్ (35)కు ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన శారదతో వివాహమైంది. మనస్పర్థలతో ఆరునెలల క్రితం శారద తన ఇంటివద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి మనోవేదనతో గడుపుతున్న శ్యాంసుందర్.. తమ పెళ్లిరోజు నాడే ఆదివారం అర్ధరాత్రి హుస్నాబాద్‌కు వచ్చి భార్య చనిపోయిన చెట్టు వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా, శ్యాంసుందర్ ఆత్మహత్యని అతడి తల్లి కనకలక్ష్మి తట్టుకోలేకపోయింది. సోమవారం అంత్యక్రియల అనంతరం కొడుకునే గుర్తుచేసుకుంటూ రాత్రంతా రోదించింది. అర్ధరాత్రి ఛాతీలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది.

అక్షరాలా రూ. 4.50 లక్షల కోట్లు

- 9 ఏళ్లలో వ్యవసాయంపై తెలంగాణ ఖర్చు: మంత్రి నిరంజన్ రెడ్డి
- నకిలీ విత్తన బెడదపై కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష




అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగంపై అక్షరాలా రూ. 4.50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మరే రాష్ట్రమూ ఇంత భారీగా ఖర్చు చేయలేదన్నారు. వానాకాలం సీజన్‌కు అవసరమైన విత్తనాలు, విత్తన నియంత్రణ, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. వ్యవసాయ రంగం ప్రాధాన్యతను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఉచిత విద్యుత్, పంటల కొనుగోళ్లు, రైతుబంధు, రైతుబీమా, సాగునీరు, విత్తనాలు, ఎరువుల సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల మార్పిడి వంటి వాటికి పెద్ద ఎత్తున ఖర్చు చేసిందన్నారు.

18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం..

ఈ వానాకాలం సీజన్‌లో పత్తి, మిరప, కంది, వరి మిగిలిన అన్ని రకాలు కలిపి 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. నకిలీ విత్తనాల బెడద సంపూర్ణంగా నివారించాలని, అవి సరఫరా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు టాస్క్ ఫోర్స్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అయితే.. నకిలీ విత్తనాలను అరికట్టే ప్రయత్నంలో అమాయకులను బలిచేయవద్దన్నారు. కర్ణాటక, కర్నూలు, గద్వాల నుంచి, గుంటూరు, ప్రకాశంవైపు నుంచి, ఆసిఫాబాద్, బెల్లంపల్లి వైపు నుంచి, గుజరాత్ నుంచి జహీరాబాద్ మీదుగా వచ్చే దారులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. చిన్న చిన్న లోపాలు, తప్పిదాలపై కఠినంగా వ్యవహరించకుండా ట్రేడర్లు, విత్తన వ్యాపారులకు సమయం ఇచ్చి సరిచేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. దేశంలో అవసరమైన 60 శాతం విత్తనాలను తెలంగాణ అందిస్తోందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ అంజనీకుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సీఐడీ చీఫ్ మహేష్ భగవత్, తదితర అధికారులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. ఊపిరాడక రైతు మృతి



సూర్యనారాయణ (ఫైల్)

మునగాల (కోదాడ): వరి కొయ్యలకు నిప్పు పెట్టగా.. వచ్చిన పొగకు ఊపిరాడక ఓ రైతు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన రైతు చామకూరి సూర్యనారాయణ(65) మంగళవారం ఉదయం తన పొలంలో వరికొయ్యలను తగులబెట్టగా.. ఆ మంటలు పక్క పొలాలకు వ్యాపించాయి. వాటిని చల్లార్చే ప్రయత్నంలో దట్టమైన పొగ కమ్ముకుంది. ఆ పొగకి ఊపిరాడక మృతి చెందాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో మృతుడి కుమారుడు కాశీపతి.. తన తండ్రి ఇంకా పొలం నుంచి రాకపోవడంతో వెతికేందుకు వెళ్లగా సూర్యానారాయణ మృతి చెంది కనిపించాడు.

క్లుప్తంగా

న్యూజిలాండ్ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం..

ఆరుగురు మృతి

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ రాజధాని వెల్లింగ్టన్‌లోని ఓ హాస్టల్ జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. నాలుగంతస్తుల హాస్టల్ భవనంలో సోమవారం అర్ధరాత్రి మంటలు చెలరేగి అన్ని అంతస్తులకూ వ్యాపించాయి. అగ్ని మాపక సిబ్బంది 52 మందిని ఖాళీ చేయించారు. ఆరు మృతదేహాలు గదుల్లో కన్పించాయి. ప్రమాద తీవ్రతకు పై అంతస్తు కప్పు విరిగిపడింది. 92 గదులున్న ఈ హాస్టల్ భవనంలో శిథిలాలను పూర్తిగా తొలగించాకే మృతులు, బాధితుల లెక్క తేలుతుందంటున్నారు. ఏదేమైనా మృతుల సంఖ్య 10లోపే ఉండొచ్చని చెబుతున్నారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు మృత్యువాత

ఫార్మింగ్టన్: అమెరికాలోని న్యూ మెక్సికోలో కాల్పుల ఘటన కలకలం రేపింది. న్యూ మెక్సికో, అరిజోనా, ఉటా, కొలరాడో రాష్ట్రాల కూడలిలో ఉన్న ఫార్మింగ్టన్ నగరంలో సోమవారం ఉదయం ఓ 18 ఏళ్ల యువకుడు విచ్చలవిడి కాల్పులకు దిగాడు. తన వాహనంపై తిరుగుతూ ఆ ప్రాంతంలోని ఆరు ఇళ్లు, మూడు కార్లపైకి కాల్పులు జరిపాడు. ముగ్గురు చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసు కాల్పుల్లో సాయుధుడు హతమయ్యాడు. అతడి దగ్గర 3 తుపాకులు దొరికాయి.

రోడ్డు ప్రమాదంలో అస్సాం 'లేడీ సింగం' మృతి



నాగావ్(అస్సాం): అస్సాంలో లేడీ సింగం, దబాంగ్ పోలీసుగా గుర్తింపు పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్ జున్‌మణి రాభా రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. నాగావ్ జిల్లా సురుభగియా గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం ఈ ఘోరం జరిగింది. ఆమె తన కారులో వెళ్తుండగా కంటైనర్ ఎదురుగా ఢీకొట్టింది. పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే ఆమె చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. జున్‌మణి నిజాయతీ గల అధికారిణిగా పేరు తెచ్చుకున్నారు.

నైరుతి రాక 4న!

- ఈసారి మూడు రోజులు ఆలస్యం
- సాగుపై ప్రభావముండదు: ఐఎండీ

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్త ఆలస్యం కానున్నాయి. అవి జూన్ 4న దేశంలోకి ప్రవేశించవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు తొలుత కేరళలో ప్రవేశిస్తాయి. ఈ ఏడాది రుతుపవనాలు కొంత ఆలస్యమైనప్పటికీ దేశవ్యాప్తంగా పంటల సాగుపై, మొత్తం వర్షపాతంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని ఐఎండీ చీఫ్ ఎం.మొహాపాత్రా స్పష్టం చేశారు. రుతుపవనాలు ప్రవేశించే తేదీకి, ఈ సీజన్‌లో నమోదయ్యే మొత్తం వర్షపాతానికి సంబంధం లేదని తెలిపారు.



సాధారణ వర్షపాతమే!

నైరుతి రుతుపవనాలు సాధారణంగా ఏటా జూన్ 1న కేరళలో అడుగు పెడతాయి. 2018లో మే 29న, 2019లో జూన్ 8న, 2020లో జూన్ 1న, 2021లో జూన్ 3న, 2022లో మే 29న ఈ రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల రాకపై తమ అంచనాలు 2015 మినహా గత 18 ఏళ్లలో ఎప్పుడూ తప్పలేదని ఐఎండీ పేర్కొంది. మోకా తుఫాను కారణంగానే ఈసారి రుతుపవనాల రాక ఆలస్యమవుతున్నట్లు చెప్పలేమని కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ మాజీ కార్యదర్శి ఎం.రాజీవన్ అన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణ వర్షపాతమే నమోదవుతుందని తాము అంచనా వేస్తున్నట్లు ఐఎండీ గత నెలలో తెలియజేసింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుందని ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. దేశంలో గత నాలుగేళ్లు సాధారణం, సాధారణం కంటే అధిక వర్షాలు కురిశాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆహారంలో 40 శాతం ఆహారం వర్షాధార సాగుతోనే ఉత్పత్తి అవుతోంది. ఆహార భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి తగిన వర్షపాతం నమోదు కావడం చాలా కీలకం. మన దేశంలో 52 శాతం సాగుభూమి వర్షాలపైనే ఆధారపడి ఉంది.

'మూన్ కింగ్'గా మళ్లీ శని గ్రహం



బ్రిటిష్ కొలంబియా: సౌర కుటుంబంలో అత్యధికంగా చంద్రులు పరిభ్రమిస్తున్న శని గ్రహం 'మూన్ కింగ్' కిరీటాన్ని తిరిగి చేజిక్కించుకుంది. ఈ గ్రహం చుట్టూ మరో 62 చంద్రులు పరిభ్రమిస్తున్నట్లు తాజాగా ఖగోళ పరిశోధకులు గుర్తించారు. దీంతో, శని చుట్టూ తిరుగుతున్న చంద్రుల సంఖ్య 83 నుంచి 145కు చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్తగా గుర్తించిన 12 చంద్రులతో కలిపి అత్యధికంగా 95 చంద్రులతో అగ్రభాగాన నిలిచిన గురుగ్రహం మూన్‌కింగ్‌గా కొనసాగుతోంది. అయితే, అకాడెమియా సినికా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌కు చెందిన ఎడ్వర్డ్ ఏష్టన్ మరో 62 చంద్రులు శని గ్రహం చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు గుర్తించారు. హవాయిలోని మౌనాకియాపై ఏర్పాటు చేసిన టెలీస్కోప్‌లో 2019–21 మధ్య నమోదైన డేటా ఆధారంగా సాగిస్తున్న పరిశోధనల్లో ఈ విషయం తేలిందన్నారు. సౌర కుటుంబంలో అత్యధిక చంద్రులతో 'మూన్‌కింగ్' కిరీటాన్ని శని దక్కించుకున్నట్లయిందని ఆయన తెలిపారు.

అదే తీరు.. అదే తకరారు!

కాంగ్రెస్‌కు సవాలుగా మారిన కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక

పలు రాష్ట్రాల్లో సీఎం ఎంపికలో తప్పటడుగులు

దాంతో నిత్యం గ్రూప్ విభేదాలు, పార్టీకి ఓటములు



దక్షిణాదిన కీలక రాష్ట్రం కర్ణాటక బీజేపీ నుంచి కాంగ్రెస్ చేతిలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన కాంగ్రెస్ కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయడంలో మాత్రం ఇక్కట్లు ఎదుర్కొంటోంది. సీఎం కుర్చీ కోసం ఇద్దరు హేమాహేమీలు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ పోటీ పడుతున్నారు. ఎవరిని ఎంపిక చేయాలో తేల్చుకోలేక కాంగ్రెస్ అధిష్టానం తలపట్టుకుంటోంది. ఈ పరిణామం చివరకు ఎటు దారి తీస్తుందో తెలియక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల్లో నెగ్గడం కంటే కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయడమే పెద్ద సవాలుగా మారడం గమనార్హం. గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌లో ఇలాంటి విపత్కర పరిస్థితి ఇదే మొదటిసారి కాదు. సుదీర్ఘ కసరత్తు తర్వాత సీఎంను నియమించినప్పటికీ పార్టీలో, ప్రభుత్వంలో లుకలుకలు కొనసాగడం, అసంతృప్త సెగలు రగలడం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ప్రత్యేకత. నిర్ణయాలు తీసుకోవడంలో తడబాటే కాంగ్రెస్‌కు గ్రహపాటుగా మారుతోంది. సీఎంలను ఎంపిక చేయడంలో తప్పటడుగులు వేయడం, ఆ తర్వాత ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోలేక ఉక్కిరిబిక్కిరి కావడం ఆ పార్టీలో ఒక ఆనవాయితీగా మారింది. ఇదే కాంగ్రెస్ సంస్కృతి అని సరిపెట్టుకోవాలేమో!

అశోక్ గహ్లోత్ వర్సెస్ పైలట్

రాజస్తాన్‌లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. పీసీసీ చీఫ్, యువ నాయకుడు సచిన్ పైలట్ సీఎం పోస్టు ఆశించారు. తన నాయకత్వంలోనే పార్టీ గెలిచినందున పదవి తనకే దక్కుతుందని భావించారు. కానీ సోనియా కుటుంబం మరోలా ఆలోచించింది. కారణాలేమైనా సీనియర్ నేత అశోక్ గహ్లోత్‌ను సీఎం చేసింది. దాంతో పార్టీ రెండు వర్గాలుగా చీలింది. పైలట్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుబాటు చేశారు. 2021లో ప్రభుత్వాన్ని కూల్చేందుకు విఫలయత్నం ప్రయత్నించారు. సమస్య పరిష్కారానికి 2022లో గహ్లోత్‌ను ఏఐసీసీ అధ్యక్షుడిగా, పైలట్‌ను సీఎంగా నియమించేందుకు పార్టీ పెద్దలు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ కుర్చీ వీడేందుకు గహ్లోత్ అంగీకరించలేదు. ఈ విషయమై పెద్ద హైడ్రామానే నడిచింది. చివరికి అధిష్టానమే దిగిరాక తప్పలేదు. పైలట్‌కు సీఎం కుర్చీ ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. రాజస్తాన్‌లో గహ్లోత్ సర్కారుపై పైలట్ యుద్ధం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. రెండు వర్గాల మధ్య సయోధ్య సాధ్యం కావడం లేదు. అధిష్టానం కూడా చేతులెత్తేసినట్లే కనిపిస్తోంది.

అస్సాం చేజారింది

ఈశాన్య భారతదేశంలో కీలక రాష్ట్రం అస్సాం. ఈ రాష్ట్రం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. రాహుల్ గాంధీ వ్యవహార శైలి పట్ల విసుగెత్తిపోయిన హిమంత బిశ్వ శర్మ 2015లో బీజేపీలో చేరారు. తర్వాత ఎన్నికల్లో నెగ్గి ఆ పార్టీ తరపున ముఖ్యమంత్రి అయ్యారు. అస్సాం బీజేపీ ఖాతాలో చేరింది. అక్కడ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభావం గాలిలో దీపమే.

ఛత్తీస్‌గఢ్‌లోనూ...

ఛత్తీస్‌గఢ్‌లో సైతం కాంగ్రెస్ పరిస్థితి గొప్పగా లేదు. పార్టీలో గ్రూప్‌లు భగ్గుమంటున్నాయి. తనను ముఖ్యమంత్రిని చేస్తామని కాంగ్రెస్ అధిష్టానం హామీ ఇచ్చిందని, ఇప్పటికీ నిలబెట్టుకోలేదని సీనియర్ నేత టీఎస్ సింగ్ దేవ్ ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పెద్దలపై, సీఎం భూపేష్ భగేల్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు.

మధ్యప్రదేశ్‌ను వదిలేసుకున్నారు

మధ్యప్రదేశ్‌లోనూ చేతికందిన అధికారం కాంగ్రెస్ తప్పిదంతో చేజారింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవగానే జ్యోతిరాదిత్య సింధియా సీఎం పదవి డిమాండ్ చేశారు. సోనియా కుటుంబం కమల్‌నాథ్ వైపు మొగ్గింది. దాంతో సింధియా 2020లో తన వర్గం ఎమ్మెల్యేలతో బీజేపీలో చేరారు. మెజార్టీ లేక కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయింది. ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఒప్పందంలో భాగంగా జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మిగిలింది గుండు సున్నా.

పంజాబ్‌లో పరాభవం

పంజాబ్‌లో ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, పీసీసీ అధ్యక్షుడు నవజోత్ సింగ్ సిద్ధూ మధ్య విభేదాలు కాంగ్రెస్ కొంప ముంచాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. సిద్ధూ సీఎం పదవిని కోరుకున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధిష్టానం దళిత కార్డు ప్రయోగించింది. చరణ్‌జిత్ సింగ్ చన్నీని సీఎంగా గద్దెనెక్కించింది. అమరీందర్ సింగ్ సొంత దారి చూసుకున్నారు. ఎన్నికల్లో సిద్ధూ వర్గం సహాయ నిరాకరణ చేసింది. ఫలితంగా ఆమ్ ఆద్మీ పార్టీకి అధికారం దక్కింది.

ఎందుకు ఈ పరిస్థితి?

అధికార బీజేపీలో మోదీయే ఏకైక పవర్ సెంటర్. పార్టీలో ఆయన మాటకు తిరుగులేదు. ఎవరిని సీఎంగా నియమించాలన్నా మోదీదే తుది నిర్ణయం. కాంగ్రెస్‌లో అలా కాదు. సోనియా, రాహుల్, ప్రియాంక రూపంలో మూడు పవర్ సెంటర్లున్నాయంటారు. డీకే శివకుమార్‌కు సోనియా అండదండలుంటే ప్రియాంక మాత్రం సిద్ధరామయ్య వైపు మొగ్గుతుంటే రాహుల్ సైతం ఆమెను సమర్థిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ''రాష్ట్రాల్లో ఎవరో ఒక్కరే శక్తివంతులుగా పెత్తనం చెలాయించడం కాంగ్రెస్ అధిష్టానానికి ఇష్టముండదు. అభద్రతాభావమే ఇందుకు కారణం. అందుకే పలు పవర్ సెంటర్లను ప్రోత్సహిస్తుంది'' అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కృత్రిమ తీపి పదార్థాలు ప్రమాదకరం

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక



న్యూఢిల్లీ: అధిక బరువు నియంత్రణలో కృత్రిమ తీపి పదార్థాలతో దీర్ఘ కాలంలో ఎటువంటి ప్రయోజనం ఉండదని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) స్పష్టం చేసింది. పైగా వీటితో టైప్–2 డయాబెటిస్, గుండె జబ్బులతోపాటు పెద్దల్లో ఆకస్మిక మరణాల ముప్పు పొంచి ఉందని కూడా తన తాజా సిఫారసుల్లో హెచ్చరించింది. శాకరిన్, సుక్రలోజ్ వంటి వివిధ కృత్రిమ తీపి పదార్థాలను ప్యాకేజ్డ్ ఆహార పానీయాల్లో వాడుతుంటారు. చక్కెరకు ప్రత్యామ్నాయంగా వీటిని విడిగానూ విక్రయిస్తారు. అయితే, చిన్నారుల్లో బరువు నియంత్రణలో ఈ కృత్రిమ తీపి పదార్థాలు ఎటువంటి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించవని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. అందుకే, చక్కెర పదార్థాలను తీసుకోవడాన్ని తగ్గించుకునేందుకు కృత్రిమ తీపి పదార్థాలు(ఎన్ఎస్ఎస్)లకు ఇతర ప్రత్యామ్నాయాలను అనుసరించాలని సూచించింది. సహజ చక్కెరలు కలిగి ఉండే పండ్లు, చక్కెర లేని ఆహార పానీయాలను తీసుకోవడం మంచిదని డబ్ల్యూహెచ్‌వో న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ ఫ్రాన్సెస్కో బ్రాంకా తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే చిన్నప్పటి నుంచి తక్కువ తీపి ఆహారం తీసుకోవాలన్నారు. ''మందులు, స్కిన్‌క్రీమ్స్ వంటి ఉత్పత్తుల్లో ఎన్ఎస్ఎస్‌ను ఉపయోగించవచ్చు. తక్కువ కేలరీలుండే తీపి పదార్థాలు, షుగర్ ఆల్కహాళ్లకు కూడా ఈ సిఫారసు వర్తించదు. కేలరీలుండే ఇవి కృత్రిమ తీపి పదార్థాల జాబితాలోకి రావు'' అని డబ్ల్యూహెచ్‌వో వివరించింది.

నేడే విడుదల!

కర్ణాటక సీఎంపై అదే పీటముడి ● హస్తినలో రోజంతా రాజకీయ వేడి

సిద్ధూ, డీకేలతో అధిష్టానం చర్చలు

- పట్టు వీడేందుకు ఇద్దరూ ససేమిరా
- నేడు కర్ణాటకకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
- అందరితో మాట్లాడి నేడు నిర్ణయం!





మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో డీకే శివకుమార్, సిద్ధరామయ్య

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. పదవి కోసం పట్టుబడుతున్న మాజీ సీఎం సిద్ధరామయ్యతో పాటు పీసీసీ డీకే శివకుమార్ కూడా మంగళవారం హస్తిన చేరుకున్నారు. వారిలో ఎవరిని ఎంచుకోవాలనే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం ఈ విషయమై రోజంతా మల్లగుల్లాలు పడింది. అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సహా అగ్ర నేతలంతా అటు సిద్ధూ డీకేలతో, ఇటు తమలో తాము ఉదయం నుంచి రాత్రి దాకా పెద్దలు చర్చోపచర్చల్లో మునిగిపోయారు. అయినా వారిద్దరిలో ఎవరూ పట్టు వీడకపోవడంతో ఎటూ తేలక నిర్ణయం బుధవారానికి వాయిదా పడింది. సిద్ధరామయ్య వైపే రాహుల్ మొగ్గారని, దాంతో ఆయనకు దాదాపుగా లైన్ క్లియరైనట్టేనని సాయంత్రానికి వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈడీ, సీబీఐ, ఐటీ కేసులు డీకేకు బాగా వ్యతిరేకంగా మారాయన్న ప్రచారం ఊపందుకుంది. అయితే సీఎంగా చాన్సివ్వని పక్షంలో ఎమ్మెల్యేగా కొనసాగుతానే తప్ప డిప్యూటీ సీఎం సహా మరే ప్రతిపాదనకూ అంగీకరించేది లేదని డీకే కుండబద్దలు కొట్టారంటున్నారు. సిద్ధూ కూడా రాజీలో భాగంగా డీకేకు ఆర్థికం వంటి కీలక శాఖలు అప్పగించేదుకు ససేమిరా అన్నట్టు చెబుతున్నారు. దాంతో సీఎం ఎంపికపై పీటముడి మరింత బిగుసుకుంది. బహుశా ఖర్గే బుధవారం బెంగళూరు వెళ్లి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలతో మరోసారి సంప్రదింపులు జరిపాక తుది నిర్ణయం వెలువడవచ్చని తెలుస్తోంది. మరో సీనియర్ నేత జి.పరమేశ్వర కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. అధిష్టానం కోరితే సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమని ప్రకటించారు. ''నాకు లాబీయింగ్ అవసరం లేదు. నేను చేసిన సేవలు అధిష్టానానికి తెలుసు'' అన్నారు.

టైం పడుతుంది: ఖేరా

అధిష్టానం పిలుపు మేరకు సిద్ధరామయ్య సోమవారమే ఢిల్లీ వెళ్లగా, తనకు సానుకూల సంకేతాలు లేవనే అసంతృప్తితో డీకే మాత్రం బెంగళూరుకే పరిమితం కావడం తెలిసిందే. మంగళవారం ఢిల్లీ వెళ్లిన ఆయన సాయంత్రం నేరుగా ఖర్గేతో భేటీ అయ్యారు. అరగంటకు పైగా చర్చలు జరిపారు. సీఎం పదవి దక్కకుంటే రాజీనామా చేస్తానన్న వార్తలను అంతకుముందు ఆయన తీవ్రంగా ఖండించారు. ''పార్టీ నా తల్లి వంటిది. మేమంతా కలిసి నిర్మించుకున్న పార్టీని వీడే ప్రసక్తే లేదు'' అని మీడియాకు స్పష్టం చేశారు. అలా ప్రసారం చేసే చానళ్లపై పరువునష్టం కేసు పెడతానని హెచ్చరించారు. రాహుల్‌ను కూడా కలుస్తారా అని ప్రశ్నించగా, నేతలందరినీ కలుస్తానని చెప్పారు. ఆ తర్వాత సిద్ధరామయ్య వెళ్లి ఖర్గేను కలిశారు. అంతకుముందు రాహుల్ కూడా రణ్‌దీప్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌తో కలిసి ఖర్గే నివాసానికి వెళ్లి గంటన్నరకు పైగా మంతనాలు జరిపారు. తర్వాత వేణుగోపాల్ మళ్లీ రాహుల్ నివాసానికి వెళ్లి మరో దఫా చర్చలు జరిపారు. సిద్ధరామయ్య కూడా ఖర్గేతో భేటీ అనంతరం వేణుగోపాల్ నివాసానికి వెళ్లి ఆయనతో చర్చించారు. బహుశా రాహుల్ సందేశాన్ని సిద్ధూకు వేణుగోపాల్ అందించారని భావిస్తున్నారు. సీఎం అభ్యర్థిపై నిర్ణయం తీసుకోవడం అంత సులువు కాదని ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా అన్నారు. ''సీఎంను ఢిల్లీ నుంచి రుద్దలేం. ఎమ్మెల్యేలు, అందరితోనూ చర్చించి వారికి ఆమోదయోగ్యుడైన నాయకున్ని ఎంపిక చేయాల్సి ఉంటుంది. అందుకు సమయం పడుతుంది'' అని హైదరాబాద్‌లో మీడియాకు చెప్పుకొచ్చారు.

30న పార్లమెంట్ నూతన భవనం ప్రారంభం!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనం దాదాపు సిద్ధమయ్యింది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా సిద్ధమవుతుందని అధికారులు చెబుతున్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 30వ తేదీన నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధానమంత్రి స్వయంగా ప్రారంభిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జూలైలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కొత్త భవనంలోనే నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి దాకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి 2020 డిసెంబర్‌లో ప్రధాని మోదీ పునాది రాయి వేసిన సంగతి తెలిసిందే. నిర్మాణ పనులను టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. నిజానికి ముందుగా నిర్దేశించిన డెడ్‌లైన్ ప్రకారం గత ఏడాది నవంబర్ నాటికే నిర్మాణం పూర్తికావాలి. కొన్ని అవాంతరాల వల్ల దాదాపు ఆరు నెలలు ఆలస్యమైంది. ప్రధాని మోదీ సూచనలకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా కొత్త పార్లమెంట్ బిల్డింగ్ నిర్మించారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టుపై గూఢచర్యం కేసు

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఓ న్యూస్ పోర్టల్ కోసం భారత్‌లో పనిచేస్తున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టు వివేక్ రఘువంశీపై సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 120–బి(నేరపూరిత కుట్ర), అధికారిక రహస్యాల చట్టంలోని సెక్షన్ 3(గూఢచర్యం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. భారత రక్షణ శాఖతోపాటు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) ప్రాజెక్టులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించి, విదేశీ నిఘా సంస్థలకు చేరవేస్తున్నట్లు వివేక్ రఘువంశీపై ఆరోపణలు వచ్చాయి. ఆయనకు సంబంధించిన 12 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు నిర్వహించారు. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, జైపూర్‌లోని పలు ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. రక్షణ శాఖ భవిష్యత్తులో కొనుగోలు చేయాలనుకుంటున్న ఆయుధాల వివరాలను సైతం వివేక్ రఘువంశీ సేకరించాడని అధికారులు చెబుతున్నారు.

వెకేషన్ బెంచ్ ముందు కొత్తగా 300 కేసులు: సీజేఐ

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు వేసవి సెలవుల్లో తొలివారంలోనే వెకేషన్ బెంచ్ ముందు 300 తాజా కేసులను జాబితాలో చేర్చనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. వెకేషన్ బెంచ్ న్యాయమూర్తుల అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సమయంలో హైబ్రిడ్ విచారణలకు అనుమతి ఇస్తున్నామని, ఎక్కడి నుంచైనా న్యాయవాదులు వాదనలు వినిపించుకోవచ్చని పేర్కొంది. అయితే తగినవిధంగా మంచి దుస్తులు ధరించాలంటూ జస్టిస్ పీఎస్ నరసింహ వ్యాఖ్యానించారు. వెకేషన్ బెంచ్‌లు సాధారణంగా అత్యవసర విచారణ, అవసరమయ్యే అంశాలు మాత్రమే వింటాయి. బెంచ్ అంగీకరిస్తేనే తాజా కేసులు తీసుకుంటారు. మే 22 నుంచి జులై 3 వరకూ సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు.

మసీదు మెట్ల కింద...శ్రీకృష్ణ విగ్రహం

ఇప్పించాలంటూ కోర్టుకెక్కిన ట్రస్టు

లఖ్‌నవూ: ఆగ్రాలోని జామా మసీదు మెట్ల కింద కృష్ణుని విగ్రహముందని శ్రీకృష్ణ జన్మభూమి సంరక్షిత్ సేవా ట్రస్ట్ ఆరోపించింది. దాన్ని తమకు తిరిగి ఇప్పించాలంటూ కోర్టుకెక్కింది. దీనిపై మే 31లోగా స్పందించాలంటూ షాహీ మస్జిద్ ఆగ్రా ఫోర్ట్ ఇంతజామియా కమిటీ సహా పలువురికి కోర్టు నోటీసులు జారీ చేసింది. తమ వాదనకు మద్దతుగా ఎన్నో రుజువులున్నాయని ట్రస్ట్ చైర్మన్ మనోజ్‌కుమార్ పాండే వాదిస్తున్నారు. వాటిని కోర్టుకు సమర్పిస్తానని చెబుతున్నారు. మెట్ల తవ్వకం మొదలుకుని అన్ని ఖర్చులూ ట్రస్టే భరిస్తుందని ఆయన అన్నారు. ''కేశవ్‌దేవ్ ఆలయాన్ని 1670లో ఔరంగజేబ్ నేలమట్టం చేసి కేశవదేవ్ విగ్రహాన్ని జామా మసీదు మెట్ల కింద పూడ్చినట్టు చారిత్రక ఆధారాలెన్నో ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.

ఉద్యోగ నియామకాల్లో అవినీతి, బంధుప్రీతి అంతం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి ● రోజ్‌గార్ మేళాలో 71,000 మందికి నియామక పత్రాలు



న్యూఢిల్లీ: ఉద్యోగ నియామకాల వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సమూల మార్పులతో అవినీతి, బంధుప్రీతికి అవకాశాలు అంతమయ్యాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా ఆయన మంగళవారం 71,000 మందికి నియామక పత్రాలను వర్చువల్ కార్యక్రమంలో అందజేశారు. వీరికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభించాయి. ఆ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం నుంచి తుది ఫలితాలు ప్రకటించే దాకా మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేశామని వివరించారు. నియామకాల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా, పక్షపాత రహితంగా మార్చామని అన్నారు. గ్రూప్–సి, గ్రూప్–డి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రద్దు చేశామని తెలిపారు. గత తొమ్మిదేళ్ల బీజేపీ పరిపాలనలో దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయని, మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగం పుంజుకుందని ఉద్ఘాటించారు. సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం ఇదే రోజు(మే 16)న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని గుర్తుచేశారు. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' స్ఫూర్తితో తమ ప్రయాణం ఆనాడే మొదలైందన్నారు. 'వికసిత్ భారత్' కోసం శ్రమిస్తున్నామని చెప్పారు. ఇదే రోజు సిక్కిం రాష్ట్ర హోదా పొందిందని వివరించారు.

దేశమంతటా కొత్త ఉద్యోగాల సృష్టి

మన దేశంలో 2018–19 నుంచి ఇప్పటిదాకా 4.5 కోట్ల మంది ఉద్యోగాలు పొందారని, ఈపీఎఫ్ఓ గణాంకాలను బట్టి ఈ విషయం నిరూపణ అవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) పెరుగుతున్నాయని, మన ఎగుమతులు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని, దేశంలో ప్రతిమూలనా కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టి కొనసాగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతుతో కొత్త కొత్త రంగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని, ఉద్యోగాల స్వరూప స్వభావాలు మారిపోతున్నాయని వెల్లడించారు. ఇకస్టార్టప్ రంగం ఆకాశమే హద్దుగా ఎదుగుతోందని అన్నారు. 2014 కంటే ముందు దేశంలో కేవలం కొన్ని వందల సంఖ్యలో స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య లక్షకు చేరిందని తెలియజేశారు. స్టార్టప్ కంపెనీల్లో 10 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. యువత సంక్షేమం, అభివృద్ధి పట్ల తమ అంకితభావం, చిత్తశుద్ధికి రోజ్‌గార్ మేళాలే నిదర్శనమని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి ఇప్పుడు జరుగుతోందని వివరించారు. పేదల కోసం 4 కోట్ల పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చామన్నారు. దేశంలో ఇప్పుడు యూనివర్సిటీల సంఖ్య 1,100కు, మెడికల్ కాలేజీల సంఖ్య 700కు చేరిందన్నారు.



డాక్టరైన మహిళా కండక్టర్

బస్సులో గర్భిణికి ప్రసవం

బనశంకరి: కర్ణాటక రాష్ట్ర ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో మహిళా కండక్టర్ డాక్టర్‌గా మారి సురక్షితంగా కాన్పు చేశారు. చిక్కమగళూరు డిపోకు చెందిన కేఎస్ఆర్‌టీసీ బస్సు సోమవారం బెంగళూరు నుంచి చిక్కమగళూరుకు వెళ్తోంది. బెంగళూరు నుంచి బేలూరుకు ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి ప్రసవ వేదన ఆరంభమైంది. బస్సు వెళ్లే మార్గంలో 16 కిలోమీటర్ల వరకూ ఎలాంటి ఆసుపత్రి లేదు. దీంతో బస్సులోని మహిళా కండక్టర్ ఎస్.వసంతమ్మ బస్సును నిలిపి ప్రయాణికులను కిందికి దించేశారు. ఆమె గర్భిణికి కాన్పు చేయగా ఆడపిల్ల పుట్టింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. మహిళ నిరుపేద కావడంతో చేతిలో ఖర్చులకు కూడా డబ్బులు లేవు, ఆమె పరిస్థితిని గమనించి కండక్టర్, డ్రైవరు ప్రయాణికులు కలిసి రూ.1,500 సేకరించి అందజేశారు. తరువాత అంబులెన్స్ ద్వారా శాంతిగ్రామ ఆసుపత్రిలో చేర్చారు. మహిళా కండక్టర్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 17 । మే । 2023



అంజన్న ఆదాయం రూ.1.30కోట్లు

మల్యాల: కొండగట్టు అంజన్న పెద్ద జయంతి సందర్భంగా సుమారు రూ.1,30,43,525 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్ మంగళవారం తెలిపారు.



ఒకే ఒక్కడు

కరీంనగర్ అర్బన్: ప్రజల ప్రాణాలకు భరోసాగా ఆహార ఉత్పత్తుల విక్రయాలు జరగాల్సి ఉండగా.. అలంకారప్రాయంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీస్ మిగలడం విమర్శలకు తావిస్తోంది. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
41.0/28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉల్లిగడ్డ బస్తాకు రూ.50

- ఎగబడిన జనం



శంకరపట్నం: శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో ఉల్లిగడ్డ బస్తాను రూ.50కే విక్రయించారు. దీంతో జనాలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలో ఉల్లిగడ్డలు కొనుగోలు చేసి వరంగల్ మార్కెట్‌లో విక్రయించేందుకు లారీలో తీసుకొచ్చారు. వరంగల్ మార్కెట్లో ఉల్లిగడ్డకు గిట్టుబాటు కాకపోవడంతో నాగపూర్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్య శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో ఓ హోటల్ వద్ద లారీ నిలిపిన డ్రైవర్ బస్తా ఉల్లిగడ్డకు రూ.50 విక్రయించడంతో కరీంనగర్–వరంగల్ రహదారిపై వెళ్తున్న వాహనదారులు, కొత్తగట్టు గ్రామస్తులు ఎగబడి కొనుగోలు చేశారు. లారీ ఖాళీకావడంతో డ్రైవర్ వెళ్లిపోయాడు. కాగా సదరు ఉల్లిగడ్డను వ్యాపారికి తెలియకుండానే డ్రైవర్ అమ్ముకున్నాడా, వ్యాపారి పురమాయించి అమ్మించాడా అనే చర్చ జరుగుతోంది.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో బుధవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ప్రకటించారు. కరీంనగర్ నగరంలోని 2,38,39,43,54,60వ డివిజన్‌లలో, హుజురాబాద్ పట్టణం 2వ వార్డు, అదే మండలం రంగాపూర్ గ్రామంలో, జమ్మికుంట పట్టణంలోని 18వ వార్డు, అదే మండలం జగ్గయ్యపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. వీణవంక మండలం నర్సింగాపూర్, లింగాపూర్, వెల్ది, చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి, కొండాపూర్, చొప్పదండి మండలం భూపాలపట్నం, గంగాధర మండలం అచంపల్లి, రామడుగు మండలం వెదిర, కొత్తపల్లి మండలం ఎలగందుల, నాగులమల్యాల, మానకొండూరు మండలం ఖాదర్‌గూడెం, సైదాపూర్ మండలం సర్వాయిపేట్, ఆకునూర్, కేశవపట్నం మండలం కన్నాపూర్, రాజాపూర్, తిమ్మాపూర్ మండలం జూగుండ్ల, మల్లాపూర్ గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ బధిరుల (మూగ, చెవిటి) ఆశ్రమ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి బాల బాలికలకు 1 నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, 1 నుంచి 10వ తరగతి తెలుగు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.నాగలక్ష్మి తెలిపారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోని చెవిటి, మూగ (బధిర) బాల బాలికలకు ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలలో అడ్మిషన్ పొందిన మూగ, చెవిటి విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్య పుస్తకములు, నోటు పుస్తకములు, స్కూలు యూనిఫాం, భోజనంతో పాటు వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. అడ్మిషన్ పొందేవారు కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ వద్ద గల ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దూరప్రాంతాల వారు వివరాల కోసం 90000 13639, 90002 21301, 96668 68755, 91545 78253 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

పైసల్ పడ్తలేవు!

- వారం కిందనే ధాన్యం విక్రయించిన రైతులు
- ఇంతవరకు ఖాతాల్లో జమకాని యాసంగి డబ్బులు
- డబ్బుల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా.. మారని పరిస్థితి



తేదీ 15-05-2023 వరకు ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	సేకరించిన ధాన్యం	మిల్లులకు తరలించింది	మిగిలింది
కరీంనగర్	1,36,064.496	1,34,948.957	1,115.539
జగిత్యాల	1,59,627.092	1,39,929.690	19,697.402
పెద్దపల్లి	1,00,763.720	97,667.340	3,096.380
రాజన్నసిరిసిల్ల	92,948.940	85,073.420	7,875.520
మొత్తం	4,89,404.248	4,57,619.407	31,784.841

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆరుగాలం కష్టపడి కష్టనష్టాలకు ఓర్చి, వడగండ్లు, కడగండ్లను దాటుకుని కొనుగోలుకేంద్రాలకు చేర్చిన ధాన్యం అకాల వర్షానికి కొట్టుకుపోగా మిగిలిన పంటను రైతులు అమ్ముకున్నారు. విక్రయించి వారం దాటినా.. ఇంతవరకూ నయాపైసా జమకాకపోవడంపై అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. వేసవికాలం పంట కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా.. ఇంకా డబ్బులు రైతుల ఖాతాలో పడకపోయేసరికి రైతు కుటుంబాలు దిగులు చెందుతున్నాయి.

తగ్గిన దిగుబడి

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా రైతులంతా వరిసాగుకే మొగ్గుచూపుతారు. ఈసారి మార్చిలోనే ఈదురుగాలులు వడగండ్లతో వాణిజ్యపంటలు నేలమట్టమయ్యాయి. చాలాచోట్ల వరిపంట కూడా దెబ్బతింది. కానీ, ప్రకృతి కోపానికి ఎదురొడ్డి నిలిచి, వాతావరణ ప్రతికూలతలు తట్టుకుని నిలబడినా వరికోత సమయానికి అకాలవర్షాలు, వడగండ్లు వరుసగా దాడి చేశాయి. పంట దిగుబడి చాలా తగ్గింది. కరీంనగర్‌లో 2.71 లక్షలు, పెద్దపల్లిలో 2.00 లక్షలు, జగిత్యాలలో 2.97 లక్షలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాల చొప్పున పంట వేశారు. ఇందులో కరీంనగర్‌లో దాదాపు 56,066, సుమారు జగిత్యాలలో 65,794, సిరిసిల్లలో సుమారు 18,230 ఎకరాలు, పెద్దపల్లిలో దాదాపు 36,596 ఎకరాల మేర పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు సర్వే ద్వారా నిర్ధారించారు. ఈ గణాంకాల్లో స్వల్ప వ్యత్యాసాలు కూడా ఉండొచ్చు.

వారంరోజులు దాటినా.. అందని డబ్బులు..

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించింది. వెంటనే కేంద్రాలు ప్రారంభించింది. ఎంతో కష్టపడి చివరికి అన్నదాతలు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అక్కడా మళ్లీ గాలులు, వడగండ్లతో ప్రకృతి పగబట్టిందా? అన్న స్థాయిలో వరుణదేవుడు విరుచుకుపడ్డాడు. వర్షపునీటికి కొట్టుకుపోగా మి గిలిన ధాన్యాన్ని ఎట్టకేలకు విక్రయించారు. విక్రయించే సమయంలోనూ తాలు, గడ్డి, మట్టిబెడ్డలు, తేమ శాతం పేరు చెప్పి క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు తరుగు పేరిట రైతులను కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ధాన్యాన్ని విక్రయించిన చాలా మంది రైతులు వారం గడిచినా డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము వడ్డీలకు అప్పులు తె చ్చి పెట్టుబడి పెట్టామని వీలైనంత త్వరగా ఖాతా ల్లో డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

డబ్బులు పడలేదు



నేను ఈ నెల 4వ తేదీన ధాన్యం కాంట వేశారు. 9వ తేదీన రిసిప్ట్ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. సెంటర్ నిర్వాహకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే డబ్బులు జమ చేయాలి.

– పాకాల అనిల్‌రెడ్డి, జగ్గయ్యపల్లి, మానకొండూరు

వారం రోజులు అవుతుంది



ఈ సీజన్‌లో 90 క్వింటాళ్ల వరి ధాన్యం పండింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించి వారం రోజులు అయ్యింది. లారీలో ధాన్యం తరలించారు. ఇప్పటికి నాకు డబ్బులు రాలేదు.

– ఆకుల పెద్ద గంగారెడ్డి, కథలాపూర్

పది రోజులైంది



నాలుగు ఎకరాలలో ఈ యాసంగిలో వరి పంట వేసిన. నాలుగు ఎకరాలలో 230బస్తాల (40కిలోల సంచి)దిగుబడి వచ్చింది. పది రోజుల క్రితం ధాన్యంను కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్న. క్వింటాలకు 4.60 కిలోల తరుగు పేరుతో కటింగ్ పెట్టారు. ఇన్నిరోజులవుతున్నా పైసలు పడలేదు.

– మారం తిరుపతిరెడ్డి, రైతు, హిమ్మత్‌నగర్, వీణవంక

నిర్లక్ష్యంతోనే ఆలస్యం



గతంలో పది రోజులో డబ్బులు జమ అయ్యేవి.. కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ చేస్తే ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైతుల జాబితాను, వారి వద్ద ఎంత మొత్తంలో ఆమ్మకం చేశారో ఆన్‌లైన్ చేస్తే వెంటనే బ్యాంకు ఖాతాలో అధికారులు జమ చేసేవారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతుంది.

– గెల్లు చిరంజీవి, యాదవ్‌నగర్, సుల్తానాబాద్

ఆ గ్రామాలు విలీనమయ్యేనా..!



నగరంలో విలీనమైన శ్రీపురంకాలనీ ప్రాంతం

- బొమ్మకల్, మల్కాపూర్, చింతకుంటలపై చర్చ
- విస్తరణ దిశగా కరీంనగర్ నగరపాలక సంస్థ
- ఆరు నెలల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ
- ఆ లోగానే నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలకసంస్థలో సమీప గ్రామాల విలీన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కేవలం ఆరు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు రానుండడం, మేజర్ పంచాయతీలను మున్సిపాల్టీలుగా మారుస్తారనే ప్రచారంతో ఏయే గ్రామాలు ఏం కానున్నాయనే చర్చ ఇప్పటి నుంచే మొదలైంది. గతంలో నగరంలో అంతర్భాగంగా ఉన్న గ్రామాలు సైతం కార్పొరేషన్‌లో విలీనం కాలేదు. ఈ సారి ఆ గ్రామాలు కూడా కలుపుతారని, లేదంటే ప్రత్యేక మున్సిపాల్టీలుగా మారుస్తారనే వాదన ఉంది. మరో వైపు గ్రేటర్ కరీంనగర్ అంశం కూడా నేతల అంతర్గత చర్చల్లో భాగమవుతోంది.

కలిసే ఉన్నా.. కలుపరెందుకో..!

కరీంనగర్ మున్సిపాల్టీ నగరపాలకసంస్థగా రూపాంతరం చెందిన తరువాత నగరం శరవేగంగా విస్తరిస్తోంది. జనాభా పెరుగుతోంది. కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి. సమీప గ్రామాలు పట్టణీకరణను సంతరించుకుంటున్నాయి. 1987లో మున్సిపాల్టీగా మారిన కరీంనగర్‌ను 2005లో కార్పొరేషన్‌గా మార్చారు. అప్పటికీ కార్పొషన్ స్థాయి సరిపోవడం లేదని, సమీపగ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదన తీసుకొచ్చారు. కోర్టు కేసులు, తదితర కారణాలతో విలీన ప్రక్రియ సాగుతూ వచ్చింది. చివరకు 2019 మార్చి 13న సమీప గ్రామాలైన కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, సీతారాంపూర్, ఆరెపల్లి, రేకుర్తి, పద్మనగర్, తిమ్మాపూర్ మండలం అల్గునూరు, మానకొండూరు మండలం సదాశివపల్లి గ్రామాలను నగరపాలక సంస్థలో విలీనం చేశారు. అయితే అప్పటికే కరీంనగర్‌లో అంతర్భాగంగా ఉన్న బొమ్మకల్, మల్కాపూర్, చింతకుంటలను కలపకపోవడంపై విమర్శలు వచ్చాయి. ప్రధానంగా బొమ్మకల్‌లోని సగభాగం భౌగోళికంగా కరీంనగర్‌లో ఉంది. నగరంలోని శ్రీపురంకాలనీ, రిజ్వీచమాన్, కృష్ణానగర్, హౌసింగ్‌బోర్డుకాలనీల్లోని కొంత భాగం ఇప్పటికీ బొమ్మకల్ పంచాయతీ పరిధిలోనే ఉండడం గమనార్హం.

ఆరు నెలల్లోపే నిర్ణయం

గ్రామపంచాయతీ ఎన్నికలు మరో ఆరు నెలల్లో రానున్నాయి. గత ఎన్నికలు 2019 జనవరిలో వివిధ దశల్లో జరుగగా, 2024 జనవరితో ప్రస్తుత పదవీకాలం ముగియనుంది. మరో ఆరు నెలల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఆ లోగానే విలీన గ్రామాలపై నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి పంచాయతీ ఎన్నికలు జరిగితే నూతన పాలకవర్గం కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది కాబట్టి, ఆ గ్రామాలను కార్పొరేషన్‌లో ఐదేళ్ల వరకు విలీనం చేయడానికి కుదరదు. విలీనం చేయాలని నిర్ణయించే గ్రామాలను ముందుగానే నిర్ణయిస్తే ఎన్నికలకు దూరంగా ఉంటాయి. దీంతో ఇప్పటి నుంచే గ్రామాల విలీనంపై ప్రచారం జోరుగా సాగుతోంది.

ఈ సారికి తప్పదా..!

గతంలో విలీనం కాని గ్రామాలు సైతం ఈసారి కార్పొరేషన్‌లో కలవక తప్పదని అధికారులు చెబుతున్నారు. కొన్ని ఒత్తిడిల ఫలితంగా గతంలో ఆయా గ్రామాలు కలవనప్పటికీ ఈసారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చని వారంటున్నారు. కరీంనగర్‌కు దూరంగా ఉన్న వల్లంపహాడ్, సదాశివపల్లి, అల్గునూరును కార్పొరేషన్‌లో కలిపినా నగరంలోనే ఉన్న బొమ్మకల్‌ను కలుపకపోవడం అప్పట్లో కలకలం సృష్టించింది. కరీంనగర్‌కు అతి సమీప గ్రామాల్లో మిగిలిన బొమ్మకల్, మల్కాపూర్, చింతకుంట ఈ సారి కార్పొరేషన్‌లో కలవడం లాంఛనమనే అభిప్రాయముంది.

బొమ్మకల్ ప్రత్యేక మున్సిపాలిటీ..?

ఇదిలాఉంటే మేజర్ గ్రామపంచాయతీ అయిన బొమ్మకల్‌ను మున్సిపాల్టీగా మార్చే ఆలోచన కూడా ప్రభుత్వ పెద్దలు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. కరీంనగర్‌కు సమీపంలోని కొత్తపల్లిని మున్సిపాల్టీ చేసినట్లుగానే బొమ్మకల్‌నూ జనాభా ఆధారంగా దుర్శేడ్, గోపాల్‌పూర్ తదితర అవసరమైన గ్రామాలు కలుపుకొని మున్సిపాల్టీ చేసే అంశం పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బొమ్మకల్‌ను ప్రత్యేక మున్సిపాల్టీగా చేసే అవకాశాలు తక్కువని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కొట్టిపారేస్తున్నారు. మరోవైపు నగరపాలకసంస్థకు తోడు కొత్తపల్లి మున్సిపాల్టీ, బొమ్మకల్ తదితర గ్రామాలను కలుపుకొని సరిపడా జనాభాతో గ్రేటర్ కరీంనగర్‌గా ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ప్రభుత్వం వద్ద ఉన్నట్లు సమాచారం. ఏదేమైనా ఆరునెలల లోపు నిర్ణయం తీసుకోవాల్సి ఉండడంతో మరోసారి నగరపాలకసంస్థలో గ్రామాల విలీన అంశం చర్చకు దారితీస్తోంది.

చీఫ్ మినిస్టర్ కప్ పోటీలు విజయవంతం చేయాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోటీల నిర్వహణపై అధికారులు, సీఎం కప్ కమిటీ, ఒలింపిక్ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 24 వరకు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పురుషులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 10గంటల లోపు, సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి 22 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాతవరణంలో వస్తున్న మార్పులతో డెంగీ, తదితర వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతీ మంగళ, శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించేలా చూడాలన్నారు. తడి, పొడిచెత్తను వేరుచేసి డంపింగ్ యార్డులకు తీసుకెళ్లేలా చూడాలని, డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించి, రోడ్లవెంట ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, డీఈఓ జనార్దన్ రావు, డీఆర్డీఓ శ్రీలత, డీపీఓ వీరబుచ్చయ్య, డీఎంహెచ్‌వో లలితాదేవి, క్రీడాశాఖ అధికారి రాజవీరు, ఆంజనేయులు, ఉద్యానవన అధికారి శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నతానియెల్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

- రూ.కోటితో చేపట్టే డివైడర్ల పునరుద్ధరణ పనులకు భూమిపూజ
- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్



భూమిపూజ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన మేయర్ వై.సునీల్‌రావు, తదితరులు

కరీంనగర్: కరీంనగర్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వానికి ప్రజలు బాసటగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కోర్టు చౌరస్తాలో కరీంనగర్ పట్టణంలో రూ.కోటితో చేపడుతున్న 14.5 కిలోమీటర్ల బీటీరోడ్డు, ధ్వంసమైన డివైడర్ల పునరుద్ధరణ పనులకు మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూ.110కోట్లతో నగరంలో 14.5 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం తవ్వడం, మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ లీకేజీతో, పలుచోట్ల గుంతలు పడ్డాయని, ప్రమాదాలతో డివైడర్లు కూలిపోవడం జరిగిందని, వాటి పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. దానిలో భాగంగా రూ.కోటితో డివైడర్ల సుందరీకరణ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. గతంలో కోపింగ్ స్క్వేర్ మోడల్‌లో ఉండేదని దానిని ఆఫ్‌కర్వ్ మోడల్‌గా తీర్చిదిద్దామన్నారు. గతంలో రోడ్డు పనులు రెన్యువల్ చేయాలంటే 15 నుంచి 20సంవత్సరాలు పట్టేదని, రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలకు మళ్లీ రోడ్ల పునరుద్ధరణ పనుల కోసం నిధులు కేటాయించడం జరిగిందని వెల్లడించారు. డివైడర్లకు పునరుద్ధరణ తర్వాత నగరం మొత్తం మళ్లీ బీటీలు వేస్తామని వెల్లడించారు. బీటీరోడ్డు నిర్మాణం అనంతరం రోడ్ సేఫ్టీతో వైట్ జీబ్రా మార్కింగ్, స్టడ్స్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, తోట రాములు, గుగ్గిళ్ల జయశ్రీ, సాంబశివరావు, డి.రవీందర్, ఏఈ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

వీణవంక @ 43 డిగ్రీలు

- జిల్లాలోనే అత్యధికంగా వీణవంకలో నమోదు
- ఉదయం 9గంటలకే ఇంటికి పరిమితం



వీణవంకలో ఉదయం 9గంటలకు వెలవెలబోతున్న బస్టాండ్

నాలుగు రోజులుగా వీణవంకలో ఉష్ణోగ్రతలు..

శనివారం	42డిగ్రీలు
ఆదివారం	46డిగ్రీలు
సోమవారం	44డిగ్రీలు
మంగళవారం	43డిగ్రీలు

వీణవంక: ఎండలు మండిపోతున్నాయి. రికార్డు స్థాయిలో దంచికొడుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికి తోడు వడగాలులు వీస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోనే అత్యధికంగా వీణవంక మండలంలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.నిత్యం రద్దీగా ఉండే మండలకేంద్రం జనాలు లేక బోసిపోయింది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఉదయం 9గంటలకే ఇంటికి చేరుకుంటుండగా సాయంత్రం 5గంటల వరకూ ఇంటినుంచి బయటకి వెళ్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో ఆదివారం వీణవంకలో 46డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా గత నాలుగు రోజులుగా 40డిగ్రీలు దాటుతోంది. గత 40ఏళ్లలో ఎప్పుడూ ఇంత ఎండలు లేవని మండల ప్రజలు చెప్తున్నారు. ఉక్కపోత బరించలేక గ్రామాలలో ఉదయం 8గంటలకే కూలర్లు మోత మోగుతున్నాయి. మరో మూడు రోజులు ఇదే స్థాయిలో ఎండలు దంచికొడుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులు ఇంకా పూర్తి కాలేదు. కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ఇంకా 20శాతం ధాన్యం నిల్వ ఉంది. ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుండటం రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ధాన్యం కొనుగోలు పూర్తి కావాలంటే ఇంకా వారం రోజులు పట్టే అవకాశం ఉంది.

క్వింటాల్ పత్తి ధర రూ.7,350

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,350 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 24 వాహనాల్లో 249 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.6,500 చెల్లించారు. గన్నీ సంచుల్లో ఏడుగురు రైతులు 15 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,900, మోడల్ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.5,000 పలికింది. మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మండిపడ్డారు. మంగళవారం బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సమస్యలకు నిలయంగా మారాయని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతుందని, రాష్ట్రానికి విద్యాసంస్థలను కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నా రాష్ట్ర బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నాయకులు సందీప్‌రెడ్డి, రాజేష్, బొల్లి సాయి, వినయ్‌రెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సీపీ సుబ్బరాయుడు

కరీంనగర్‌క్రైం: చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు ఇప్పారపు సదయ్య కుటుంబానికి మంగళవారం పోలీస్‌ కమిషనర్‌ ఎల్‌.సుబ్బరాయుడు ఆర్థికసాయం అందజేశారు. ఏప్రిల్‌ 29న సైదాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ఇప్పారపు సదయ్య (45) మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం హోంగార్డు భార్య జయ, కూతుర్లు వైష్ణవి, స్నేహితలకు సీపీ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కరీంనగర్‌ రూరల్‌ ఏసీపీ కరుణాకర్‌రావు, చొప్పదండి సీఐ రవీందర్‌, ఎస్సై ఉపేంద్రచారి పాల్గొన్నారు.

ఇంటర్‌ ఫెయిల్‌ అయ్యాడని విద్యార్థి ఆత్మహత్య



సాయివెంకట్‌(ఫైల్‌)

కరీంనగర్‌క్రైం: ఇంటర్‌ పరీక్షల్లో ఒక సబ్జెక్టు ఫెయిల్‌ అయ్యాడని మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్‌ వన్‌టౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన మహేషుని సాయి వెంకట్‌ (19) ప్రభుత్వ సైన్స్‌వింగ్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ చదివాడు. రెండో సంవత్సరం పరీక్ష రాయగా ఇటీవల వచ్చిన ఫలితాల్లో ఫిజిక్స్‌ సబ్జెక్టు ఫెయిల్‌ అయ్యాడు. అప్పటి నుంచి మనోవేదనతో బాధపడుతుండేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర మత్స్యకార సహకార సంఘం చైర్మన్‌గా రవీందర్‌

కరీంనగర్‌ అర్బన్‌: రాష్ట్ర మత్స్యకార సహకార సొసైటీల ఫెడరేషన్‌ చైర్మన్‌ పదవి జిల్లాకు దక్కింది. వీణవంకకు చెందిన పిట్టల రవీందర్‌ను రాష్ట్ర చైర్మన్‌గా నియమించగా వైస్‌ చైర్మన్‌గా దీటి మల్లయ్యను నియమించారు. నామినేటెడ్‌ పోస్టు కాగా జిల్లాను పదవి వరించడంపై పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు.

హత్య, చోరీ కేసులో ఒకరికి జీవితఖైదు

గోదావరిఖనిటౌన్‌(రామగుండం): హత్య, చోరీ కేసులో గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన గుమ్మడి శ్రీకాంత్‌(28)కు గోదావరిఖని అడిషనల్‌ డిస్ట్రిక్ట్‌, సెషన్స్‌ కోర్టు జడ్జి టి.శ్రీనివాస్‌రావు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు. వన్‌టౌన్‌ పోలీసుల వివరాలు.. చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన కోట రాజయ్య 15.07.2017న రాత్రి 10.30 గంటలకు నైట్‌ డ్యూటీకి వెళ్లాడు. అతడి భార్య రాజేశ్వరి ఇంట్లో ఒక్కతే ఉన్నది. మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు రాజయ్య డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి చూడగా తన భార్య చనిపోయి ఉంది. ఆమె మెడలో రెండు తులాల పుస్తెల తాడు దొంగిలించి, గొంతును లిమి చాకుతో పొడిచి చంపినట్టు అప్పటి ఎస్‌ఐ జి.రమేష్‌బాబు కేసు నమోదు చేసి సాక్షులను ప్రవేశపెట్టారు. సీఐ జి.క్రిష్ణ విచారణ చేసి నిందితుడిని అరెస్ట్‌ చేసి జ్యుడీషియల్‌ రిమాండ్‌కు పంపించారు. తర్వాత సీఐ ఎస్‌.వాసుదేవరావు కోర్టులో చార్జ్‌షీట్‌ దాఖలు చేయగా, గోదావరిఖని అడిషనల్‌ డిస్ట్రిక్ట్‌, సెషన్స్‌ కోర్టులో కేసు విచారణ జరిగింది. జడ్జి టి.శ్రీనివాస్‌రావు ఇరువురి వాదనలు విని మంగళవారం నేరస్తుడు గుమ్మడి శ్రీకాంత్‌ హత్య, దొంగతనం నేరం రుజువైనందున అతడికి జీవితఖైదు, జరిమానా విధించారు.

ఒకే ఒక్కడు

- ఫుడ్‌ సేఫ్టీ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌ మినహా అందరూ ఇన్‌చార్జీలే
- ఇన్‌చార్జి అధికారే దిక్కు.. తనిఖీలు అరకొరే
- విజృంభిస్తున్న కల్తీ మాఫియా



కార్యాలయంలో ఒక్కరే ఉద్యోగి



కార్యాలయం

కార్యాలయంలో మంజూరు పోస్టులు..	
గెజిటెడ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌	1
ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్‌	2
జూనియర్‌ అసిస్టెంట్‌	1
అటెండర్లు	2
విధులు నిర్వహించేది..	
జూనియర్‌ అసిస్టెంట్‌	శ్రీశైలం

కరీంనగర్‌ అర్బన్‌: ప్రజల ప్రాణాలకు భరోసాగా ఆహార ఉత్పత్తుల విక్రయాలు జరగాల్సి ఉండగా అలంకారప్రాయంగా ఫుడ్‌ సేఫ్టీ కార్యాలయం మిగలడం విమర్శలకు తావిస్తోంది. తనిఖీలతో అక్రమార్కులను నిలువరించాల్సిన యంత్రాంగానికే చికిత్స చేయాల్సి రావడం దారుణ పరిణామం. కార్యాలయం మొత్తం ఇన్‌చార్జీలతో నడవడం ఎటూ సరిగా న్యాయం చేయలేని పరిస్థితి. ప్రజల ప్రాణాలు పట్టవు.. ఎవరికేమైతే మాకేం.. లాభాలు దండిగా వస్తే చాలనుకునే వ్యాపారులు పెరిగిపోతుండటంతో ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలవుతున్నాయి. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగాన్ని పటిష్టం చేయకపోవడంతో బతుకు జీవుడా అని కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి. జిల్లా కేంద్ర జనాభా 3లక్షలకు పైమాటే. జిల్లా జనాభా 10లక్షలు కాగా ఒక్క అధికారి కూడా శాశ్వతంగా లేరు.

ఖాళీలతో సతమతం.. అక్రమార్కుల రాజ్యం

ఆహార తనిఖీ విభాగం ప్రతినెలలో తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. గెజిటెడ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌, ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్లకు ఒక్కొక్కరికి నిర్ణీత లక్ష్యముంటుంది. కానీ కొంతకాలంగా ఇన్‌చార్జి అధికారులతోనే నెట్టుకురావడం ఆందోళనకర పరిణామం. ఒక గెజిటెడ్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్లు, ఒక జూనియర్‌ అసిస్టెంట్‌, ఇద్దరు అటెండర్లు కార్యాలయంలో విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇన్‌చార్జి అధికారి నాయక్‌కు నిజామాబాద్‌లో పూర్తిస్థాయి బాధ్యతలు కాగా, అనూష రాజన్న సిరిసిల్లలో విధులు నిర్వహిస్తోంది. వీరిద్దరు ఇన్‌చార్జీలే కావడంతో కోర్టు కేసులతోనే సరిపోతుంది. ఎప్పుడొస్తారో, ఎప్పుడుంటారో తెలియని పరిస్థితి.

విశ్రాంత అటెండర్‌దే హవా

ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించిన అనుమతుల జారీలో ఆహార తనిఖీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం కమర్షియల్‌ టాక్స్‌ లైసెన్స్‌, ఆధార్‌ కార్డు, పాన్‌కార్డు, రూ.వంద చలాన్‌, వ్యాపార పరిణామానికి సంబంధించిన స్వీయ నిర్ధయం, అఫిడవిట్‌, దుకాణ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లోగా అనుమతి జారీ చేయాలి. అయితే దరఖాస్తును నెలరోజుల పాటు తిరస్కరించకుండా ఉంచితే దానిని ఆమోదించినట్లే. కానీ అనుమతుల జారీలో మామూళ్లదే పైచేయిగా మారిందని తెలుస్తోంది. ఏవీ పరిశీలించకుండానే రెండు రోజుల్లో అనుమతులను జారీ చేస్తున్నారు. ఇక దుకాణాలవారీగా వారి వారి విక్రయాలను బట్టి మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. విశ్రాంత అటెండరే అన్నీ తానై వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పుష్కలం. వాణిజ్య పన్నుల శాఖ, రెవెన్యూ, విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, రవాణా శాఖలకు అధికారులున్నా వారెవరు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇందులో కొన్ని శాఖలకు నెలవారీ మామూళ్లు అందుతుండటంతో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

సేకరించిన నమూనాలే తక్కువ..

గతంలో 120 నమూనాలు సేకరించారు. ఇందులో కార్పొరేట్‌ సూపర్‌ బజార్లలోనూ కల్తీ వ్యాపారం జరుగుతోందని తేలింది. చిన్నపాటి తోపుడు బండ్ల నుంచి కార్పొరేట్‌ సూపర్‌ బజార్లు, చిన్న బజ్జీల బండి నుంచి ప్రముఖ హోటళ్ల వరకు కల్తీ సాధారణమైపోతుంది. జిల్లాకేంద్రంలో సుమారు 500 పైగా నూనె దుకాణాలున్నాయి. ఇందులో అనుమతి లేనివి కోకొల్లలు కాగా ఏనాడు వీటిపై దాడులు చేసిన దాఖలాలు లేవు. కాగా నాణ్యమైన నూనెల విక్రయాలు, ధరల నియంత్రణ, జీరో వ్యాపారాన్ని నియంత్రించడంలో అధికారుల మధ్య సమన్వయలోపం వ్యాపారులకు కల్పతరువుగా మారింది. హోల్‌సేల్‌ వ్యాపారులు జిల్లాకేంద్రంలో అయితే 600 క్వింటాళ్లు, ఇతర ప్రాంతాల్లో 377 క్వింటాళ్లు, జిల్లా కేంద్రంలో రిటైల్‌ అయితే 50 క్వింటాళ్లు, ఇతర ప్రాంతాల్లో 30 క్వింటాళ్లు నిల్వ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. అయితే అనుమతి లేని దుకాణాలు వందల్లో ఉన్నాయని తెలుస్తోంది.

పవర్‌లూం కార్మికుని బలవన్మరణం

- ఐదుసార్లు పవర్‌లూమ్స్‌ అద్దెకు తీసుకొని నడిపినా నష్టాలే
- మనస్తాపంతో ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్‌)

సిరిసిల్లక్రైం: కులవృత్తిని నమ్ముకున్నాడు.. వరుస నష్టాలు వస్తున్నా అదే పనిలో రాణించాలని తపన పడ్డాడు.. ఏం చేసినా నష్టాలే రావడంతో చివరికి తనువు చాలించాడు పవర్‌లూం కార్మికుడు ఎనుగంటి ఆంజనేయులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఆంజనేయులు(43) ఐదుసార్లు పవర్‌లూమ్స్‌ను అద్దెకు తీసుకొని, పని చేయగా నష్టం వచ్చింది. ఇటీవల ప్రభుత్వం ఇస్తున్న వస్త్రోత్పత్తి ఆర్డర్లతో కాస్త లాభాలు వస్తాయని ఆశించి, కొన్ని నెలల క్రితం ఐదు జోడీలను అద్దెకు తీసుకొని, నడిపిస్తున్నాడు. వీటితోనూ నష్టమే రావడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం పవర్‌లూంకు సంబంధించిన సామగ్రి షెడ్డులో తాడుతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య శ్రీలత అపెరల్‌ పార్కులో పని చేస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- వీసీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ కర్ణన్‌, సీపీ సుబ్బారాయుడు, అధికారులు

కరీంనగర్‌అర్బన్‌: నకిలీ విత్తనాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. వానాకాలం సీజన్‌ పంటల ప్రణాళిక, విత్తనాల సరఫరా, నకిలీ విత్తనాల నియంత్రణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించి రైతులకు, కోట్లాది మందికి ఉపాధి కల్పించడం జరుగుతోందని, గడిచిన 9 ఏళ్లలో వ్యవసాయ రంగానికి దాదాపు 4.5 లక్షల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులను స్టాక్‌ ఉంచుకోవాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టిసారించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌ పోస్ట్‌ ఏర్పాటు చేసి నిఘా పెంచాలని ఆదేశించారు. వీసీలో డీజీపీ రమేశ్‌, కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌, సీపీ సుబ్బారాయుడు, ట్రైనీ కలెక్టర్‌ లెనిన్‌ వాత్సల్‌ టోప్పో, శిక్షణ జాయింట్‌ కలెక్టర్‌ నవీన్‌ నికోలస్‌, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలందేలా చర్యలు

జిల్లాలోని రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు చేపట్టాలని, నకిలీ, కాలం చెల్లిన విత్తనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం వానాకాలం సీజన్‌ పంటల ప్రణాళిక, విత్తనాల సరఫరా, నకిలీ విత్తనాలను అరికట్టడం తదితర అంశాలపై కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఫర్టిలైజర్‌ షాపుల లైసెన్సులను తనిఖీ చేయాలన్నారు. ఆయిల్‌ పామ్‌ సాగుపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్‌ పామ్‌ సాగుచేసే వారికి డ్రిప్‌ను త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం జిల్లాలో సమీక్షిస్తానని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌, ఉద్యానవన శాఖ అధికారి డా.బండారి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారమివ్వాలి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ ఎల్‌. సుబ్బరాయుడు అన్నారు. వానాకాలం సీజన్‌ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొందరు వ్యాపారులు, దళారీలు రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలకు కమిషనరేట్‌ పోలీసులు సిద్ధమయ్యారని వివరించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులు లేదా టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ 87126 70760, ఇన్‌స్పెక్టర్‌ 87126 70708 నంబర్లలో సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు నగదు పారితోషికం అందజేస్తామని ప్రకటించారు. నకిలీ విత్తనాల సరఫరా, విక్రయాల వ్యవహారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వ్యాపారులు, వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



బహుమతి అందుకుంటున్న ప్రిన్సిపాల్‌ రామక్రిష్ణ, విద్యార్థులు

ఎస్సారార్‌ కళాశాలకు రాష్ట్ర స్థాయి బహుమతి

కరీంనగర్‌సిటీ: జీవ సాంకేతిక శాస్త్ర పరిశోధన ప్రాజెక్ట్‌లో ఎస్సారార్‌ ప్రభుత్వ కళాశాల రాష్ట్ర స్థాయి జిజ్ఞాస బహుమతిని గెలుచుకుంది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ ఆచార్య లింబాద్రి, కళాశాల విద్యా శాఖ జేడీలు ఆచార్య జి.యాదగిరి, డీఎస్‌ రాజేందర్‌సింగ్‌, అకడమిక్‌ గైడెన్స్‌ అధికారి డాక్టర్‌ డీటీ చారి, రూసా ప్రాజెక్ట్‌ అధికారి డాక్టర్‌ సౌందర్య జోసెఫ్‌ ప్రశంసాపత్రం, రూ.12వేల నగదు పురస్కారాన్ని కళాశాల ప్రిన్సిపాల్‌ కలువకుంట రామక్రిష్ణ, డాక్టర్‌ జి.కిశోర్‌కుమార్‌, విద్యార్థులకు ప్రదానం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- డివైడర్‌ను ఢీకొన్న వాహనం
- డ్రైవర్‌ మృతి, పలువురికి స్వల్ప గాయాలు
- బాధితులు హైదరాబాద్‌వాసులు



డివైడర్‌ను ఢీకొన్ని వాహనం

సిరిసిల్ల అర్బన్‌: ఓ వాహనం అదుపుతప్పి, డివైడర్‌ని ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌ మృతిచెందగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన పైండ్ల రాజు(48) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నా డు. అతను హైదరాబాద్‌కే చెందిన ఓ కుటుంబాన్ని సోమవారం తుఫాన్‌ వాహనంలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి క్షేత్రాలకు తీసుకెళ్లాడు. స్వామివార్ల దర్శనం అనంతరం మంగళవారం తిరుగుపయనమయ్యా రు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బొమ్మల మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి, డివైడర్‌ని ఢీకొట్టి, చాలా దూరం దాన్ని తాకుతూ వెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్‌ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు 108కి సమాచారం అందించారు. అంబులెన్స్‌ వచ్చి, సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించేలోపే రాజు మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. వాహనంలో ఉన్న మొత్తం 10 మందిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రుద్రంగిలో ఆర్టీసీ బస్సు, వ్యాన్‌ ఢీ

- రెండు వాహనాలూ ధ్వంసం
- మండల కేంద్రంలో ఇరుకు రోడ్డుతో ప్రయాణికుల ఇబ్బందులు



ఢీకొన్న ఆర్టీసీ బస్సు, వ్యాన్‌

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నుంచి ఇందిరా చౌక్‌ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతోపాటు ధ్వంసమైంది. దీంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఆర్టీసీ బస్సు, లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ ఒకదానికొకటి ఢీకొని, ధ్వంసమయ్యాయి. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

- స్కూటీని వ్యాన్‌ ఢీకొట్టడంతో ఘటన
- బాధితుడి పరిస్థితి విషమం



గాయపడిన లక్ష్మణ్‌

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మీసం లక్ష్మణ్‌ మంగళవారం స్కూటీపై రాగట్లపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్‌ దూరంగా ఎగిరి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. లక్ష్మణ్‌ను బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌ తెలిపారు.

భారీ యంత్రాలపై రక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సుధీర్‌గణపతిరావు

- డీఎంఎస్‌ సుధీర్‌గణపతిరావు

గోదావరిఖని(రామగుండం): భారీ యంత్రాలపై ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని మెకానికల్‌ డీఎంఎస్‌ సుధీర్‌గణపతిరావు సూచించారు. మంగళవారం భారీ యంత్రాల నిర్వహణ, ప్రమాదాల నివారణపై ఒక్కరోజు వర్క్‌షాప్‌ స్థానిక ఇల్లెందు క్లబ్‌లో జరిగింది. ఈసందర్భంగా డైరెక్టర్‌ మైన్‌సేఫ్టీ మాట్లాడుతూ, సింగరేణి ఓపెన్‌ కాస్ట్‌ గనుల్లో నడిచే భారీ యంత్రాలపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. రక్షణ చర్యల విషయంలో రాజీ పడవద్దని, ప్రమాదాలు జరగకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్‌, వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, రక్షణ గురించి సింగరేణి తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాలు అరికట్టేందుకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. వర్క్‌షాప్‌లో డీఎంఎస్‌లు నోముల సంజీవ్‌ కుమార్‌, దిలీప్‌కుమార్‌, జీఎంలు సీహెచ్‌.నర్సింహారావు, గురువయ్య, చింతల శ్రీనివాస్‌, మనోహర్‌, టీవీ రావు, బళ్లారి శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌.వెంకటేశ్వర్లు, ఎస్‌.సాంబయ్య, ఏరియా ఇంజినీర్లు, ప్రాజెక్టు అధికారులు, ఏరియా సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘అధికారిపై దాడి సరికాదు’



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): జవహర్‌ఖని ఓసీపీ సేఫ్టీ అధికారి శివప్రసాద్‌పై ఉద్యోగి దాడిచేయడం సరికాదని, ఖండిస్తున్నామని అధికారుల సంఘం అధ్యక్షుడు పానగోటి శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలో సేఫ్టీ అధికారిని అడ్డగించి బెదిరింపులకు గురిచేసి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డ ఉద్యోగిపై చర్య తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నాయకులు జి.డేవిడ్‌, చిలుక శ్రీనివాస్‌, శ్రావణ్‌కుమార్‌, ఆంజనేయులు, నవీన్‌, ప్రభాకర్‌, శ్రీధర్‌, రాజన్న, శ్రీనివాస్‌, బాలసుబ్రహ్మణ్యం, వీరారెడ్డి పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



కమాన్‌పూర్‌(మంథని): సింగరేణి ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో మంగళవారం నలుగురికి కారుణ్య నియామక పత్రాలను జీఎం టి.వెంకటేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, జాగ్రత పని చేసుకొని ఉద్యోగాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల్లో ఉద్యోగం పొందిన వారిలో 350 మంది విధులకు గైర్హాజరు కావడంతో వారిని కంపెనీ డిస్మిస్‌ చేసిందని వివరించారు. క్రమ శిక్షణతో పని చేసి సంస్థలో పర్మినెంట్‌ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు నరేందర్‌, రఘుపతి, రవీందర్‌రెడ్డి, మారుతి, రాజేశం ఉన్నారు.

ప్రైవేట్‌ యంత్రాలను ప్రవేశపెడితే ఊరుకోం



గోదావరిఖని(రామగుండం): జీడీకే–5 ఓసీపీలో ప్రైవేట్‌ యంత్రాలను ప్రవేశపెడితే ఊరుకోమని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం జీడీకే–5 ఓసీపీ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న యంత్రాలతో కార్మికులచే రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అయినా ప్రైవేట్‌ యంత్రాలు ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. పాత యంత్రాలు పనిచేయడం లేదనే సాకుతో యాజమాన్యం కొత్త యంత్రాలను కొనుగోలు చేయకుండా, ప్రైవేటు వారికి చెందిన షవల్స్‌, లోడర్‌, డోజర్‌లను ప్రవేశపెట్టాలని చూస్తోందన్నారు. వీటిని ఉపసంహరించేదాకా ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్‌, మహేష్‌ పాల్గొన్నారు.

డీజే యజమానుల బైండోవర్‌

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో వివాహాది శుభకార్యాలకు డీజే సౌండ్‌ పెట్టవద్దని హెచ్చరించినా పెడుతున్న పలువురు డీజే యజమానులను మంగళవారం తహసీల్దార్‌ రవికాంత్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై రమాకాంత్‌ తెలిపారు. మైలారం వెంకటేశం, వెలిశాల రవి(ధర్మారం), నేదునూరి మల్లేశం(నిమ్మపల్లి), వంగపెల్లి వంశీ(నిజామాబాద్‌), ఎనగంటి మహేశ్‌, జిన్న రమేశ్‌(పల్లిమక్త), కుడుకల మహిపాల్‌(సుద్దాల), పిట్టల వంశీ, మారుపాక చంద్రయ్య (కనగర్తి), కీసరి రాజు(నాగారం), చింతల పర్శరాం(కోనరావుపేట)లను బైండోవర్‌ చేశామన్నారు. ఇకమీదట డీజేలు పెడితే క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కంప్యూటర్‌తో బెటర్ ఫ్యూచర్

- వేసవిలో కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు, గృహిణులు
- అన్ని రంగాల్లో సాంకేతికతకు పెద్దపీట
- నగరంలో బిజీగా కంప్యూటర్ సెంటర్లు


కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్‌క్రైం: కంప్యూటర్ లేనిదే ప్రస్తుతం ఏ రంగాన్ని ఊహించుకోలేము. చేతిలో ఎన్ని డిగ్రీలు ఉన్న ఉద్యోగాలు కావాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అదనపు అర్హత. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చిన్న నుంచి పెద్దస్థాయి ఉద్యోగాల వరకు కంప్యూటర్ పరిజ్ఞానం అడుగుతుండడంతో వీలు చిక్కినప్పుడల్లా కంప్యూటర్ సబ్జెక్టులు లేని వారు కోచింగ్ తీసుకుంటున్నారు. వేసవి కాలం రెండు నెలలు సెలవులు కావడంతో పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులు, గృహిణులు కంప్యూటర్ కోచింగ్‌కు వెళ్తున్నారు. దీంతో కరీంనగర్‌లోని కంప్యూటర్ సెంటర్లు బిజీగా మారుతున్నాయి.

అంతటా కంప్యూటర్లే..

ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కంప్యూటర్ లేనిది ఏ పని జరగదు, ఏ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా, ఏ పోటీ పరీక్షా రాయాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. అంతటా కంప్యూటరైజ్డ్ కావడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించడానికి కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులు కూడా కంప్యూటర్స్‌కి చెందిన వారు వచ్చే సెమిస్టర్‌లో ఉన్న అంశాలపై కోచింగ్ తీసుకుంటున్నారు. ఉద్యోగాలకు వెళ్లిన వారు సైతం ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లో ప్రవేశాలు తీసుకొని గంట నుంచి రెండు గంటల పాటు కంప్యూటర్ సెంటర్లలో పరిజ్ఞానం నేర్చుకుంటున్నారు. డీసీఏ, పీజీడీఏసీ, అడ్వాన్స్‌డ్ పీజీడీసీఏ, మల్టీమీడియా, ఫొటోషాప్, డీటీపీ, టూడీ యానిమేషన్, త్రీడీ యానిమేషన్, మాయాసాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ ప్యాకేజీలు, సీ, సీప్లస్, జావా, వెబ్‌డిజైనింగ్, హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, డాటాబేస్ సాఫ్ట్‌వేర్‌లతో పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ అందుబాటులో ఉంది. కోర్సులను బట్టి రూ.2,000 నుంచి మొదలుకొని రూ.10 వేల పైగా ఫీజులు ఉండగా కొన్ని కోర్సులకు రాయితీలు కూడా ఇస్తున్నట్లు కంప్యూటర్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.


శిక్షణ ఇస్తున్న నిర్వాహకుడు

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



కంప్యూటర్ పరిజ్ఞానం లేనిది ప్రస్తుతం ఏ రంగంలో కూడా ఉద్యోగాలు, వ్యాపారాలు కానీ చేయలేం. విద్యార్థులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు కూడా చాలా మంది వచ్చి నేర్చుకుంటున్నారు. వేసవిలో ప్రత్యేక ప్యాకేజీలు అందించి ఉదయం నుంచి రాత్రి వర కు బ్యాచుల వారీగా శిక్షణ అందిస్తున్నాం.

– జంజిరాల వేణు, స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకుడు

ఉద్యోగం కోసం..



నేను డిగ్రీ పూర్తి చేశా. కేవలం డిగ్రీతోనే ఉద్యోగాలు సాధించడం కష్టం. ఏ ఉద్యోగం రావాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం అడుగుతున్నారు. అందుకే కంప్యూటర్ కోచింగ్ తీసుకుంటున్న. – స్రవంతి, కరీంనగర్

కంప్యూటర్స్‌పై పట్టుండాలి



నేను ఎంబీఏ చదివా. కంప్యూటర్స్ నాలెడ్జ్ ఉంటే అన్నింటికీ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఏ జాబ్ కావాలన్నా కనీసం కంప్యూటర్ నాలెడ్జ్ అడుతున్నారు కాబట్టి కంప్యూటర్స్‌పై పట్టుసాధిస్తే మంచిదని నేర్చుకుంటున్నా. – హరిత, విద్యార్థిని, కొరుటపల్లి

భవిష్యత్‌లో ఉపయోగం



నాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తయింది. వేసవి సెలవుల్లో ఖాళీ ఉండే బదులు భవిష్యత్‌లో అవసరమని కంప్యూటర్ కోచింగ్ తీసుకుంటున్నా. ఇప్పటికే కంప్యూటర్ లేకుండా ఏ పని ముందుకు సాగడం లేదు. భవిష్యతు ఇంకా కంప్యూటర్ యుగమే. – సన్నిహిత్, ఇందుర్తి

క్లుప్తంగా

మెడికవర్ ఆసుపత్రి సేవలు అభినందనీయం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌టౌన్: హైపర్ టెన్షన్ డేను పురస్కరించుకొని ఈనెల 17 నుంచి 31 వరకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం పోలీస్ ఉద్యోగులకు ఉచిత గుండె సంబంధిత పరీక్షలు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు అన్నారు. మంగళవారం సీపీ కార్యాలయంలో ఉచిత వైద్య పరీక్షలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. 24 గంటలు విధులు నిర్వహిస్తున్న పోలీసులకు గుండె సంబంధిత పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సంవత్సరానికి ఒకసారి ఉద్యోగి గుండె పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి క్లస్టర్ హెడ్ శరన్స్‌సిన్హా, అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ అక్షయ్ రెడ్డి, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

108 ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న 108 ఉద్యోగులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ సర్వీస్ ఉద్యోగులు మంగళవారం రక్తదానం చేశారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో బ్లడ్ స్టోరేజ్ నిలువలు తక్కువగా ఉన్నాయని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు తెలపడంతో 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎస్‌కే సలీం ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాంభూపాల్‌రెడ్డి, ఆకుల రాజేందర్, శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, రాజు, సతీశ్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


ముజీబ్ హుస్సేన్‌కు నియామక పత్రం అందజేస్తున్న తాజొద్దీన్

విద్యానగర్(కరీంనగర్): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా సయ్యద్ ముజీబ్ హుస్సేన్‌ను నియమించినట్లు పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ తాజొద్దీన్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సయ్యద్ ముజీబ్ హుస్సేన్‌కు నియామక పత్రాలను అందజేశారు. కాగా తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌లకు ముజీబ్ కృతజ్ఞతలు తెలిపారు.

'మట్టి మాఫియాకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా కరీంనగర్'

కరీంనగర్‌టౌన్: రాష్ట్రానికి సెంటిమెంట్ జిల్లాగా పేరు పొందిన కరీంనగర్ గ్రానైట్, ఇసుకే కాకుండా కొత్తగా మట్టి మాఫియాకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బేతి మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కరీంనగర్‌కు తలాపున ఉన్న లోయర్ మానేరు డ్యాంలోని నీరు తగ్గడంతో కొందరు అక్రమార్కులు ప్రొక్లయినర్, టిప్పర్లతో అక్రమంగా మట్టిని తరలిస్తుంటే అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి, సంబంధిత అధికారులు ఎల్ఎండీ లోపల నుంచి తరలిస్తున్న మట్టి అక్రమంగా రవాణాను వెంటనే అరికట్టి, తరలిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం బృహత్తర పథకాలను ప్రవేశ పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ బక్కరెడ్డి, సర్పంచ్ లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ, మహిళా సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గిరి ప్రదర్శన చేసిన రాజిరెడ్డి బృందానికి సన్మానం


హనుమాన్ భక్తులను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: కొండగట్టు దేవాలయంలో గిరి ప్రదర్శన చేసిన కంకణాల రాజిరెడ్డి బృందాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తెలంగాణ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్‌స్వామి ఆధ్వర్యంలో నగరంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ అరుణాచలంలో 14 కిలోమీటర్లు గిరి ప్రదర్శన ఏ విధంగా చేస్తారో అదేవిధంగా కొండగట్టు ఆలయంలో 25 కిలోమీటర్లు నడిచి గిరి ప్రదర్శన చేశారని అన్నారు. రాజిరెడ్డితో పాటు పెద్ద శంకర్, పరశురాం, లక్ష్మణ్‌గౌడ్, రాము, హనుమండ్లు, జంగ శ్రీనాథ్, రాముడి నందం, శంకర్‌రావు, సాయి కిట్టు తదితరులు బృందంలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో తీగలగుట్టపల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, జమ్మికుంట, కోహెడ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

వంతెన రేయిలింగ్‌ను ఢీకొన్న వాహనదారుడు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి స్టేజ్ సమీపంలోని కాకతీయ కాలువ వంతెన రేయిలింగ్‌ను శంకరపట్నం మండలానికి చెందిన గౌస్ బైక్‌తో ఢీకొట్టాడు. శంకరపట్నం మండలం నుంచి కరీంనగర్ వైపు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలోని ఈదుల గట్టెపల్లి బ్రిడ్జి వద్ద వంతెన రేయిలింగ్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలుకాగా స్పృహకోల్పోయాడు. గమనించిన స్థానికులు అతడిని 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హరిత నగరంగా మార్చేందుకు కృషి

- ప్రకృతి వనాల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు
- మేయర్ సునీల్‌రావు


రాశి వనాన్ని పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

కరీంనగర్‌కార్పొరేషన్: హరితహారం స్ఫూర్తిగా కరీంనగర్‌ను హరితనగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ సునీల్‌రావు అన్నారు. 9వ డివిజన్ పరిధిలోని ఫిల్టర్‌బెడ్ పక్కన గతేడాది నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృహత్ పట్టణ ప్రకృతి, రాశి వనాన్ని మంగళవారం సందర్శించారు. వివిధ రకాల పండ్లు, పూలు, ఔషధ మొక్కలు, వివిధ రాశుల పేరుతో నాటిన మొక్కలతో పాటు స్థానికంగా ఏర్పాటు చేసిన గులాబీ, మల్లె, చామంతి పూల తోటలను పరిశీలించారు. మొక్కలకు స్వయంగా నీళ్లు పట్టారు. గతంలో తాను నాటిన మొక్క చెట్టుగా మారుతుండటాన్ని చూసి సంతోషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రకృతి వనాలు, చిట్టడువులు, రాశి వనాలను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నట్లు తెలిపారు. 12 ఎకరాల స్థలంలో దాదాపు 30 నుంచి 40 వేల మొక్కలతో ఆహ్లాదాన్ని పంచే అందమైన ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే పద్మనగర్ బుల్ సెమన్ స్థలంలో కూడా 50వేల మొక్కలు నాటి చిట్టడవి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదాశివపల్లి, శాతవాహన యూనివర్సిటీ లాంటి ప్రాంతాల్లో కూడా వనాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పట్టణ ప్రకృతి వనాల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసి వాకర్స్, ప్రజలకు అనుమతిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్, ఈఈ మహేందర్, డీఈ ఓం ప్రకాష్, ఏఈ వాణీ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ: బస్టాప్ ఇక్కడ.. బస్సు ఆగే దెక్కడో..?



గోదావరిఖని, జగిత్యాల వైపు నుంచి కరీంనగర్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు తెలంగాణచౌక్‌లో ఏర్పాటు చేసిన బస్‌స్టాప్‌లో ఆగకుండా ఇతర వాహనాల మధ్య ఆపడంతో ఇతర వాహనదారులు, బస్సులో నుంచి దిగే ప్రయాణికులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరుగకముందే ఆర్టీసీ డ్రైవర్లకు బస్టాప్‌ల ఎదుట బస్సులు నిలపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: పాఠశాలలు ప్రారంభం కాకముందే ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ల పేరిట అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ దీప్తికి వినతిపత్రం అందజేశారు. కరీనగర్‌లోని ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దందా కొనసాగుతోందన్నారు. దీనిని అరికట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇలాంటి దోపిడీలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరవ్యాప్తంగా హోర్డింగ్స్‌తో ఆర్భాటంగా అడ్మిషన్ల కోసం ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, జిల్లా కమిటీ నాయకులు సురేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న సీఎం కప్ మండల స్థాయి పోటీలు


ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం తొలి సారిగా నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్స్ కప్–2023 క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎం కప్ పేరిట పలు క్రీడల్లో యువతీ యువకులకు పోటీలను రెండు రోజులుగా ఆయా మైదానాల్లో నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలోని క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడాశాఖాధికారి కె రాజవీరు ప్రారంభించారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధించాలన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో మంగళవారం పురుషులకు అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి సీఎం కప్ ఆటల పోటీల రెండో రోజు పోటీలను మంగళవారం ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మహిళల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్, ఎంపీఓ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మొగిలి సమ్మయ్య, పీఈటీలు లక్ష్మణ్, శ్రీనివాస్, హరీశ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మణ్, విజయలక్ష్మీ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేటితో మండలస్థాయి పోటీలు ముగింపు ..

చీఫ్ మినిస్టర్స్ కప్ మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారంతో ముగియనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో 11 క్రీడాంశాల్లో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

కరీంనగర్ అర్బన్ ఫలితాలు

ఫుట్‌బాల్ (పురుషులు): సయ్యద్ ముఖ్తార్ జట్టు (ప్రథమ), అమీర్ జట్టు (ద్వితీయ)
ఖోఖో (పురుషులు): టి శ్రావణ్ జట్టు (ప్రథమ), కె శివాజీ జట్టు (ద్వితీయ)
ఖోఖో (మహిళలు): కె ప్రవళిక జట్టు (ప్రథమ), ఎం మానస జట్టు (ద్వితీయ)
వాలీబాల్ (పురుషులు): శ్రీనాథ్ జట్టు (ప్రథమ), ఎండీ వసీం జట్టు (ద్వితీయ)
వాలీబాల్ (మహిళలు): జి పుష్పలత జట్టు (ప్రథమ), పిసుస్మిత జట్టు (ద్వితీయ)

కరీంనగర్ రూరల్ ఫలితాలు

కబడ్డీ (పురుషులు): నగునూరు (ప్రథమ), భద్రుకాస్‌పేట (ద్వితీయ)
ఖోఖో (పురుషులు): నగునూరు (ప్రథమ), చామనపల్లి (ద్వితీయ)
వాలీబాల్ (పురుషులు): గోపాల్‌పూర్ (ప్రథమ), దుర్శేడ్ (ద్వితీయ)
100 మీటర్ల రన్నింగ్: ఎ శ్రీకాంత్ (ప్రథమ), ఈ మారుతి (ద్వితీయ), పి రాజ్ కుమార్ (తృతీయ)
400 మీటర్ల రన్నింగ్: టి ఆర్వెల్ (ప్రథమ), శ్రీకాంత్ (ద్వితీయ), పి రాజ్‌కుమార్ (తృతీయ)

కేసీఆర్ హయాంలో ప్రగతిబాటలో పల్లెలు


వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చిగురుమామిడి: సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం చిగురుమామిడి మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. లంబాడిపల్లి– ముదిమానిక్యం గ్రామాల మధ్య రూ.33.50 లక్షలతో నిర్మిస్తున్న రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. చిగురుమామిడి, రేకొండలలో నిర్మించిన వైకుంఠధామాలు, రేకొండలో మత్స్య పారిశ్రామిక భవనాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పల్లెలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకట్రమణారెడ్డి, పీఆర్ డీఈఈ రవిప్రసాద్, ఎంపీడీవో నర్సయ్య, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు జక్కుల రవీందర్, బెజ్జంకి లక్ష్మణ్, పిట్టల రజిత, ఎంపీటీసీలు కొత్తూరి సంధ్య, ఏలేటి రవీందర్‌రెడ్డి, మిట్టపెల్లి మల్లేశం, రేకొండ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులు కొంరయ్య, రామోజు కృష్ణమాచారి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు న్యాయం చేసి ఆదుకోవాలి


మాట్లాడుతున్న రేకుర్తి భూ బాధితులు

కొత్తపల్లి: రేకుర్తిలోని నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలని భూ బాధితులు పిట్టల మధుసూదన్, షాహీద్‌ఖాన్, మొయిద్ ఖాన్, దుర్గం శివకుమార్, దుర్గం శ్రీనివాస్, షామకూరి భూమయ్య, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, హన్మంతరెడ్డి, కబీర్‌ఖాన్, ఎండీ అబీబ్ తదితరులు అన్నారు. మంగళవారం సీతారాంపూర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని రేకుర్తిలో సుమారు 200 పేద కుటుంబాలకు చెందిన 6, 207, 44, 50, 45, 216, 20, 18, 26, 27, 194, 184, 157, 160, 186(ఇనాం) సర్వేనంబర్లలోని భూమిని ఒక కుటుంబం ఆక్రమించుకోగా 1996 సంవత్సరంలో హైకోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టు సూచనల మేరకు అప్పటి కలెక్టర్ బీఆర్ మీనా రేకుర్తి భూములపై విచారణ చేపట్టారని తెలిపారు. అనంతరం వచ్చిన కలెక్టర్ సుమితాడావ్రా కూడా ఈ భూములపై విచారణ చేపట్టి అప్పటి ఎమ్మార్వో చంద్రమోహన్‌కు సూచిస్తే తమకు పాసుపుస్తకాలు ఇవ్వకుండా జాప్యం చేయడంతో ప్రత్యర్థి స్టే తీసుకొచ్చారన్నారు మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా ఎట్టకేలకు 20 ఏళ్ల అనంతరం తమ తరుపున తీర్పు వెలువడిందని తెలిపారు. అదేవిధంగా తమకు పాసు పుస్తకాలు ఇవ్వాలని కొత్తపల్లి తహసీల్దార్‌కు సూచించినట్లు తెలిపారు. అప్పటి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్ ప్రత్యర్థితో కుమ్మక్కై పాసు పుస్తకాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తూ స్టే తెచ్చుకొనే అవకాశం కల్పించాడని ఆరోపించారు. కోర్టులో స్టే ఉండగా తమ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రత్యర్థి నుంచి తమకు ప్రాణభయం ఉందని, కలెక్టర్, సీపీలు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎల్లమ్మ తిరుగు వారోత్సవం



రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మతల్లి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుగు వారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ తల్లికి ప్రత్యేకంగా బోనంతో వైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వావిలాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జమ్మికుంట: ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి సనా జవేరియా అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వావిలాలలో డెంగీ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి సోకుతుందని అన్నారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గూన్యా లాంటి జ్వరాలు వస్తాయని, దోమలు ఇంట్లోకి రాకుండా దోమ తెరలు వాడుకొని నియంత్రించాలని తెలిపారు. వాడకంలో లేని ప్లాస్టిక్ వస్తువులు, డ్రమ్ములు ద్వారా దోమల ఉధృతి పెరుగుతుందని, ఇంటి పరిసరాల్లో లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్ రెడ్డి, సూపర్‌వైజర్స్ రత్నకుమారి, స్వరూప, అరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి భూములు.. సింగపూర్‌లో సంతర్పణ!

సింగపూర్ ప్రభుత్వమంటూ.. చివరకు ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం

- కేంద్ర ప్రభుత్వం అనుమతి లేదు... టెండర్ల ప్రక్రియ మాటే తేలేదు
- సింగపూర్ కంపెనీకి ముందుగానే అమరావతి మ్యాపులు.. అనంతరం బినామీల పేరుతో భూముల కొనుగోలు
- చంద్రబాబు – నారాయణ భూదందాకు కేంద్రస్థానంగా సీడ్ క్యాపిటల్
- స్విస్ చాలెంజ్ పేరుతో భూదోపిడీ



సాక్షి, అమరావతి: సింగపూర్ కంపెనీల ముసుగు తొలగిపోవడంతో అమరావతి కేంద్రంగా సాగిన భూదందా విస్మయపరుస్తోంది. చంద్రబాబు సింగపూర్ పర్యటనలు.. ప్రైవేట్ కంపెనీలతో ఎంవోయూలు.. స్విస్ చాలెంజ్ ఒప్పందాల వెనుక తీగను లాగుతుంటే కరకట్ట ఇంట్లో అవినీతి డొంక కదులుతోంది. అమరావతి మాస్టర్‌ప్లాన్, సీడ్ క్యాపి టల్ పాన్ ఫైళ్లను తిరగేస్తుంటే బినామీల పేరుతో చంద్రబాబు, నారాయణ కొల్లగొట్టిన భూముల దస్త్రాలు బయటపడుతున్నాయి. సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణతో భూదోపిడీ మొత్తం బయటపడుతోంది.

కమిటీలో సింగపూర్ కంపెనీ ప్రతినిధి

2014 జూన్‌లో అధికారం చేపట్టగానే రాజధాని పేరిట చంద్రబాబు భారీ భూదోపిడీకి పన్నాగాన్ని రూపొందించారు. 2015 జూలైలో రాజధాని సలహా కమిటీని నియమించి పొంగూరు నారాయణ, సుజనా చౌదరి, గల్లా జయదేవ్‌తోపాటు సింగపూర్ కంపెనీ ప్రతినిధికి స్థానం కల్పించడం గమనార్హం. అంతర్జాతీయ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు వెళ్తున్నందున విదేశీ కంపెనీ ప్రతినిధిని సభ్యుడిగా నియమించడంపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభ్యంతరం తెలిపినా చంద్రబాబు పట్టించుకోలేదు. సింగపూర్ కంపెనీకి రాజధాని ప్రాంత ఎంపిక బాధ్యతను అప్పగించడం ద్వారా భారీ భూదోపిడీకి అప్పుడే పథకం వేశారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనేబిలింగ్ యాక్ట్‌ను కూడా టీడీపీ సర్కారు ఉల్లంఘించింది. ఓపెన్ కాంపిటీషన్ ద్వారా డెవలపర్‌ను ఎంపిక చేయాలన్న నిబంధనను చంద్రబాబు ఖాతరు చేయలేదు.

కేంద్రం అనుమతి లేదు.. టెండర్లూ లేవు

2014 నవంబరులో చంద్రబాబు సింగపూర్ పర్యటనలోనే భూదోపిడీకి స్కెచ్ వేశారు. ఆ వెంటనే డిసెంబరులో రాజధాని మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు సింగపూర్ కంపెనీతో చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంవోయూ కుదుర్చుకుంది. విదేశీ కంపెనీతో చేసుకునే ఒప్పందాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే కేంద్రం అనుమతి లేకుండానే ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం. ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నట్లు అప్పటి సీఎం చంద్రబాబు బుకాయిస్తూ వచ్చారు. తద్వారా ఇతర కంపెనీలు పోటీకి రాకుండా నిరోధించారు. కానీ సంబంధిత శాఖల నోట్ ఫైల్స్‌లో ఎక్కడా సింగపూర్ ప్రభుత్వం అనే ప్రస్తావనే లేదు. చివరికి చంద్రబాబు ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది సింగపూర్ ప్రభుత్వంతో కాకుండా ఓ ప్రైవేట్ కంపెనీతో కావడం గమనార్హం. ఇక రాజధాని ప్రాంతంలో అత్యంత కీలకమైన సీడ్ క్యాపిటల్ ఎంపిక కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లానర్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా ఎంపిక చేసింది. అందుకోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టలేదు. సింగపూర్‌కే చెందిన కంపెనీలను మాస్టర్ డెవలపర్‌గా ఎంపిక చేయాలని ఎంవోయూలో స్పష్టం చేశారు. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించే కంపెనీ, సీడ్ క్యాపిటల్ మాస్టర్ డెవలపర్ ఎవరన్నది చంద్రబాబు ముందుగానే నిర్ణయించేశారు.

2015 జనవరిలోనే అమరావతి మ్యాపులు...

రాజధానిలో కీలకమైన సీడ్ క్యాపిటల్ ప్రాంతం ఎంపికలో చంద్రబాబు తన పన్నాగాన్ని అమలులోకి తెచ్చారు. విజయవాడ–గుంటూరు–తెనాలి– మంగళగిరి(వీజీటీఎం) పరిధిలోని జోనింగ్ మ్యాపులన్నీ 2015 జనవరిలోనే సింగపూర్ మాస్టర్ డెవలపర్‌కు గుట్టుచప్పుడు కాకుండా టీడీపీ ప్రభుత్వం అప్పగించేసింది. ఆ మ్యాపుల్లో పేర్కొన్న ప్రాంతాల్లోనే రాజధాని, సీడ్ క్యాపిటల్‌ను ఎంపిక చేయాలని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా నదికి అభిముఖంగా ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, లింగాయపాలెం గ్రామాల పరిధిలో సీడ్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అంటే రాజధాని, సీడ్ క్యాపిటల్ ఏ మండలాలు, గ్రామాల పరిధిలో రానున్నాయో చంద్రబాబు, నారాయణ, వారి బినామీలకు ముందుగానే తెలుసన్నది స్పష్టమైంది. అనంతరం సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను 2015 జూలైలో ప్రభుత్వానికి సమర్పించి కథ ముగించింది.

పచ్చ ముఠా గుప్పిట్లో సీడ్ క్యాపిటల్

2015 జనవరిలోనే సీడ్ క్యాపిటల్ ఎక్కడ రానుందో తెలిసిన చంద్రబాబు, నారాయణ తమ బినామీలను రంగంలోకి దింపారు. ఆ ప్రాంతంలో అతి తక్కువ ధరకు భూములను భారీగా కొనుగోలు చేశారు. సీఐడీ దర్యాప్తులో ఈ బినామీ లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయి. నారాయణ తన బినామీలు, బంధువుల పేరిట 65.50 ఎకరాలు కొనుగోలు చేసినట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటైన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. ఆ విధంగా కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇదే రీతిలో చంద్రబాబు బినామీలు, సన్నిహితులు సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భారీగా భూములు గుప్పిట పట్టారు. దీనిపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలో మరిన్ని బినామీ లావాదేవీలు బహిర్గతం కానున్నాయి.

స్విస్ చాలెంజ్ ముసుగులో 1,691 ఎకరాల దోపిడీ

తమ దోపిడీకి మార్గం సుగమం చేసేలా రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన చట్టానికి చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారం సవరణలు చేసింది. ఓపెన్ కాంపిటీషన్ విధానాన్ని పక్కనపెట్టేసి స్విస్ చాలెంజ్ విధానంలో సీడ్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకుంది. కౌంటర్ చాలెంజ్‌కు ఇతర కంపెనీలకు అవకాశం లేకుండా చేసి సింగపూర్ కంపెనీకి స్విస్ చాలెంజ్ కింద ఏకపక్షంగా కట్టబెట్టేసింది. సీడ్ క్యాపిటల్ అంచనా వ్యయం రూ.3,137 కోట్లు కాగా నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం అందులో 25 శాతం అంటే రూ.784 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు బిడ్డింగ్ అర్హత ఉంటుంది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం కనీసం రూ.2 వేల కోట్ల టర్నోవర్ ఉండటాన్ని అర్హతగా నిర్ణయించడం గమనార్హం. తద్వారా ఇతర కంపెనీలు ఏవీ పోటీకి రాకుండా కట్టడి చేసింది. ఇక సీడ్ క్యాపిటల్ కింద 1,691 ఎకరాల్లో నిర్మాణాలను సింగపూర్ కంపెనీకి కాంట్రాక్టు అప్పగించారు. కానీ అందులో సింగపూర్ కంపెనీ నిర్మించేది కేవలం 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని భవనం మాత్రమే. అంటే మిగిలిన భూమి అంతా సింగపూర్ కంపెనీకే అప్పగించేశారు. ఆ ప్రకారం ఆ భూమిని ప్లాట్లు వేసుకుని అమ్ముకునే హక్కు కల్పించారు. సింగపూర్ కంపెనీ ముసుగులో చంద్రబాబు, ఆయన బినామీలు భూములను కాజేసేందుకే ఈ పథకం వేశారు.

'ఇన్నర్' మెలికలు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు జరిగాయి. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ రూపొందించారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యూరాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్ ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్‌కు ఒకచోట 9 ఎకరాలు, మరో చోట నాలుగు ఎకరాలు ఉండటం గమనార్హం.

పాపాల్లో పవన్‌కూ భాగం

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు వాటా కల్పించారు. కాజా వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలో పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.



బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



సభలో మాట్లాడుతున్న ఏపీ సీఎం జగన్

జనంతోనే వారి యుద్ధం

- స్వార్థ రాజకీయాల కోసమే జనసేన–టీడీపీ నీచపు పొత్తులు
- నిజాంపట్నం సభలో సీఎం వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతిపక్షాలు జగన్‌తో కాకుండా, జనంతో యుద్ధం చేస్తున్నాయి. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఇతర పేదలందరికీ మంచి చేస్తుంటే గతంలో పాలన సాగించిన వారు, ఆ పాలనకు మద్దతిచ్చిన వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పేదవాడికి మంచి జరుగుతుంటే తట్టుకోలేకపోతున్నారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే చంద్రబాబుకు మత్స్యకారులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఇతరులు గుర్తుకొస్తారని చెప్పారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఐదో విడత మత్స్యకార భరోసా కింద నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నేను చేసిన మంచిని, మిమ్మల్ని (ప్రజలు), దేవుడిని నమ్ముకున్నాను. ప్రజలకు ఏ మంచీ చేయని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పొత్తులని, ఎత్తులని, చిత్తులని, కుయుక్తులనీ నమ్ముకున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండీ కూడా చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీం కూడా గుర్తుకు రాదు. అందరికీ గుర్తుకు వచ్చేది వెన్నుపోటు, మోసం, కుతంత్రాలు మాత్రమే గుర్తుకు వస్తాయి' అని అన్నారు. పేదలకు ఏ మంచీ చేయని ఈ పెద్దమనిషికి ఎవరైనా ఎందుకు మద్దతిస్తారని ప్రశ్నించారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

దోచుకోవడమే వారి సిద్ధాంతం

- ఒక దత్తపుత్రుడు, ఒక దత్త తండ్రి.. వీరి పార్టీలు, సిద్ధాంతం ఒక్కటే. మన రాష్ట్రంలో దోచుకోవడం, దోచుకున్నది పంచుకుని హైదరాబాద్‌లో ఉండటం. ఎంతో మందిని ప్రధాన మంత్రులుగా, రాష్ట్రపతులుగా చేశానని చంద్రబాబు చెబుతుంటాడు. ఆయనకు మాత్రం మన రాష్ట్రంలో ఉన్న 175 స్థానాల్లో ఒంటరిగా బరిలో దిగే సత్తా మాత్రం లేదు.
- దత్తపుత్రుడు ఎమ్మెల్యేగా రెండు చోట్ల పోటీ చేస్తే.. అయ్యా మీరు మాకు ఎమ్మెల్యేగా కూడా వద్దు అని ప్రజలు నమస్కారం పెట్టి ఓడించారు. ఇదే దత్తపుత్రుడు రాజకీయ పార్టీ పెట్టి పదేళ్లు అయింది. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పెట్టలేని పరిస్థితిలో ఉంది.
- ఒక్కో ఎన్నికకు ఒక్కో రేటు. పార్టీని హోల్‌సేల్‌గా అమ్ముకునే ఈ ప్యాకేజీ స్టార్ ఈ మధ్యకాలంలో అన్న మాటలు వింటే ఆశ్చర్యం కలుగుతోంది. ఆయన ముఖ్యమంత్రి అయినా, కాకపోయినా పర్వాలేదట. దోపిడీలో రావాల్సిన వాటా వస్తే చాలు అంటున్నాడు. వీళ్లంతా ఇలా ఎందుకు అంటున్నారో.. ఎందుకు కలుస్తున్నారో ఆలోచించండి.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 వీళ్లంతా ఎందుకు కలుస్తున్నారు? రాష్ట్రాన్ని ఒక గజ దొంగల ముఠాగా దోచుకోవడానికే కలుస్తున్నారు. మరోపక్క మీ బిడ్డ ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని వ్యవస్థలు కత్తికట్టినా, ఎన్ని వ్యవస్థలను ప్రయోగించినా 15 ఏళ్లుగా మీ తరఫునే నిలబడ్డాడు. ఎక్కడా రాజీ పడలేదు. మనందరి ప్రభుత్వం చేసిన మంచిని చెబుతూ, మీ ఇంట్లో మీకు మంచి జరిగితేనే మీ బిడ్డకు తోడుగా మీరు సైనికుల్లా నిలబడాలని కోరుతున్నాను.

లిక్కర్ కొరత

- బాటిళ్లకు తగ్గించిన కొత్త ధరల స్టిక్కర్
- మద్యం డిపోల్లో కొనసాగుతున్న ప్రక్రియ
- వైన్స్‌లకు సరిపడా పంపిణీ కాని సరుకు
- కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి



వైన్స్‌లకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న సరుకు



ఆదిలాబాద్ మద్యం డిపోలో తగ్గించిన ధరలకు సంబంధించిన బాటిళ్లకు స్టిక్కర్లు వేస్తున్న సిబ్బంది

సాక్షి, ఆదిలాబాద్: గత కొద్ది రోజులుగా వైన్స్‌లలో లిక్కర్ కొరత కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల లిక్కర్ ధరలను కొంతమేర తగ్గించిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయానికి ముందు తయారై డిపోలకు చేరిన సరుకు పెద్ద ఎత్తున నిల్వ ఉంది. ఇదిలా ఉంటే డిస్టిలరీస్‌లలో తాజాగా తయారవుతున్న మాల్ కొత్త ఎమ్మార్పీ ప్రింట్‌తో వస్తోంది. ఇక పాత సరుకుకు తగ్గించిన ధరల స్టిక్కర్లను బాటిళ్లకు అతికించాల్సి వస్తోంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల డిపోల్లో ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పర్యవసానంగా సరుకు వైన్స్‌లకు సరిపడా పంపిణీ చేయలేని పరిస్థితి. దీంతోనే కొరత కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.

రెండు వారాలు సమీపిస్తున్నా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5న లిక్కర్ ధరలను కొంత మేర తగ్గించింది. రూ.2వేలకు లోపు ఉన్న లిక్కర్‌కు సంబంధించి ఫుల్‌బాటిల్‌పై రూ.40, అంతకుమించి ధర ఉన్న ఫుల్ బాటిల్‌పై రూ.80 వరకు తగ్గించింది. ఇది ఆ రోజు నుంచే అమలైంది. అప్పటికే వైన్స్‌లలో ఉన్న సరుకును పూర్తిగా అమ్మే వరకు పాత ధరలనే కొనసాగించాలని పేర్కొంది. కొత్తగా తయారయ్యే సరుకుకు డిస్టిలరీస్ నుంచే ప్రింట్ ఎమ్మార్పీతో వస్తుందని స్పష్టం చేసింది. మద్యం డిపోల్లో ఉన్న సరుకును వైన్స్‌లకు పంపించే ముందు తగ్గించిన కొత్త ధరలకు సంబంధించి స్టిక్కర్లను అతికిస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్, మంచిర్యాల డిపోల్లో రూ.కోట్ల విలువైన సరుకు ఉంది. వాటికి డిపోలలో కూలీల ద్వారా స్టిక్కర్లను అతికిస్తున్నారు. దీంతో అధిక సమయం పడుతోంది. ఈ నేపథ్యంలోనే సరుకును వైన్స్‌లకు పూర్తిస్థాయిలో డిపోల నుంచి అందించలేని పరిస్థితి.

మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి..

ప్రస్తుతం కొత్తగా తయారయ్యే సరుకుకు తగ్గించిన ధర ప్రింట్ రూపంలో వస్తోంది. పాత సరుకు డిపోల్లో పూర్తిగా విక్రయించేంత వరకు స్టిక్కర్ అతికించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ కారణంగానే వైన్స్‌లకు సరుకు పంపిణీలో జాప్యం అవుతోంది. అధికారులు మాత్రం ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతున్నా వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. డిమాండ్ మేర మాల్ ఇవ్వడం లేదని వైన్స్ యజమానులు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియ మొత్తం చక్కబడేందుకు మరి కొద్ది రోజులు పట్టే అవకాశం ఉంది.

సందెట్లో సడేమియా..

తగ్గించిన మద్యం ధరలను కఠినంగా అమలు చేస్తున్నామని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. డిపోల నుంచి తాజాగా సరుకు తీసుకుంటున్నప్పటికీ వైన్స్‌ల్లో పాత ధరల్లోనే విక్రయించడం ద్వారా లిక్కర్ వ్యాపారులు లాభపడుతున్నారు. ప్రతీ వైన్స్ ముందు కొత్త ధరలకు సంబంధించి బోర్డులు ప్రదర్శించేలా ఆదేశాలతోపాటు కఠినంగా అమలు చేస్తున్నామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అలాంటివి ఏమీ కనిపించడం లేదు. డిపోల్లో స్టిక్కర్లు వేస్తున్నప్పటికీ ఇది ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. దీంతో డిపో అధికారులతో వ్యాపారులు అంతర్గతంగా కుమ్మక్కై ఇలాంటి వ్యవహారం ఏదైనా సాఫీగా జరిగేలా చూసుకుంటున్నారా అనే అనుమానాలు లేకపోలేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించిన విషయంపై కొనుగోలు చేసేవారికి అవగాహన ఉంది. అంతేకాకుండా వైన్స్‌ల ముందు తగ్గించిన ధరల బోర్డులు ప్రదర్శిస్తున్నారు. ఎక్కడైనా అధిక ధరకు విక్రయిస్తే వినియోగదారుడు ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– నర్సింహా రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్‌శాఖ

బాలిక సాధికారత దిశగా అడుగులు

- నేటినుంచి ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ ఆధ్వర్యంలో శిక్షణ
- నాలుగు వారాల పాటు కొనసాగనున్న కార్యక్రమం



శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న బాలికలు

జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు అన్నిరంగాలపై అవగాహన కల్పించేలా గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్–2023 కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రామగుండం ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం ఆరోతరగతిలో ప్రవేశించే పేద బాలికలకు ఇది ప్రయోజనకరం. మంగళవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని హైస్కూల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. చదువుతో పాటు శిక్షణ, భోజన వసతి కల్పిస్తారు.

ఎంపిక తీరు ఇలా

ఎన్టీపీసీ రామగుండం సంస్థ పరిధిలోని ప్రభావిత, పునరావాస గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో ఐదోతరగతి పూర్తి చేసిన 120మంది బాలికలను శిక్షణకు ఎంపిక చేశారు. కొద్ది వారాల క్రితమే బేస్‌లైన్ సర్వే, 5వ తరగతిలో వచ్చిన మార్కులు, అర్హత, ప్రవేశ, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఎంపిక చేపట్టారు. ఈనెల 17 నుంచి శిక్షణ ప్రారంభించి నాలుగు వారాల పాటు కొనసాగిస్తారు.

శిక్షణ అంశాలు

తెలుగు, ఇంగ్లీషు, గణితం, సైన్స్, సోషల్ తదితర సబ్జెక్టులను బోధిస్తారు. వీటితో పాటు వ్యక్తిత్వ వికాసం, సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణం తదితర అంశాల గురించి వివరిస్తారు. యోగా, నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, క్రాఫ్ట్స్, కరాటేపై శిక్షణ ఇస్తారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, రన్నింగ్, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్, కారమ్స్, స్కిప్పింగ్, లాంగ్ జంప్ తదితర క్రీడల్లో రాణించేలా కృషి చేస్తారు.

సౌకర్యాలు ఇవీ..

శిక్షణకు అవసరమైన విద్యా, అలంకరణ సామగ్రి, రెండు జతల ఏకరూప, క్రీడా దుస్తులు, షూ, చెప్పులు, సాక్సులు, క్రీడా వస్తువులు అందిస్తారు. పాఠశాలకు సమీపంలో ఉన్న ఏసీతో కూడిన వసతి గృహంలో వార్డెన్లు, ఆయాల సంరక్షణలో ఉంటారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, పండ్లు తదితర పౌష్టికాహారం అందిస్తారు. బాలికలను కలుసుకోవడానికి తల్లిదండ్రులకు ఆదివారం అవకాశం కల్పిస్తారు. బాలికల భద్రత నిమిత్తం సీసీ కెమెరాలతో కూడిన కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు.

ప్రతిభ చూపిన పదిమందికి ఉచిత విద్య

శిక్షణలో ప్రతిభచూపిన 10మందికి ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉచితంగా చదువును అందిస్తారు. వీరి చదువుకు అయ్యే ఖర్చును ఎన్టీపీసీ యాజమాన్యమే భరిస్తుంది. నేటి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ సంగీత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఆదుకోని అంబులెన్స్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో అత్యవసర వేళల్లో పేషెంట్లకు సేవలందించాల్సిన అంబులెన్స్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గోదావరిఖనిలో మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురైన వహిద అనే మహిళను జీజీహెచ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కాలు నుజ్జునుజ్జు కావడంతో, బాధితురాలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందంటూ కరీంనగర్ రెఫర్ చేశారు. జీజీహెచ్ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ సకాలంలో అందుబాటులో ఉన్నప్పటికీ, ఆస్పత్రి సిబ్బంది 108 అంబులెన్స్‌ను రప్పించడానికి ఫోన్ చేశారు. 108 అంబులెన్స్ రావడానికి గంట సమయం పడుతుందని చెప్పడంతో, ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌లో తరలించాలని డ్రైవర్‌ను డ్యూటీ డాక్టర్ ఆదేశించారు. కానీ సదరు అంబులెన్స్ డ్రైవర్ మాత్రం అంబులెన్స్‌ను తీయడానికి నిరాకరించాడు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చెప్పకుండా అంబులెన్స్‌ను తీయనని చెప్పినట్లు బాధితురాలి బంధువులు ఆరోపించారు. దీంతో గత్యంతరం లేక ప్రైవేట్ అంబులెన్స్‌లో బాధితురాలిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. డ్యూటీ డాక్టర్‌ను వివరణ కోరగా, బాధిత పేషెంట్‌ను ఆస్పత్రి అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించాలని డ్రైవర్‌ను ఆదేశించామని, డీజిల్ పోయించడానికి సరిపడ బడ్జెట్ లేకుంటే సర్దుబాటు చేసుకోవచ్చని కూడా వివరించామని, కానీ డ్రైవర్ స్పందించలేదని తెలిపారు.



బాధితురాలిని ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

ఒకే కాన్పులో ముగ్గురు జననం



ఒకేకాన్పులో జన్మించిన ముగ్గురు పిల్లలు

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం ఓ మహిళ ఒకేకాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. కోరుట్ల పట్టణం రహీంపురాకు చెందిన సనా(30) ప్రసవం కోసం రెండురోజుల క్రితం ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. మంగళవారం మధ్యాహ్నం డాక్టర్ దీప్తిరెడ్డి పర్యవేక్షణలో సనా ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఇద్దరు మగ, ఒక ఆడ శిశువు ఉన్నట్లు వైద్యురాలు తెలిపారు. ఒక్కొక్కరు కిలోన్నర బరువు ఉన్నారని, అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ వివరించారు.

గుడ్లు పెడుతున్న బాయిలర్ కోడి



గుడ్లు పెడుతున్న బాయిలర్ కోడి ఇదే

సాధారణంగా లేయర్, నాటుకోడి, గిరిరాజా వంటి కోళ్లు గుడ్లు పెట్టడం చూస్తుంటాం. కానీ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో బాయిలర్ కోడి గుడ్లు పెడుతోంది. బెల్లంపల్లి మార్కెట్ ఏరియాలోని బాలాజీ చికెన్ సెంటర్‌లో ఐదు కిలోల బాయిలర్ కోడి లేయర్ కోడి కంటే పెద్దగా ఉంది. ఈ బాయిలర్ కోడి గుడ్లు పెడుతూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఛత్తీసగఢ్ నుంచి కొన్ని కోళ్లు వచ్చాయని, వీటిని ప్రొడక్షన్ బాయిలర్ కోళ్లు అంటారని చికెన్ సెంటర్ నిర్వాహకుడు కిషన్ తెలిపాడు. 20ఏళ్ల కాలంలో ఇలాంటి బాయిలర్ కోడి చూడడం ఇదే మొదటిసారని పేర్కొన్నాడు. నెన్నెల పశువైద్యాధికారిని సంప్రదించగా.. కంపెనీ వారు ప్రొడక్షన్ కోసం ఉపయోగించే విత్తనం కోళ్లు అని, లేయర్ జాతికి చెందినవేనని తెలిపారు. – నెన్నెల



బాయిలర్ కోడి పెట్టిన గుడ్లు

'ఏ వయసులో అయినా సరే ఎవ్వరిపైనా ఆధారపడకూడదు' అని టైలరింగ్ చేస్తూ తన రెక్కల కష్టం మీదే బతుకుతోంది 70 ఏళ్ల లచ్చుమమ్మ. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావు పేట గ్రామంలో ఉండే లచ్చుమమ్మ ఐదు దశాబ్దాలుగా పాత కాలం నాటి రవికల నుంచి నేటి మోడ్రన్ డ్రెస్సుల వరకు తన కుట్టుపనితనంతో మెప్పిస్తోంది.



లచ్చుమమ్మను చూసి నేర్చుకోవాలె..!

ఆ ఊళ్లో అందరూ 'లచ్చుమమ్మను చూసి నేర్చుకోవాలె' అని అంటుంటారు. ఏడు పదుల వయసులో కూడా లచ్చుమమ్మ ఆధునిక డిజైన్లలో బ్లౌజులు, డ్రెస్సులు కుట్టడం చూసి కాలానికి తగినట్టు పని తనాన్ని మెరుగుపరుచుకుంటుంది అని కూడా అంటుంటారు. యాభై ఏళ్లుగా అలుపెరగకుండా బట్టలు కుడుతూ జీవనం సాగిస్తున్న లచ్చుమమ్మ అసలు పేరు గజవాడి లక్ష్మి. ధర్మారావుపేట గ్రామంలో అందరూ లచ్చుమమ్మ అని పిలుస్తారు. లచ్చుమమ్మకు 14వ ఏట ధర్మారావుపేటకు చెందిన బాలవీరయ్యతో వివాహం జరిగింది. వాళ్లకు ఐదుగురు కూతుళ్లు. ఉన్న ఊళ్లో ఉన్నంతలో చదివించారు. వాళ్లను పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేసి, అత్తవారిళ్లకు పంపించారు. వాళ్లకు పిల్లలు. లచ్చుమమ్మకు పన్నెండు మంది మనుమలు, మనుమరాళ్లు. వాళ్లు కూడా పెద్దోళ్లయ్యారు. నాటి విషయాల గురించి ప్రస్తావిస్తూ 'ఐదుగురు ఆడపిల్లల్ని పెంచి, పెళ్లిళ్లు చేయడం అంటే సవాలే..' అంటూ తమ కష్టాన్ని వివరిస్తుంది. లచ్చుమమ్మ భర్త బాలవీరయ్య చిన్న చిన్న వ్యాపారాలు చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. భర్త కష్టానికి చేదోడుగా ఉంటుందని యాభై ఏళ్ల కిందటే లచ్చుమమ్మ సొంతంగా బట్టలు కుట్టడం మొదలుపెట్టింది. అప్పుడు ఆ ఊళ్లోకి ఇంకా టైలరింగ్ మిషన్లు రాలేదు. దాంతో బట్టలు కత్తిరించి సూదీదారంతోనే కుట్టేది. గ్రామంలో నాటి తరం మహిళలు ధరించే రవికలను బాగా కుడుతుందనే పేరు లచ్చుమమ్మకి. ఆడపిల్లలకు గౌన్లు, లంగా, జాకెట్లు కుట్టడమూ సొంతంగానే నేర్చుకుంది. అందరి ఇళ్లల్లోనూ ఆమె కుట్టిన బట్టలు ఉంటాయి.

యాభై ఏళ్లుగా కుడుతున్నా..

పద్నాలుగేళ్ల వయసులో పెళ్లయ్యి ఈ ఇంటికి వచ్చా. ఇద్దరు కూతుళ్లు పుట్టిన తరువాత కుటుంబ అవసరాల కోసం ఏదైనా పని చేయాలనుకున్నా. మా అమ్మ మాకు చిన్నప్పుడు చేతితోనే బట్టలు కుట్టేది. ఇంటి అవసరాలు పెరిగినప్పుడు నేను కూడా బట్టలు కుట్టాలని, చేతికుట్టుతో రవికలు కుట్టడం మొదలుపెట్టాను. ఒక్కొక్కరుగా రావడం మొదలై ఊళ్లో ఉన్న ఆడవాళ్లందరూ రవికలు కుట్టించుకునేవారు. ముప్పైఏళ్ల పాటు చేతి కుట్టుతోనే కుట్టేదాన్ని. కుట్టు మిషన్లు వచ్చిన తరువాత ఓ మిషన్ తీసుకున్నా. కొన్ని రోజుల్లోనే మిషన్ కుట్టు నేర్చుకొని, సొంతంగానే కుట్టడం మొదలుపెట్టిన. పిల్లలు వద్దంటరు కానీ, చేతనైనన్ని రోజులు పనిచేసుకొని బతకాలి, ఎవరి మీదా ఆధారపడవద్దని ఈ పని వదలడం లేదు.

– గజవాడ లక్ష్మి


బట్టలు కత్తిరిస్తున్న లచ్చుమమ్మ

ఆధునిక డిజైన్లు సైతం

లచ్చుమమ్మ చేతికుట్టు బాగుంటుందని చాలా మంది ఆమె దగ్గరే కుట్టించుకునేవారు. నిన్న మొన్నటి వాళ్లే కాదు, ఈ తరం అమ్మాయిలు కూడా లచ్చుమమ్మ దగ్గరకు వచ్చి బ్లౌజులు కుట్టించుకుంటారు. మొదట్లో సాదా రవిక కుట్టడానికి 30 పైసలు, గుండీల రవిక కుట్టడానికి 50 పైసలు తీసుకునేదట. ఇప్పుడు సాధారణ బ్లౌజ్‌కు రూ. 65, లైనింగ్ బ్లౌజ్‌కు రూ.130 తీసుకుంటుంది. 'అప్పట్లో రోజుకు పది నుంచి ఇరవై దాకా బ్లౌజులు, గౌన్లు కుట్టేదాన్ని. పండుగల సీజన్లో అయితే రాత్రి, పగలు తేడా ఉండేది కాదు. ఇప్పుడు కూడా రోజూ రెండు మూడు బ్లౌజులు కుడతా' అని చెబుతోంది లచ్చుమమ్మ. పదేళ్ల క్రితం భర్త వీరయ్య చనిపోయాడు. ఇప్పుడు లచ్చుమమ్మ ఒక్కత్తే ఉంటుంది. తన పోషణార్థం కుట్టుపనినే నమ్ముకుంది.

ఏళ్లుగా ఆమె దగ్గర రవికలు కుట్టించుకున్న నాటి తరం వాళ్లంతా ఇప్పటికీ లచ్చుమమ్మ దగ్గరికే వస్తుంటారు. వయసు మీద పడి, నెమ్మదిగా కుట్టినా చెప్పిన మాట ప్రకారం కుట్టి ఇస్తుందని నమ్మకం ఎక్కువ. ఏ సమయంలో ఆమె ఇంటికి వెళ్లినా.. కూర్చుని బట్టలు కత్తిరించడమో, లేదంటే మిషన్ మీద కుట్టడమో చేస్తూ కనిపిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

– ఎస్.వేణుగోపాల్ చారి, సాక్షి, కామారెడ్డి

ఆంజనేయస్వామి ఆబాలగోపాలానికి ప్రియమైన దేవుడు. చిత్రకారులు మారుతిని ప్రపంచ ప్రేక్షకులకు మరింత చేరువ చేయడానికి శ్రమిస్తున్నారు. యానిమేటర్ చారువి అగర్వాల్ అంజనీ పుత్రుణ్ణి రేఖల్లో దింపడంలో పేరు గడించింది. ఆమె యానిమేషన్స్ మన పురాణ పాత్రల్నే కాదు మన సాంస్కృతిక వైభవాన్ని కూడా లోకానికి తెలిసేలా చేస్తున్నాయి. ఒక మహిళా యానిమేటర్‌గా ఆమె ఇంత కృషి చేయడం చాలా విశేషం.

చిత్రార్చన



యానిమేషన్ ఆంజనేయ

'హనుమాన్ చాలీసా' పేరుతో 2007లో యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్ తీయడంతో చాలామందికి తెలిసింది చారువి అగర్వాల్ పేరు. అంతవరకూ ఆమె పడిన కష్టం, అవమానం అంతా ఇంతా కాదు. కెనడాలో మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ యానిమేషన్ చదువుకుని ఇండియాకు వచ్చిన చారువి అగర్వాల్ 2000 సంవత్సరంలో కెరీర్ మొదలెట్టినప్పుడు అందరూ ఆమెను వింతగా చూడటమే. అప్పటికి సినిమా ఫీల్డులోనే తెర వెనుక విభాగాలలో స్త్రీలు కనిపించేవారు కాదు. ఇక యానిమేషన్‌లో బొత్తిగా వింత. 'నువ్వు అమ్మాయివి. చిన్నపిల్లవి. ఏం చేయగలవు' అని అందరూ అడిగేవారే. కాని చారువి అగర్వాల్ పట్టుదల పట్టింది. సాధించింది.


చారువి అగర్వాల్

ఢిల్లీ అమ్మాయి

చారువి అగర్వాల్‌ది ఢిల్లీ. చిన్నప్పటి నుంచి బొమ్మలంటే ఇష్టం. తల్లిదండ్రులు ఆ బొమ్మలేయడాన్నే చదువుకో అని చెప్పారు. కెనెడా పంపించారు. అక్కణ్ణుంచి ఇక్కడికి వచ్చాక యానిమేషన్‌లో కృషి చేయడానికి ముంబైకి చేరుకుంది. కాని మనకు ఎంత టాలెంట్ ఉన్నా ఇది మగవారి ప్రపంచం... ఇక్కడ స్త్రీలకు అవకాశాలు దక్కడం కష్టం అనిపించింది చారువికి. 'క్లయింట్‌లు కూడా అమ్మాయి అనేసరికి వర్క్ ఇవ్వడానికి వెనక్కు తగ్గేవారు' అని గుర్తు చేసుకుంది చారువి.

సొంతగా స్టూడియో పెట్టి

ఇక సొంతగా స్టూడియో పెట్టి అటో ఇటో తేల్చుకుందామని గుర్‌గావ్‌లో 'చారువి డిజైన్ ల్యాబ్స్' పేరుతో యానిమేషన్ స్టూడియో మొదలుపెట్టింది. 'నాకు మన సంస్కృతి, పురాణ పాత్రలు ఇష్టం. వాటినే ప్రేరణగా తీసుకోవాలనుకున్నాను. హనుమాన్ చాలీసా అందరికీ తెలిసిందే. దానికి దృశ్యరూపం ఇస్తూ అదే పేరుతో యానిమేషన్ షార్ట్‌ఫిల్మ్ తీస్తే ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. నా వర్క్‌కు చాలా గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత చాలా యానిమేషన్ ఫిల్మ్స్ చేశాను. అప్పుడు 'ది లెజెండ్ ఆఫ్ హనుమాన్' యానిమేటెడ్ వెబ్ సిరీస్ చేసే అవకాశం వచ్చింది. 2021లో డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ అయిన ఈ వెబ్ సిరీస్ దేశవిదేశాల్లో హనుమాన్‌కు అభిమానులను సంపాదించి పెట్టింది' అంది చారువి.


26 వేల గంటలతో చారువి తయారుచేసిన హనుమ

26 వేల గంటలతో హనుమ

చారువి యానిమేటర్ మాత్రమే కాదు శిల్పి, కార్టూనిస్టు కూడా. 'క్లేట్రానిక్స్' (కార్టూనింగ్‌ను శిల్పంతో మిళితం చేసి తయారు చేసే బొమ్మలు) ద్వారా మన్మోహన్ సింగ్, వాజ్‌పేయి, లాలూ వంటి నేతల మినియేచర్స్‌ను తయారుచేసి అందరినీ ఆకట్టుకుంది. అంతే కాదు ఒక మాల్‌లో 26 వేల చిరుగంటలను ఉపయోగించి 25 అడుగుల ఎత్తు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 'లిమ్కా రికార్డ్స్'లోకి ఎక్కింది.

ఇంకా వివక్షే

'ప్రతి ఏటా యానిమేషన్ చదువుకున్న విద్యార్థుల్లో 70 శాతం మంది అమ్మాయిలే ఉంటున్నారు. కాని వారిలో 30 శాతం మందికే ఉపాధి దొరుకుతోంది. ఇంకా వారిని పనిలోకి తీసుకోవడానికి, పని ఇవ్వడానికి వివక్ష పాటిస్తున్నారు' అంటుంది చారువి. 'కాని నిరాశ పడవద్దు. ఇవాళ సినిమా, డిజిటల్, టివి రంగాల్లో యానిమేషన్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రతిభ చూపితే తప్పక విజయం సాధిస్తారు' అని తెలియ చేస్తోంది ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి.

బ్యూటిప్

పద్మాల్లాంటి పాదాల కోసం...



చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.



సేవాపథం

దస్రా - సేవా సంస్థలకు సేవ

మార్పు సహజం అంటారు.
ఆ మార్పు మనం కనే కలలలోనూ సహజమే.
సూటు, బూటు వేసుకొని పెద్ద కార్పొరేట్ కంపెనీలో పెద్ద జీతంతో పనిచేయాలనేది నీరా నుండీ కల.
ఆమె కల నెరవేరింది.
అయితే, ఆ తరువాతే అసలు కల మొదలైంది.
'ఏ నాన్-ప్రాఫిట్ ఫర్ నాన్-ప్రాఫిట్' అనే నినాదంతో 'దస్రా' అనే స్వచ్ఛంద సంస్థను మొదలు పెట్టి తన కల నెరవేర్చుకుంది.
సమస్యలు ఎదుర్కొంటున్న స్వచ్ఛంద సంస్థలకు అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది.


నీరా నుండీ

కెనడాలోని టోరంటోలో పుట్టి పెరిగిన నీరా నుండీ హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసింది.

బిజినెస్ సూట్ వేసుకొని పెద్ద జీతం తీసుకోవాలనే ఆమె కల నెరవేరింది. న్యూయార్క్‌లోని ప్రసిద్ధ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ 'మోర్గన్ స్టాన్లీ' లో ఉద్యోగం.

అయితే కొంతకాలానికి ఆమెకు 'నా పని ఇది కాదేమో' అనిపించింది. స్వచ్ఛంద సేవారంగంపై మనసు లాగింది. దీనికి కారణం చిన్నప్పుడు పశ్చిమబెంగాల్ గ్రామీణ ప్రాంతాలలో తాను చూసిన పేదరికం. ఆ దృశ్యాలు పదేపదే గుర్తుకు వచ్చేవి.

ప్రాథమిక దశలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఫండింగ్ లేక ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటి వాటికి సహాయం అందించాలనే ఉద్దేశంతో తనలాంటి ఆలోచనలే ఉన్న సహ–ఉద్యోగి దేవల్ సంఘవితో కలిసి ముంబై కేంద్రంగా 'దస్రా' (సంస్కృతంలో దస్రా అంటే వెలుగు ఇవ్వడం అని అర్థం) అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

ఫండ్ రైజింగ్‌లో భాగంగా ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగి తమ సంస్థ లక్ష్యాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేసినా స్పందన అంతంత మాత్రంగానే ఉండేది. కొందరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోయేవారు. కొందరు తాము ఒప్పుకున్న దాంట్లో చాలా తక్కువ మొత్తం మాత్రమే ఇచ్చేవారు. ఇలాంటి నిరాశామయ పరిస్థితుల్లో తాను పనిచేసిన 'మోర్గన్ స్టాన్లీ' కంపెనీ చైర్మన్ రిచర్డ్ బి ఫిషర్‌ను కలిసి మాట్లాడింది నీర.

'నా రిటైర్‌మెంట్ తరువాత నేను అత్యంత సంతోషంగా గడిపే కార్యక్రమం ఏదైనా ఉందంటే అది స్వచ్ఛందసేవకు సంబంధించిన కార్యక్రమమే' అంటూ ఆయన ఎంతో ప్రోత్సాహకరంగా మాట్లాడడంతో పాటు ఆర్థికసహకారమూ అందించాడు.

ఆయన కాలం చేసిన తరువాత సమస్యలు ఎదురయ్యాయి.

అయితే ప్రతి సమస్య తాము నేర్చుకునే పాఠం అయింది.

ఎక్కడా నిరాశపడలేదు. 'మనం చేయాల్సింది ఎంతో ఉంది' అనుకోవడమే దీనికి కారణం.

నలుగురు సభ్యులతో మొదలైన 'దస్రా'లో ఇప్పుడు 105 మంది సభ్యులు ఉన్నారు. దాతలు, కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. న్యూట్రీషియన్, మెంటల్ హెల్త్, శానిటేషన్, విద్య... మొదలైన రంగాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందిస్తోంది దస్రా.

'దస్రా' ఇచ్చిన చేయూతతో స్వచ్ఛంద సంస్థలు తమ కార్యకలాపాలను విస్తృతపరుచుకోగలుగుతున్నాయి.

'ఒక స్వచ్ఛందసంస్థకు సహాయం అందిస్తే దాని అడుగులు వేగంగా పడతాయి. ఆ ప్రభావం సమాజంపై ఉంటుంది. అందుకే అవి ఎదుర్కొనే ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టాం' అంటున్న నీరా ఆర్థిక విషయాలపైనే కాకుండా తన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనుభవాన్ని ఉపయోగించి స్వచ్ఛంద సంస్థల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తోంది..

పారదర్శకతనే తన బలంగా చేసుకొని ముందుకు వెళుతోంది దస్రా.

> కార్పొరేట్ రంగంతో పోల్చితే సామాజిక రంగంలో పని చేయడం సులువైన విషయం కాదు. ఆ ప్రయాణానికి ఎంతో సహనం కావాలి. ఆ సహనమే అపారమైన శక్తిని ఇస్తుంది.
> – నీరా నుండీ

'దస్రా వల్ల స్వదేశీ, విదేశీ స్వచ్ఛంద సంస్థలతో మాత్రమే కాదు ఎంతోమంది ఫండర్స్, పాలసీ మేకర్స్‌తో పరిచయం ఏర్పడింది. ఎంతో మేలు జరిగింది. స్వచ్ఛంద సంస్థల ఉనికికి నమ్మకమే ప్రధానం. ఆ నమ్మకాన్ని దాతలలో దస్రా తీసుకువచ్చింది. మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది' అంటున్నాడు 'దస్రా' ద్వారా సహాయ సహకారాలు పొందిన వొకేషనల్-ఎడ్యుకేషన్‌కు సంబంధించిన స్వచ్ఛంద సంస్థ 'లెండ్–ఏ–హ్యాండ్ ఇండియా' వ్యవస్థాపకుడు రాజ్ గిల్డా.

మరి నీరా మాటేమిటి?

'కార్పొరేట్ రంగంతో పోల్చితే సామాజిక రంగంలో పని చేయడం సులువైన విషయం కాదు. ఆ ప్రయాణానికి ఎంతో సహనం కావాలి. ఆ సహనమే అపారమైన శక్తిని ఇస్తుంది' అంటుంది నీరా నుండీ.

యూత్ పల్స్

యువసంగీతాభిమానులు...
'మ్యూజిక్ కంపోజర్' కావాలని కలలు కనే యువతరానికి 'మ్యూజిక్ ఎల్‌ఎం' ఎంతో ఆసక్తి కలిగిస్తోంది.
గూగుల్ లేటెస్ట్ రిసెర్చ్ ఏఐ పవర్డ్ మ్యూజిక్ టూల్ మ్యూజిక్ ఎల్‌ఎం 'కంపోజ్ యువర్ ఓన్ సాంగ్' అంటూ యువతరాన్ని అమితంగా ఆకట్టుకుంటోంది...

శతకోటి పాటలకు అనంతకోటి రాగాలు... రెడీ!

పాట గురించి చెప్పమంటే ఏం చెబుతాం? ఏ పనీ లేనప్పుడు వచ్చి పలకరిస్తుంది. బోలెడు పనిలో ఉన్నప్పుడు ఆ పని ఒత్తిడి నుంచి రిలాక్స్ కావడానికి పాట దగ్గరికి వెళ్లాలనిపిస్తుంది. 'పాట' అనేది నిత్యజీవితంలో భాగమై పోయింది. అలాంటి పాటకు మరింత దగ్గర కావడానికే కాదు మనమే సృష్టించడానికి గూగుల్ వారి 'మ్యూజిక్ ఎల్ఎమ్' ఒక వేదిక. 'మ్యూజిక్ ఎల్ఎం' అనేది ఏఐ ఇమేజ్‌కు సరిపోయేలా మ్యూజిక్‌ను క్రియేట్ చేయగలదు.

వందలాది గంటల మ్యూజిక్ డెటాసెట్ దీని సొంతం. యూజర్స్ కోరుకునే జానర్స్. ఇన్‌స్ట్రుమెంట్స్‌తో పాటు వైబ్, మూడ్, ఎమోషన్‌లతో కూడిన సంగీతాన్ని వినిపిస్తుంది. ఒక్కసారి యాక్సెస్ అయిన తరువాత సింపుల్‌గా మనం కోరుకుంటున్న మ్యూజిక్‌ను టెక్స్ట్ ఫీల్డ్‌లో టైప్ చేస్తే చాలు.


ప్రతీకాత్మక చిత్రం

మరో ప్రత్యేకత ఏమిటంటే 'మ్యూజిక్ ఎల్ఎం' కళా ఉపయోగపడనుంది.

కంటెంట్ క్రియేషన్‌కు సంబంధించి ఈ సంవత్సరాన్ని 'ఇయర్ ఆఫ్ ఏఐ అండ్ ఆటోమేషన్' అంటున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఏఐ పవర్డ్ మ్యూజిక్ ప్రొడక్షన్ టూల్ 'మ్యూజిక్ ఎల్ఎం'ను సాంకేతిక దిగ్గజం గూగుల్ ప్రకటించింది.

'చాట్‌జీపీటీ'లాగే 'మ్యూజిక్ ఎల్ఎం' మన సందేహాలకు సమాధానం ఇస్తుంది.

టెక్స్ట్ ఆధారంగా అప్పటికప్పుడు మనం కోరుకున్న సంగీతాన్ని 'మ్యూజిక్ ఎల్ఎం' అందిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన 8–బిట్, బిగ్ బీట్, బ్రిటీష్ ఇండిరాక్, ఫోక్, హిప్‌హాప్, పెరూవియన్ పుంక్... మొదలైన జానర్స్‌లో షార్ట్, మీడియం, లాంగ్ ఫామ్ మ్యూజిక్‌లను క్రియేట్ చేస్తుంది.

ప్రస్తుతానికైతే 'మ్యూజిక్ ఎల్ఎం' మనదేశంలోని ప్రసిద్ధ హిందుస్థానీ, కర్నాటక సంగీతాలను సపోర్ట్ చేయడం లేదు.

'మ్యూజిక్ ఎల్ఎం అనేది వినోదం కోసం మాత్రమే అని నేను అనుకోవడం లేదు. ఏమీ తెలియనప్పుడు ఏదో ఒకటి తెలుసుకోవడం ముఖ్యం. మ్యూజిక్ ఎల్ఎం ద్వారా సంగీతాభిమానులైన యువతరం ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి అవకాశం దొరుకుతుంది' అంటుంది రీతిక సైనీ.

ఢిల్లీకి చెందిన 22 సంవత్సరాల రీతిక చక్కగా పాటలు పాడుతుంది. సంగీత జ్ఞానం లేకపోయినా తనకు తోచిన రీతిలో ట్యూన్స్ క్రియేట్ చేస్తుంది. మ్యూజిక్ కంపోజర్ కావాలనేది ఆమె కల.

'మ్యూజిక్ ఎల్ఎం' ప్రయాణం నల్లేరు మీద నడక కాదనే విషయం దాని పరిశోధకులకు తెలియనిదేమీ కాదు. నైతిక కోణం మొదలు ట్యూన్స్ పునరావృతం కావడం అనే సాంకేతిక విషయం వరకు ఎన్నో సవాళ్లు ఎదురు చూస్తున్నాయి.

హై డిమాండ్ ఉన్న 'మ్యూజిక్ ఎల్ఎం' ప్రపంచంలోకి వెళ్లడానికి రిజిస్ట్రేషన్ తరువాత 'వెయిట్ లిస్ట్' కోసం కాస్త సమయం ఎదురు చూడక తప్పదు.

'కంగ్రాచ్యులేషన్స్. యూ హ్యావ్ సక్సెస్‌ఫుల్లీ జాయిన్డ్ ది వెయిట్‌లిస్ట్ ఫర్ మ్యూజిక్ ఎల్ఎం' అని గూగుల్ నుంచి మెసేజ్ వచ్చిన తరువాత 'మ్యూజిక్ ఎల్ఎం'లోకి ప్రవేశ అనుమతి లభిస్తుంది.

సంగీత ప్రపంచం ప్లస్ సాంకేతిక ప్రపంచం


స్నేహా ఖన్వాల్కర్

పాశ్చాత్య సంగీత పరికరాలు, భారతీయ సంగీత పరికరాలను ఒక దగ్గర చేర్చాలనే ఆసక్తి కంటే ఏ సందర్భానికి ఏది ముఖ్యం అనే అవగాహన ముఖ్యం. సంగీత ప్రపంచంలో ఒక దానికోసం వెదుక్కుంటూ వెళితే ఎన్నో రత్నాలు దొరుకుతాయి. కాబట్టి ప్రయాణం అనేది ఎప్పుడూ మంచిదే. అంతర్జాలం రూపంలో మనకు సమాచార, సాంకేతిక ప్రపంచం దగ్గరైంది. వాటి ప్రయోజనాలను ఉపయోగించుకోవాలి.

ఎప్పుడూ ఒకే దగ్గర ఉండిపోవడం కాకుండా ప్రయోగాలు చేస్తూ వెళ్లాలి. నా సంగీతం గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే... క్రియేటివ్ ఎక్స్‌పెరిమెంటల్ మ్యూజిక్ అంటాను. ఏ ట్యూన్ వచ్చి ఎప్పుడు పలకరిస్తోందో తెలియదు. అందుకే దాన్ని వెంటనే రికార్డ్ చేసుకోవాలి. నేనైతే సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేస్తుంటాను.

– స్నేహా ఖన్వాల్కర్, బాలీవుడ్ మ్యూజిక్ కంపోజర్

ప్రస్తుతం ప్రయోగదశలో ఉన్న 'మ్యూజిక్ ఎల్ఎం'లో రాబోయే కాలంలో ఎన్ని మార్పులు చోటు చేసుకోబోతున్నాయో, ఎన్ని వివాదాలు చెలరేగనున్నాయో, మన భారతీయ సంగీతం అందులో భాగం అవుతుందో లేదో, ఈ సంగీతానికి లోక గుర్తింపు లభిస్తుందో లేదో... మొదలైన విషయాలు తెలియక పోవచ్చుగానీ, ఇప్పటికైతే మాత్రం 'మ్యూజిక్ ఎల్ఎం' ప్రస్తావన యూత్‌కు ఎగ్జయిటింగ్‌గా ఉంది.

'వెయిట్ లిస్ట్' కోసం వెయిట్ చేయడం బాగుంది.



గోల్ఫర్ అదితి ఘనత... టాప్-50లో చోటు...

ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-50లోకి దూసుకొచ్చిన తొలి భారతీయ మహిళా క్రీడాకారిణిగా అదితి అశోక్ గుర్తింపు పొందింది. న్యూజెర్సీలో జరిగిన ఎల్‌పీజీఏ ఫౌండర్స్ కప్ టోర్నీలో అదితి సంయుక్తంగా ఐదో స్థానంలో నిలిచింది. దాంతో ఆమె ఏకంగా 15 స్థానాలు పురోగతి సాధించి 49వ ర్యాంక్‌కు చేరుకుంది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో అదితి నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. అమెరికాకు చెందిన నెల్లీ కోర్డా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.

తొలి రౌండ్‌లోనే సాకేత్ జోడీ ఓటమి

బీఎన్‌పీ పరిబా ప్రైమ్‌రోజ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-175 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీకి తొలి రౌండ్‌లోనే పరాజయం ఎదురైంది. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 4-6, 6-7 (3/7)తో రెండో సీడ్ ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జంట చేతిలో ఓటమి చవిచూసింది.



హారిక శుభారంభం



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక శుభారంభం చేసింది. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో తొలి గేమ్‌లో హారిక తెల్లపావులతో ఆడుతూ 49 ఎత్తుల్లో బిబి సారా అసాబయేవా (కజకిస్తాన్)పై విజయం సాధించింది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తొలి ఎత్తు వేసి గేమ్‌ను ప్రారంభించాడు. 2022-2023 మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌లో ఇది చివరిదైన నాలుగో టోర్నీ. నాలుగు సిరీస్‌లలో కలిపి మొత్తం 16 మంది బరిలో ఉన్నారు. నాలుగు సిరీస్‌లు ముగిశాక టాప్-2లో నిలిచిన ఇద్దరు క్రీడాకారిణులు 2023 క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు.

రన్నరప్ సరయు



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-17 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి సరయు వేల్పుల రన్నరప్‌గా నిలిచింది. ఇదే టోర్నీ ఓపెన్ విభాగంలో తెలంగాణకే చెందిన వేముల అద్వైత్ విఘ్నేశ్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పంజాబ్‌లో జరిగిన ఈ టోర్నీలో వరంగల్ జిల్లాకు చెందిన సరయు 8.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. నిర్ణీత 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో సరయు ఆరు గేముల్లో గెలిచి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. కోచ్ బొల్లం సంపత్ వద్ద చెస్‌లో ఓనమాలు నేర్చుకున్న సరయు గతంలో అండర్-11, అండర్-13 విభాగాల్లో జాతీయ చాంపియన్‌గా నిలిచింది. మరోవైపు అద్వైత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయాడు.

లక్నో లక్కీగా...

- ఆఖరి ఓవర్‌తో గెలిపించిన మొహసిన్
- ముంబై 5 పరుగుల తేడాతో ఓటమి
- స్టొయినిస్ విధ్వంసం
- ఇషాన్ కిషన్ ఫిఫ్టీ వృథా

లక్నో: ముంబై లక్ష్యం 178. ఒకదశలో రోహిత్ జట్టు 90/0తో లక్నోపై సునాయాసంగా గెలిచే దశలో ఉంది. క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్లు... చేతిలో 10 వికెట్లున్న ముంబై ఓడుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ 'లక్' లక్నో వెంట ఉండటంతో కీలకమైన వికెట్లు, హిట్టర్ల వైఫల్యంతో ముంబై లక్ష్యానికి దూరమైంది. అయితే రోహిత్ సేనను మళ్లీ డేవిడ్ మెరుపులు గెలుపు వాకిట తీసుకెళ్లాయి. 6 బంతుల్లో 11 పరుగులు ముంబైవైపు మొగ్గితే... ఆఖరి ఓవర్ వేసిన మొహసిన్ వికెట్ తీయకపోయినా 5 పరుగులే ఇచ్చి సూపర్ జెయింట్స్‌ను గెలిపించాడు. దీంతో ముంబై 5 పరుగులతో ఓటమి పాలైంది. మొదట లక్నో 20 ఓవర్లలో 3 వికెట్లకు 177 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ (47 బంతుల్లో 89 నాటౌట్; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) మెరిపించాడు. కెప్టెన్ కృనాల్ పాండ్యా (42 బంతుల్లో 49 రిటైర్డ్‌హర్ట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించాడు. బెహ్రెన్‌డార్ఫ్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 59; 8 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. యశ్, రవి బిష్ణోయ్ చెరో 2 వికెట్లు తీశారు.

ఆఖర్లో శివమెత్తిన స్టొయినిస్

లక్నో ఇన్నింగ్స్ బ్యాటింగ్ పవర్‌ప్లే మొదలైతే... ముంబై బౌలర్లు 'పవర్' చూపారు. దీంతో టాపార్డర్ బ్యాటర్లు దీపక్ హుడా (5), డికాక్ (15 బంతుల్లో 16; 2 సిక్సర్లు), ప్రేరక్ మన్కడ్ (0) ఆరంభ ఓవర్లలోనే పెవిలియన్‌లో కూర్చున్నారు. హుడా, ప్రేరక్‌లను బెహ్రెన్‌డార్ఫ్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. 35 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన లక్నోను కృనాల్, స్టొయినిస్ నడిపించారు. వికెట్లనైతే ఆపారు... పరుగులైతే వచ్చాయి కానీ... వేగం మాత్రం లోపించింది. ఇద్దరు 82 పరుగులు జోడించాక కృనాల్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. పూరన్ జతవగా స్టొయినిస్ ఆఖరి ఓవర్లలో సిక్సర్లతో శివమెత్తాడు. 17 ఓవర్లలో లక్నో స్కోరు 123/3 కాగా... జోర్డాన్ వేసిన 18 ఓవర్లో స్టొయినిస్ 6, 0, 4, 4, 6, 4లతో వీరబాదుడు బాదేశాడు. చివరి మూడు ఓవర్లలోనే 54 పరుగులు చేసింది.

ఇషాన్ ధాటితో...

ఓపెనర్లు ఇషాన్ కిషన్, రోహిత్ శర్మ ముంబైకి ధాటైన ఆరంభమిచ్చారు. ఇషాన్ బౌండరీలతో, రోహిత్ భారీ సిక్సర్లతో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. పరుగులు చకచకా రావడంతో పవర్ ప్లేలో ముంబై 58/0 స్కోరు చేసింది. ఆ తర్వాత కూడా ఓపెనర్ల జోరు తగ్గనేలేదు. ఓవర్‌కు సగటున 9 పైచిలుకు పరుగులతో స్కోరుబోర్డును కదిలించారు. 10వ ఓవర్లో 90 పరుగుల వద్ద రోహిత్ (25 బంతుల్లో 37; 1 ఫోర్, 3 సిక్స్‌లు)ను రవిబిష్ణోయ్ అవుట్ చేశాడు. అర్ధసెంచరీ పూర్తయ్యాక ఇషాన్, కాసేపటికే సూర్యకుమార్ (7) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో ముంబై కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన నేహల్ వధేరా (16), విష్ణు వినోద్ (2)లు నిరాశ పరచడంతో ముంబై లక్ష్యానికి దూరమైనట్లు కనిపించింది. అయితే 'హిట్టర్లు' టిమ్ డేవిడ్ (19 బంతుల్లో 32 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు), కామెరాన్ గ్రీన్ (4 నాటౌట్) ఉండటంతో ఏమూలనో మిణుకుమిణుకుమన్న ఆశల్ని మొహసిన్ ఆఖరి ఓవర్ ముంచేసింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
ముంబై	13	7	6	0	14	-0.128
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	12	6	6	0	12	-0.268
హైదరాబాద్	12	4	8	0	8	-0.575
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: దీపక్ హుడా (సి) డేవిడ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 5; డికాక్ (సి) కిషన్ (బి) చావ్లా 16; ప్రేరక్ (సి) కిషన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 0; కృనాల్ (రిటైర్డ్‌హర్ట్) 49; స్టొయినిస్ (నాటౌట్) 89; పూరన్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు)** 177. **వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-35. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 4-0-30-2, జోర్డాన్ 4-0-50-0, హృతిక్ 3-0- 20-0, చావ్లా 3-0-26-1, ఆకాశ్ 4-0-30-0, గ్రీన్ 2-0-16-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) నవీనుల్ (బి) బిష్ణోయ్ 59; రోహిత్ (సి) హుడా (బి) బిష్ణోయ్ 37; సూర్యకుమార్ (బి) యశ్ 7; వధేరా (సి) సబ్- గౌతమ్ (బి) మొహసిన్ 16; డేవిడ్ (నాటౌట్) 32; విష్ణు వినోద్ (సి) పూరన్ (బి) యశ్ 2; గ్రీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 172. **వికెట్ల పతనం:** 1-90, 2-103, 3-115, 4-131, 5-145. **బౌలింగ్:** కృనాల్ పాండ్యా 4-0-27-0, మొహసిన్ ఖాన్ 3-0-26-1, నవీనుల్ 4-0-37-0, యశ్ ఠాకూర్ 4-0-40-2, స్వప్నిల్ 1-0-11-0, రవి బిష్ణోయ్ 4-0-26-2.



మొహసిన్ ఖాన్

తొలి రౌండ్‌లో సురేఖకు 'బై'



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్ ర్యాంకింగ్ రౌండ్‌లో భారత స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ రాణించింది. మొత్తం 693 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఈ ప్రదర్శనతో సురేఖకు వ్యక్తిగత విభాగం నాకౌట్ దశలో తొలి రౌండ్‌లో 'బై' లభించింది. ఆమె నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడుతుంది. భారత్‌కే చెందిన అదితి 689 పాయింట్లు స్కోరు చేసి 12వ ర్యాంక్‌లో, అవ్‌నీత్ కౌర్ 687 పాయింట్లతో 16వ ర్యాంక్‌లో నిలిచారు. ఈ ఇద్దరికి కూడా తొలి రౌండ్‌లో 'బై' లభించింది. సురేఖ, అదితి, అవ్‌నీత్‌లతో కూడిన భారత మహిళల జట్టు టీమ్ విభాగంలో 2069 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ జోడీ ఆరో ర్యాంక్‌లో నిలిచి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందింది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో ప్రణయ్



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో కేరళకు చెందిన ప్రణయ్ రెండు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌కు చేరుకొని భారత నంబర్‌వన్‌గా నిలిచాడు. లక్ష్య సేన్ 22వ ర్యాంక్‌లో, కిడాంబి శ్రీకాంత్ 23వ ర్యాంక్‌లో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు ఒక స్థానం పురోగతి సాధించి 11వ ర్యాంక్‌లో నిలిచింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ రెండు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకోగా... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం రెండు స్థానాలు పడిపోయి ఏడో ర్యాంక్‌లో నిలిచింది.

రజతం నెగ్గిన అనూష



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు ఆంధ్రప్రదేశ్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో మల్లాల అనూష రజతం... జి.కార్తీక కాంస్య పతకం సాధించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో జరుగుతున్న ఈ టోర్నీలో అనూష 13.11 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలువగా... కార్తీక 13.10 మీటర్ల దూరం దూకి మూడో స్థానాన్ని దక్కించుకుంది. పూర్వ సావంత్ (మహారాష్ట్ర; 13.27 మీటర్లు) స్వర్ణ పతకాన్ని సాధించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ, తెలంగాణ అమ్మాయి అగసార నందిని ఫైనల్‌కు అర్హత సాధించారు.

సినిమా



మహేశ్ బాబు

ప్రభాస్

ఎన్టీఆర్

పాన్ ఇండియా టైటిల్

ఇండస్ట్రీలో పాన్ ఇండియా ట్రెండ్ కనిపిస్తోంది. సినిమాలు దేశవ్యాప్తంగా పలు భాషల్లో విడుదలవుతున్నాయి. దీంతో అన్ని భాషలవారికీ అనుగుణంగా ఉండే కథలను ఎంచుకుంటున్నారు. కథలు మాత్రమే కాదు.. టైటిల్ కూడా పాన్ ఇండియాకి సూట్ అయ్యేలా ఉండాలని ప్రయత్నం చేస్తున్నారు. ఒకే టైటిల్‌తో అన్ని భాషల్లో ఓ చిత్రం విడుదలైతే అది ఆడియన్స్‌కు మరింత చేరువ అవుతుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ క్రమంలో కొందరు టాప్ స్టార్స్ నటిస్తున్న చిత్రాల టైటిల్స్‌పై చర్చ జరుగుతోంది. 'ఫలానా టైటిల్ అనుకుంటున్నారట' అని వైరల్‌గా ఉన్న టైటిల్స్ 'పాన్ ఇండియా టైటిల్'లా ఉన్నాయి. మరి.. ఫైనల్‌గా ఆ టైటిల్స్‌నే ఫైనలైజ్ చేస్తారో? లేదో చెప్పలేం కానీ.. చర్చల్లో ఉన్న ఆ టైటిల్స్ గురించి మాత్రం చెప్పుకుందాం.

రాజా డీలక్స్?

ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె' వంటి భారీ యాక్షన్ సినిమాలు చేస్తున్నారు ప్రభాస్. కేవలం యాక్షన్ జానర్‌కే పరిమితం కాకుండా కాస్త కామెడీ తరహా పాత్రల్లో కూడా ప్రభాస్ నటించాలనుకుంటున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే దర్శకుడు మారుతితో ఓ సినిమా చేస్తున్నారు ప్రభాస్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. హారర్ అండ్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమా కథ రాజా డీలక్స్ అనే థియేటర్‌లో జరుగుతుందని, అందుకే ఈ సినిమాకు 'రాజా డీలక్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనుకుంటున్నారని సమాచారం. ఒకవేళ ఈ చిత్రాన్ని ఇతర భాషల్లో విడుదల చేయాలనుకుంటే.. అప్పుడు టైటిల్ మార్చే అవసరం లేకుండా పోతుంది.

గుంటూరు కారమా? ఊరికి మొనగాడా?

మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే జనవరి 13న విడుదల కానుంది. ఫస్ట్ లుక్ కూడా విడుదలైంది. ఇక ఈ చిత్రానికి 'అయోధ్యలో అర్జునుడు', 'ఊరికి మొనగాడు', 'పల్నాటి పోటుగాడు', 'అమరావతికి అటు ఇటు', 'గుంటూరు కారం' టైటిల్స్ తెరపైకి వచ్చాయి. ఎక్కువగా 'గుంటూరు కారం', 'ఊరికి మొనగాడు' వినిపిస్తున్నాయి. సూపర్‌స్టార్ కృష్ణ నటించిన హిట్ చిత్రాల్లో 'ఊరికి మొనగాడు' ఒకటి అని తెలిసిందే. కాగా ఈ నెల 31న కృష్ణ బర్త్ డే సందర్భంగా టైటిల్ ప్రకటించే చాన్స్ ఉంది. మరి, ఇక్కడ పేర్కొన్న టైటిల్స్‌లో ఏదో ఒకటి ఉంటుందా? వేరే టైటిల్‌ని ఫిక్స్ చేస్తారా? అనేది చూడాలి.

దేవర?

'జనతా గ్యారేజ్' తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. ఓ లీడ్ రోల్‌ను సైఫ్ అలీ ఖాన్ చేస్తున్నారు. కాగా ఈ సినిమాకు 'వస్తున్నా!', 'దేవర' టైటిల్స్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ తెర పైకి వచ్చింది. ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను అధికారికంగా ప్రకటిస్తారట. కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

వీరే కాదు.. మరికొందరు స్టార్స్ చిత్రాల టైటిల్స్‌పైనా చర్చ జరుగుతోంది. ప్రేక్షకులను ఆకర్షించే విషయాల్లో 'టైటిల్' ఒకటి. ఆ విషయాన్ని, కథనీ దృష్టిలో పెట్టుకుని టైటిల్స్ పెడుతుంటారు. ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇక ఫ్యాన్స్ గురించి చెప్పాలంటే టైటిల్ పవర్‌ఫుల్‌గా ఉంటే వారికి కిక్కే కిక్కు.

ప్రేమిస్తున్నా.. పాట బాగా నచ్చింది - రష్మిక మందన్న



● విరాజ్, వైష్ణవి, రష్మిక, ఆనంద్ దేవరకొండ

''బేబి' సినిమాలోని 'ప్రేమిస్తున్నా..' సాంగ్ మీకు (అభిమానులు) నచ్చిందా? అద్భుతంగా ఉంది కదా.. నాకూ బాగా నచ్చింది. ఆనంద్ మ్యూజిక్ సెన్స్‌కి నేను పెద్ద ఫ్యాన్. ఈ మూవీ ఎప్పుడు చూస్తానా? అని ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. 'బేబి' పెద్ద హిట్ కావాలి'' అని హీరోయిన్ రష్మికా మందన్న అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ప్రేమిస్తున్నా...' అనే పాటని అభిమానుల సమక్షంలో రష్మికా మందన్న హైదరాబాద్‌లో విడుదల చేశారు. సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని పీవీఎన్ఎస్ రోహిత్ పాడారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ-''బేబి' జూలై రెండోవారం లేదా మూడో వారంలో వస్తుంది. ఇదొక మ్యూజికల్ ఫిల్మ్. ముప్పై, నలభై ఏళ్ల తర్వాత కూడా వినే అద్భుతమైన పాట 'ప్రేమిస్తున్నా..' అన్నారు. ''ప్రమోషన్స్ కోసం ఇంత ఖర్చు పెడుతున్న ఎస్‌కేఎన్, మారుతిగార్లకు థ్యాంక్స్'' అన్నారు సాయి రాజేశ్. ''ప్రస్తుతం పెద్ద సినిమాలనే పట్టించుకోవడం లేదు.. అలాంటిది 'బేబి'లాంటి చిన్న సినిమా జనాల్లోకి వెళ్లడం గొప్పగా ఉంది'' అన్నారు డైరెక్టర్ మారుతి.

నేను స్టూడెంట్ సార్ అనేవాణ్ణి - విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, బెల్లంకొండ గణేశ్, రాఖీ, అవంతిక

''నేను ప్రతిరోజూ విద్యార్థిలానే భావిస్తాను. 'నేను స్టూడెంట్ సర్' టైటిల్ విన్నప్పుడు నా కాలేజీ రోజులు గుర్తుకొచ్చాయి. ఏదైనా తింగరి పని చేసి పోలీసులకు దొరికినప్పుడు 'నేను స్టూడెంట్ సార్' అనేవాణ్ని'' అన్నారు హీరో విశ్వక్ సేన్. బెల్లంకొండ గణేశ్ హీరోగా రాఖీ ఉప్పలపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్'. 'నాంది' సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదల కానుంది. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని '24/7 ఒకటే ధ్యాస..' అనే పాటని విశ్వక్ సేన్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''నేను స్టూడెంట్ సర్' టీజర్ బాగుంది. సినిమా మంచి హిట్ కావాలి'' అన్నారు. ''ఫోన్ కొనడానికి కష్టపడే సమయంలో వచ్చే మాంటేజ్ సాంగ్ '24/7 ఒకటే ధ్యాస..'' అన్నారు బెల్లంకొండ గణేశ్. ''మా సినిమాని అందరూ చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు రాఖీ ఉప్పలపాటి. ''హీరో క్యారెక్టర్ ఏంటో ఈ పాట ద్వారా చెప్పాం'' అన్నారు సతీష్ వర్మ. కథారచయిత కృష్ణ చైతన్య, పాటల రచయిత హర్ష, హీరోయిన్లు అవంతిక, రితిక మాట్లాడారు.

కాన్స్ కబురు



● మృణాల్ ఠాకూర్

'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్‌కి కాన్స్ నుంచి కబురొచ్చింది. ప్రతి ఏడాది ఫ్రాన్స్‌లో జరిగే కాన్స్ చిత్రోత్సవాలు ఈ నెల 16న ఆరంభమయ్యాయి. 27 వరకు కొనసాగుతాయి. ఈ చిత్రోత్సవాల్లో మృణాల్ రెడ్ కార్పెట్‌పై తొలిసారి మెరవనున్నారు. ఈ విషయంపై మృణాల్ మాట్లాడుతూ - ''అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్‌మేకర్స్‌తో మాట్లాడటానికి ఈ వేదిక నాకు ఉపయోగపడుతుంది. భారతీయ చలన చిత్రపరిశ్రమ ఖ్యాతిని నేను అక్కడ ప్రస్తావించాలనుకుంటున్నాను'' అన్నారు మృణాల్. ఈ నెల 17 నుంచి 19 తేదీల్లో మూడు రోజుల పాటు మృణాల్ కాన్స్ చిత్రోత్సవాల్లో సందడి చేస్తారట.

స్పైకి కథే హీరో - నిఖిల్



● నిఖిల్, ఐశ్వర్యా మీనన్, గ్యారీ బీహెచ్

''ఈ మధ్య ప్రేక్షకులు ఇష్టపడుతున్నది మంచి కథనే. హీరో, ఎంటర్‌టైన్‌మెంట్ ఎంత ఉన్నా కథ అనే సోల్ లేకపోతే బ్లాక్ బస్టర్ అవ్వదు. 'స్పై' మూవీకి కథే హీరో'' అని హీరో నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'స్పై'. ఈ సినిమా జూన్ 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో హీరో నిఖిల్ మాట్లాడుతూ - ''సుభాష్ చంద్రబోస్‌గారి గురించి, ఆయన స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ గురించి, ఆ సంస్థ సేవల గురించి చాలామందికి తెలియదు. దేశానికి తెలియాల్సిన ఆ విషయాలతో పాటు వినోదాత్మకంగా ఈ మూవీ ఉంటుంది'' అన్నారు. 'కార్తికేయ 2' తర్వాత ఓ పార్టీకి అనుకూలంగా మీరు 'స్పై' చేస్తున్నారనే ప్రచారంపై మీ స్పందన అని అడగ్గా - ''కృష్ణుడంటే నాకు నమ్మకం. అందుకే 'కార్తికేయ 2' చేశాను. ఇప్పుడు ఓ భారతీయుడిగా 'స్పై' చేశాను. నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు'' అన్నారు నిఖిల్. ''డైరెక్టర్‌గా నా తొలి సినిమా నిఖిల్‌తో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు గ్యారీ బీహెచ్. ''స్పై' చూసి ప్రేక్షకులు థ్రిల్ అవుతారు'' అన్నారు చరణ్ తేజ్ ఉప్పలపాటి. సంగీత దర్శకులు శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్, సినిమాటోగ్రాఫర్ వంశీ పచ్చిపులుసు, మాటల రచయిత అనిరుధ్ కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు.

అలాంటి వారిలో నేనూ ఒకణ్ణి - మిక్కీ జే మేయర్



''నా మ్యూజిక్ కంపోజర్స్ టీమ్ అందరూ అమెరికా, లండన్‌లో ఉంటారు. సో.. నేను అమెరికాలో ఉన్నప్పటికీ నిర్మాతలు ఇబ్బందిపడటంలేదు. ఓ సినిమా హిట్ అయితే హీరో, డైరెక్టర్స్‌తో పాటు సంగీత దర్శకుడికి మంచి పేరు వస్తుంది. అందుకే స్క్రిప్ట్ ముఖ్యమని నమ్ముతాను. ఇక ఇటు శేఖర్ కమ్ములగారి నుంచి హరీష్ శంకర్, అటు నాగ్ అశ్విన్ నుంచి నందినీ రెడ్డిగార్ల సినిమాలు.. ఇలా డిఫరెంట్ సినిమాలకు మ్యూజిక్ అందించిన అతి కొద్దిమంది మ్యూజిక్ డైరెక్టర్స్‌లో నేనూ ఒకణ్ణి'' అన్నారు సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్రవిందా మూవీస్, స్వప్నా సినిమాస్ పతాకాలపై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర సంగీతదర్శకుడు మిక్కీ జే మేయర్ మాట్లాడుతూ- ''మహానటి' తర్వాత వైజయంతీ మూవీస్‌లో నేను చేసిన సినిమా 'అన్నీ మంచి శకునములే'. ఇందులో ఆరు పాటలు ఉన్నాయి. నందినీ రెడ్డిగారు కథ చెప్పినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. అలాగే కథలో ఆమె క్రియేట్ చేసిన విక్టోరియాపురం ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న రెండు సినిమా లకు, దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలగారితో ఓ ప్రాజెక్ట్, 'చాంపియన్' అనే మరో ప్రాజెక్ట్, 'సెల్ఫిష్', అమెరికాలో ఉన్న మరో దర్శకుడితో ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

1960లో ఏం జరిగింది?



జీవన్, అలేఖ్య జంటగా అశ్విన్ కామరాజు కొప్పల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వృషభ'. ఉమా శంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. పలమనేరులో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం ట్రైలర్‌ను ఎమ్మెల్యే వెంకటయ్య గౌడ్, టైటిల్ పోస్టర్‌ను ప్రభుత్వ ఆస్పత్రి చైర్మన్ ఆర్. చెంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పవిత్రా మురళీ కృష్ణ రిలీజ్ చేశారు. ''మనుషులకు, గోవులకు మధ్య ఉన్న అనుబంధం నేపథ్యంలో 'వృషభ' కథ ఉంటుంది'' అన్నారు ఉమాశంకర్ రెడ్డి. ''1960 నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుంది'' అన్నారు అశ్విన్ కామరాజు కొప్పల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు			
సెన్సెక్స్ ▽	413	61,932	
నిఫ్టీ ▽	112	18,287	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,390	△	24
డోజోన్స్	33,118	▽	230
ఎఫ్‌టీఎస్ఈ 100	7,751	▽	27
డాక్స్	15,898	▽	19
షాంఘై	3,291	▽	20
నికాయ్	29,843	△	217

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో – ముంబై	
బంగారం (24 క్యారట్)	61,066
బంగారం (22 క్యారట్)	60,821
వెండి (కిలో)	71,930

కార్ల కంపెనీలు.. క్యాంపస్ బాట!

- కాలేజీల నుంచి జోరుగా హైరింగ్
- డేటా అనలిటిక్స్, ఎలక్ట్రిఫికేషన్ నైపుణ్యాలకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ: ప్రతిభావంతులైన యువ సిబ్బందిని రిక్రూట్ చేసుకునే క్రమంలో ఆటోమొబైల్ కంపెనీలు గతంలో ఎన్నడూ లేనంతగా ఇంజినీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూల్స్ మీద దృష్టి పెడుతున్నాయి. దీంతో గౌహతి, మండీ లాంటి ప్రాంతాల్లోని ఐఐటీల్లో (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు ఈసారి గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్యాసింజర్ కార్ల మార్కెట్లలో ఒకటిగా భారత్ ఎదుగుతున్న నేపథ్యంలో ఆటోమొబైల్ కంపెనీలు వివిధ విభాగాల్లో ప్రతిభావంతులను మరింతగా నియమించుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో హైరింగ్‌ను పెంచుకుంటున్నట్లు వివరించాయి. అనలిటిక్స్, ఎలక్ట్రిఫికేషన్, ఇండస్ట్రీ 5.0 నైపుణ్యాలు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నాయి. 2024 బ్యాచ్ నుంచి మేనేజ్‌మెంట్, గ్రాడ్యుయేట్ ట్రైనీలను తీసుకోవాలని జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భావిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి 15–20% ఎక్కువ మందిని తీసుకోబోతున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. క్యాంపస్ నుంచి రిక్రూట్ చేసుకున్న వారికి కొత్త టెక్నాలజీలు, ప్లాట్‌ఫాంలపై తగు శిక్షణ ఇచ్చి భవిష్యత్ అవసరాల కోసం సిద్ధం చేసుకోవాలని కంపెనీ భావిస్తోంది. ఇప్పటికే డేటా అనలిటిక్స్ తదితర విభాగాల్లో నైపుణ్యాలున్న వారిని రిక్రూట్ చేసుకునే ప్రక్రియ కూడా ప్రారంభించింది. డేటా మైనింగ్ తదితర సాంకేతికతలతో ఈ-కామర్స్ చానల్స్‌ను అభివృద్ధి చేసేందుకు, బ్యాక్-ఎండ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసేందుకు వీరిని వినియోగించుకోవాలనేది కంపెనీ యోచన.

మారుతీ కూడా..

గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు అమ్మకాల ఊతంతో భవిష్యత్ అవసరాల కోసం నియామకాలను మరింతగా పెంచుకునేందుకు మారుతీ సుజుకీ కూడా సన్నద్ధమవుతోంది. వ్యాపార విస్తరణకు అనుగుణంగా క్యాంపస్ నుంచి నియామకాలను కూడా పెంచుకుంటున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది క్యాంపస్‌ల నుంచి 1,000 మంది వరకూ సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు పేర్కొన్నాయి. సంస్థలో అంతర్గతంగా కొత్త టెక్నాలజీలను ప్రవేశపెట్టడం, డిజిటల్ పరివర్తన మొదలైన వాటిని వేగంగా అమలు చేస్తున్నామని, ఇందుకోసం తత్సంబంధ నైపుణ్యాలున్న ప్రతిభావంతుల అవసరం చాలా ఉంటోందని వివరించాయి.

మరోవైపు, మహీంద్రా అండ్ మహీంద్రా కూడా ఇటీవలే తమ క్యాంపస్ హైరింగ్‌ల జాబితాలో మరిన్ని కొత్త ఐఐటీలు, ఎంబీయే సంస్థలను కూడా చేర్చింది. 2022లో దాదాపు 50 పైగా ఇంజినీరింగ్, ఎంబీఏ సంస్థల నుంచి మహీంద్రా ఎంట్రీ లెవెల్ సిబ్బందిని తీసుకుంది. సగటున 500–600 మందిని రిక్రూట్ చేసుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. అటు హీరో మోటోకార్ప్ సంస్థ డిప్లొమా ఇంజినీర్ల నియామకం కోసం ఢిల్లీ స్కిల్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ యూనివర్సిటీతో జట్టు కట్టింది. క్రితం సంవత్సరంతో పోలిస్తే తాము 40 శాతం ఎక్కువ మందిని క్యాంపస్ నుంచి రిక్రూట్ చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. వీరిలో ఎక్కువగా మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకాట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్లు, ఎంబీఏలు ఉన్నట్లు పేర్కొన్నారు. కొరియా దిగ్గజం హ్యుందాయ్ మోటార్ భారత్‌లో తన కార్యకలాపాల కోసం వివిధ విభాగాల్లో, హోదాల్లో 1,000 పైగా ఉద్యోగాలను భర్తీ చేసే యత్నాల్లో ఉంది. క్యాంపస్‌ల విషయానికొస్తే.. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ నేపథ్యం ఉన్నవారికి ప్రాధాన్యం లభించనుంది.

క్యాంపస్‌లలోనూ ఆసక్తి..

ఆటోమొబైల్ కంపెనీల నియామకాల ప్రణాళికలపై క్యాంపస్‌లలో కూడా ఆసక్తి నెలకొంది. ఐఐటీ–గౌహతిలో గతేడాదితో పోలిస్తే ఈసారి కోర్ ఇంజినీరింగ్ నైపుణ్యాలున్న వారికి ఆఫర్లు గణనీయంగా పెరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కోర్ ఇంజినీర్, డిజైన్ ఇంజినీర్, బిజినెస్ అనలిస్ట్, డేటా ఇంజినీర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ తదితరుల కోసం డిమాండ్ నెలకొన్నట్లు పేర్కొన్నాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి తమ దగ్గర నుంచి రిక్రూట్ చేసుకునే ఆటోమొబైల్ కంపెనీల సంఖ్య పెరిగినట్లు ఐఐటీ–మండీ వర్గాలు తెలిపాయి. కోవిడ్‌పరమైన మందగమనం ప్రభావం తగ్గడం ఇందుకు కారణం కావచ్చని భావిస్తున్నట్లు వివరించాయి.

భారతీ ఎయిర్‌టెల్ లాభాలు ఆకర్షణీయం

- మార్చి క్వార్టర్‌కు రూ.3,006 కోట్లు
- రూ.193కి చేరిన ఏఆర్‌పీయూ
- ఏడాది చివరికి అన్ని పట్టణాలకూ 5జీ



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసికానికి ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 49% పెరిగి రూ.3,006 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలానికి సంస్థ లాభం రూ.2,008 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.31,500 కోట్ల నుంచి రూ.36,009 కోట్లకు ఎగసింది. 14 శాతం వృద్ధిని చూపించింది. భారతీ ఎయిర్‌టెల్ దేశీ వ్యాపారం (భారత్ వరకు) మార్చి త్రైమాసికంలో 12% వృద్ధితో రూ.25,200 కోట్లుగా ఉంటే, 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి 19% వృద్ధితో రూ.82,488 కోట్లుగా నమోదైంది. సగటు వినియోగదారు నుంచి వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ.193కు చేరుకుంది. 2022 మార్చి త్రైమాసికంలో ఏఆర్‌పీయూ 178గా ఉంది. ''నాణ్యమైన కస్టమర్లను సొంతం చేసుకోవడంపై దృష్టి సారించడంతో 74 లక్షల కొత్త 4జీ కస్టమర్లు మాకు తోడయ్యారు. 5జీ నెట్‌వర్క్‌ను ఈ ఏడాది చివరికి అన్ని ముఖ్య పట్టణాలు, కీలకమైన గ్రామాలకు చేరువ చేయాలన్నది మా లక్ష్యం'' ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విట్టల్ తెలిపారు.

2022–23 సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెట్టింపై రూ.8,346 కోట్లకు చేరుకుంది. కన్సాలిడేటెడ్ ఆదాయం 19 శాతానికి పైగా పెరిగి రూ.1,39,145 కోట్లుగా నమోదైంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా భేష్



168 శాతం ఎగసిన నికర లాభం

ముంబై: బ్యాంక్ ఆఫ్ బరోడా మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.4,775 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభంతో పోల్చి చూస్తే 168 శాతం వృద్ధి చెందింది. నికర వడ్డీ ఆదాయం 34 శాతం పెరిగి రూ.11,525 కోట్లుగా ఉంది. రుణాల్లో 19 శాతం వృద్ధి నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 3.53 శాతానికి పుంజుకుంది. ఇది క్రితం ఏడాది ఇదే కాలంలో 3.07 శాతంగానే ఉంది. బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 3.79 శాతానికి తగ్గాయి. 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరం లాభంతో పోల్చి చూస్తే రెట్టింపై రూ.14,110 కోట్లుగా నమోదైంది. అధిక నికర వడ్డీ మార్జిన్(నిమ్) తమనూ ఆశ్చర్యపరిచిందని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండీ, సీఈవో సంజీవ్ చద్దా పేర్కొన్నారు. 2023–24 సంవత్సరంలోనూ 3.5 శాతం మేర నిమ్‌ను కొనసాగిస్తామన్నారు.

ఇండియన్ ఆయిల్‌కు భారీ లాభాలు

- 52 శాతం పెరిగి రూ.10,841 కోట్లు
- షేరుకు రూ.3 చొప్పున తుది డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) మార్చి త్రైమాసికానికి మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 52 శాతం వృద్ధితో రూ.10,841 కోట్లుగా నమోదైంది. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.2,09,045 కోట్ల నుంచి రూ.2,30,711 కోట్లకు చేరుకుంది. 2022–23 సంవత్సరానికి ప్రతి షేరుకు రూ.3 చొప్పున తుది డివిడెండ్‌ను ఐవోసీ బోర్డు ప్రకటించింది. అనుబంధ సంస్థలు కాకుండా స్టాండలోన్ నికర లాభం మార్చి త్రైమాసికానికి 67 శాతం పెరిగి రూ.10,059 కోట్లుగా నమోదైంది. అంతకు ముందు డిసెంబర్ త్రైమాసికంలో వచ్చిన రూ.448 కోట్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. గత ఐదు త్రైమాసికాల్లో ఐవోసీ లాభంలో వృద్ధిని చూడడం ఇదే మొదటి సారి. రిటైల్ ధరలను సవరించకుండా ఉండడంతో ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు కొన్ని త్రైమాసికాలుగా గడ్డు పరిస్థితులను చూశాయి. మార్చి త్రైమాసికంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ఇవి తిరిగి లాభాల బాట పట్టాయి. విభాగాల వారీగా చూస్తే.. పెట్రోలియం ఉత్పత్తుల రూపంలో ఆదాయం 11 శాతం పెరిగి రూ.2,20,429 కోట్లుగా ఉంది. ఫలితాలు ఆకర్షణీయంగా ఉండడంతో బీఎస్ఈలో ఐవోసీ షేరు 4 శాతం లాభపడి రూ.87.40 వద్ద ముగిసింది.

వేగన్-ఆర్ @ 30 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా హ్యాచ్‌బ్యాక్ వేగన్-ఆర్ 30 లక్షల యూనిట్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు నమోదు చేసింది. 1999లో ఈ మోడల్ భారత మార్కెట్లో ఎంట్రీ ఇచ్చింది. 2008లో 5 లక్షల యూనిట్లు, 2012 నాటికి 10 లక్షల యూనిట్ల విక్రయాల మార్కును చేరుకుంది. ఆ తర్వాత అయిదేళ్లలోనే అమ్మకాలు రెండింతలయ్యాయి. 2021 నాటికి మొత్తం 25 లక్షల కార్లు రోడ్డెక్కాయి. ప్రస్తుతం థర్డ్ జనరేషన్ వేగన్-ఆర్ మార్కెట్లో ఉంది. ధర ఎక్స్‌షోరూంలో రూ.5.54–7.42 లక్షల మధ్య పలుకుతోంది. కె-సిరీస్, డ్యూయల్ జెట్, డ్యూయల్ వీవీటీ 1.0, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజన్ ఆప్షన్స్‌లో లభిస్తోంది. మాన్యువల్, ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో రూపుదిద్దుకుంది. సీఎన్‌జీ వేరియంట్ కూడా ఉంది. యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, హిల్ హోల్డ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. వేగన్-ఆర్ కస్టమర్లలో 24 శాతం మంది ఇదే మోడల్‌కు అప్‌గ్రేడ్ అవుతున్నట్టు మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. 2021–22లో 1,89,000 యూనిట్లు, 2022–23లో 2,12,000 యూనిట్లతో దేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా వేగన్-ఆర్ స్థానం దక్కించుకుంది.

రెండు రోజుల ర్యాలీకి బ్రేక్



సెన్సెక్స్ 413, నిఫ్టీ 112 పాయింట్లు డౌన్

ముంబై: రెండు హెచ్‌డీఎఫ్‌సీ సంస్థలు, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజాల షేర్లు క్షీణించడంతో దేశీ సూచీల రెండు రోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. మంగళవారం సెన్సెక్స్ 413 పాయింట్లు తగ్గి 61,932 వద్ద, నిఫ్టీ 112 పాయింట్లు క్షీణించి 18,287 వద్ద క్లోజయ్యాయి. లాభాల స్వీకరణ జరగడంతో సెన్సెక్స్ కీలకమైన 62,000 మార్కు దిగువన ముగిసిందని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ విభాగం హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. గత కొద్ది వారాలుగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు, ఆశావహ ఆర్థిక గణాంకాలు మొదలైనవి ర్యాలీకి ఊతంగా నిల్చాయని పేర్కొన్నారు. అయితే వడ్డీ రేట్ల కదలికలపై అనిశ్చితి, డిమాండ్ మందగించడం వంటి అంశాల కారణంగా ఇన్వెస్టర్లు తరచుగా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉందని చౌహాన్ వివరించారు. హెవీ వెయిట్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్ పరుగుకు బ్రేక్ పడిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. మంగళవారం.. సెన్సెక్స్ సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ మొదలైనవి క్షీణించాయి. బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, టైటాన్ మొదలైనవి లాభపడ్డాయి. ఆటో సూచీ 0.97%, ఆర్థిక సర్వీసులు 0.53 శాతం, బ్యాంకెక్స్ 0.36 శాతం క్షీణించాయి.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎన్ఆర్ఎస్‌సీ, హైదరాబాద్‌లో 70 గ్రాడ్యుయేట్/టెక్నీషియన్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏడాది అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం ఖాళీల సంఖ్య: 70
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–17, టెక్నీషియన్ అప్రెంటిస్–30, డిప్లొమా అప్రెంటిస్–23. » విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, డిప్లొమా ఇంజనీరింగ్ (కమర్షియల్ ప్రాక్టీస్) ఉత్తీర్ణులై ఉండాలి. » స్టయిపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000, టెక్నీషియన్/డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.8000.
» ఎంపిక విధానం: డిగ్రీ/డిప్లొమా స్థాయిలో అభ్యర్థులు సాధించిన అకడమిక్ స్కోరు ఆధారంగా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.06.2023.
» వెబ్‌సైట్: www.nrsc.gov.in

ఎన్‌టీపీసీ, న్యూఢిల్లీలో 120 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 120
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్)–100, అసిస్టెంట్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్)–20. » అర్హత: బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్), పని అనుభవంతోపాటు గేట్–2022 స్కోరు సాధించి ఉండాలి. వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.55,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: అప్లికేషన్ స్క్రీనింగ్, షార్ట్‌లిస్టింగ్, సెలక్షన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.05.2023.
» వెబ్‌సైట్: www.ntpc.co.in

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 24 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎన్‌టీపీసీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 24
» పోస్టుల వివరాలు: ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్)–22, ఎగ్జిక్యూటివ్(పీ–ఎస్)–02.
» అర్హత: బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 18.05.2023.
» వెబ్‌సైట్: www.ntpc.co.in

మెరైన్ కోర్సులు.. కెరీర్ మెరిసె

» ఐఎంయూ సెట్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిగ్రీ, పీజీ, బీబీఏ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీలో ప్రవేశాలు

ఇండియన్ మారిటైం యూనివర్సిటీ (ఐఎంయూ). ఇది కేంద్రీయ విశ్వవిద్యాలయం. భారత ప్రభుత్వానికి చెందిన షిప్పింగ్, వాటర్‌వేస్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఐఎంయూకు దేశవ్యాప్తంగా ఆరు క్యాంపస్‌లు, 17 అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఉన్నాయి. వీటిల్లో యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఎంయూ సెట్-2023లో ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నేపథ్యంలో.. ఐఎంయూ అందించే కోర్సులు, అర్హతలు, ప్రవేశ పరీక్ష తదితర వివరాలు..

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీటెక్(మెరైన్ ఇంజనీరింగ్): ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇది చెన్నై, కోల్‌కతా, ముంబై పోర్ట్ క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- బీటెక్(నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్): ఈ కోర్సు వ్యవధి కూడా నాలుగేళ్లు. విశాఖపట్నం క్యాంపస్ ఈ కోర్సును అందిస్తోంది.
- బీఎస్సీ(నాటికల్ సైన్స్): ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు. చెన్నై, కొచ్చిన్, నవీ ముంబై క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- బీబీఏ(లాజిస్టిక్స్, రిటైలింగ్ అండ్ ఈ కామర్స్): ఇది మూడేళ్ల కోర్సు. చెన్నై, కొచ్చిన్ క్యాంపస్‌లు ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఇందులో చేరేందుకు ఐఎంయూ సెట్ రాయాల్సిన అవసరం లేదు. ఐఎంయూ అడ్మిషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత కోర్సులో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- డీఎన్ఎస్(డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్): ఇది ఏడాది కోర్సు. చెన్నై, నవీ ముంబై క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.
- అర్హత: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కోరుకునే వారు కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్)లో ఉత్తీర్ణత సాధించాలి.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు

- ఎంబీఏ(పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్): కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. చెన్నై, కొచ్చిన్ క్యాంపస్‌లు ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.
- ఎంబీఏ(ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్): కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. చెన్నై, కోల్‌కతా, విశాఖపట్నం, కొచ్చిన్ క్యాంపస్‌ల్లో అందుబాటులో ఉంది.



ఐఎంయూ సెట్ 2023

- ఎంటెక్(మెరైన్ టెక్నాలజీ): కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇది కోల్‌కతా క్యాంపస్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.
- ఎంటెక్(నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్): కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. ఈ కోర్సును విశాఖపట్నం క్యాంపస్ అందిస్తోంది.
- ఎంటెక్(డ్రెడ్జింగ్ అండ్ హార్బర్ ఇంజనీరింగ్): కోర్సు కాలవ్యవధి రెండేళ్లు. దీన్ని విశాఖపట్నం క్యాంపస్‌లో అందిస్తున్నారు.
- అర్హత: పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలంటే.. ఆయా ప్రోగ్రాములను అనుసరించి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత తప్పనిసరి.వయసుతో సంబంధం లేదు.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మెరైన్ ఇంజనీరింగ్

- ఇది ఏడాది కోర్సు. ముంబై పోర్ట్ క్యాంపస్‌లో అందుబాటులో ఉంది. సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు.
- పీహెచ్‌డీ అండ్ ఎంఎస్(రీసెర్చ్) ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పరీక్ష విధానం

- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 200 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్/10+2 స్థాయి ఇంగ్లిష్, జనరల్ ఆప్టిట్యూడ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలొస్తాయి.
- ఎంబీఏ కోర్సుకు నిర్వహించే ప్రవేశ పరీక్షలో 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- పీజీ కోర్సులకు సంబంధించిన ఎంట్రెన్స్ టెస్ట్‌లో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. లాజికల్ రీజనింగ్, మ్యాథమేటిక్స్, మెకానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్/నావల్ ఆర్కిటెక్చర్/మెరైన్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- పీహెచ్‌డీ, ఎమ్మెస్(రీసెర్చ్): ప్రవేశ పరీక్షను పార్ట్–1, పార్ట్–2 పద్ధతిలో నిర్వహిస్తారు. పార్ట్–1లో 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. జనరల్ మెంటల్ ఎబిలిటీ, నాలెడ్జ్ ఆఫ్ మారిటైం సెక్టార్ అండ్ నాలెడ్జ్ ఆఫ్ ది స్కూల్/ఏరియా ఆఫ్ రీసెర్చ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పార్ట్–2లో స్కూల్/ఏరియాకు సంబంధించిన వ్యాసం ఇస్తారు. పరీక్ష సమయం ఒక గంట. రుణాత్మక మార్కులుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 శాతం మార్కు కోత ఉంటుంది.

ఉద్యోగావకాశాలు

ఈ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఎస్‌వైకే గ్రూప్, అదానీ, సీపోల్, టీవీఎస్, ఏసీటీఎల్, టీమ్ గ్లోబల్, స్విఫ్ట్ లాజిస్టిక్స్ తదితర సంస్థల్లో కొలువులు దక్కించుకోవచ్చు. అదేవిధంగా బెటా, క్యాట్ లాజిస్టిక్స్, సెంచూరీ ప్లై మ్యాక్, దమ్కో, డీహెచ్ఎల్, జీవీకే, హోండా, అదానీ, టీవీఎస్, టీఎస్ఈ, లాజిస్టిక్స్, బ్లూలైన్ లాంటి సంస్థలు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 18.05.2023
- హాల్‌టికెట్ డౌన్‌లోడ్: 26.05.2023
- ఐఎంయూ–సెట్ తేదీ: 10.06.2023
- వెబ్‌సైట్: http://www.imu.edu.in

ఇంటర్‌తోనే టీచర్

» టీఎస్ డీఈఈసెట్-2023 ప్రకటన విడుదల
» ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనకు మార్గం

టీఎస్ డీఈఈసెట్.. తెలంగాణ స్టేట్ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్. ఈ పరీక్షలో అర్హత సాధిస్తే.. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డి.ఇఎల్.ఇడి.), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డి.పి.ఎస్.ఇ) కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిని పూర్తిచేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో బోధన వృత్తిలో కెరీర్ ప్రారంభించొచ్చు. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు పోటీపడొచ్చు. తెలంగాణ రాష్ట్రంలో టీఎస్ డీఈఈ సెట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షకు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు...

అర్హతలు

- కనీసం 50 శాతం(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం) మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులవ్వాలి. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్స్ సమయానికి ఉత్తీర్ణత సాధించాలి.
- వయసు: 2023, సెప్టెంబర్ 1 నాటికి 17 ఏళ్లు నిండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం

టీఎస్ డీఈఈసెట్ ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రంలో పార్ట్–1, పార్ట్–2, పార్ట్–3 అనే మూడు విభాగాలు ఉంటాయి. పార్ట్–1లో 10 ప్రశ్నలు–10 మార్కులకు, పార్ట్–2లో 30 ప్రశ్నలు–30 మార్కులకు, పార్ట్–3లో 60 ప్రశ్నలు–60 మార్కులకు చొప్పున పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థుల ఎంపికకు అనుగుణంగా ప్రశ్నపత్రం తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.

పార్ట్-1

ఈ విభాగంలో జనరల్ నాలెడ్జ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10మార్కులకు–10 ప్రశ్నలు ఇస్తారు.

పార్ట్-2

ఈ విభాగంలో తెలుగు మీడియం విద్యార్థులకు జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, జనరల్ తెలుగు నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లిష్ మీడియం అయితే జనరల్ ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ తెలుగు/ఉర్దూ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి. ఉర్దూ మీడియం వారికి జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, జనరల్ ఉర్దూ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు.

పార్ట్-3

ఈ విభాగంలో మ్యాథమేటిక్స్ నుంచి 20 ప్రశ్నలు, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10 ప్రశ్నలు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 10 ప్రశ్నలు, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నల చొప్పున అడుగుతారు.

ప్రిపరేషన్ ఇలా

- టీచింగ్ ఆప్టిట్యూడ్‌లో ఉపాధ్యాయ వృత్తి, తరగతి గది నిర్వహణ, పాఠశాల వాతావరణం, బోధన సామర్థ్యం తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- జీకే అండ్ కరెంట్ అఫైర్స్‌లో భాగంగా క్రీడలు, అవార్డులు, రాజకీయ పరిణామాలు, ఆర్థిక, రక్షణ, భౌగోళిక పరమైన అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- ఇంగ్లిష్‌కు సంబంధించి ఆర్టికల్స్, ప్రిపొజిషన్స్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్; సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్సెస్; డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్ తదితర అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి.
- తెలుగులో సంధులు, ఛందస్సు, సమాసాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, రచయితలు–రచనలు తదితర అంశాలపై దృష్టిసారించాలి.
- మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ స్టడీస్‌లలో పదో తరగతి స్థాయి అంశాలను చదవాలి.



టీఎస్ డీఈఈసెట్ 2023

- పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి. ఏయే అంశాలకు వెయిటేజీ ఎక్కువగా ఉందో గమనించాలి.
- వీలైనన్ని ఎక్కువ మోడల్ టెస్టులు రాయాలి. మోడల్ టెస్టులు రాస్తూ.. తప్పులను సరిదిద్దుకుంటూ.. ఎప్పటికప్పుడు సాధనను మెరుగుపరచుకోవాలి.

సీట్ల కేటాయింపు

- రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్)లు, ప్రైవేటు అన్ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్(మైనారిటీ,నాన్ మైనారిటీలతో సహా) డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డి.ఇఎల్.ఇడి.), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డి.పి.ఎస్.ఇ.) కోర్సులను అందిస్తున్నాయి.
- వీటిలో ఎక్కడ చేరాలన్నా.. డీఈఈ సెట్ రాయాల్సిందే. డీఈఈసెట్‌లో అర్హత పొందాలంటే.. పరీక్షలో కనీసం 35 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన లేదు.
- పరీక్షలో ర్యాంకు సాధించిన అభ్యర్థులకు రిజర్వేషన్లు అనుసరించి కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ డైట్ కళాశాలల్లో వంద శాతం, ప్రైవేటు అన్ఎయిడెడ్ నాన్ మైనారిటీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్, ప్రైవేటు అన్ఎయిడెడ్ మైనారిటీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో 80 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో కేటగిరీ 'ఎ' కింద భర్తీ చేస్తారు. 20 శాతం సీట్లకు కేటగిరీ 'బి'లో ఆయా విద్యాసంస్థలే ప్రవేశాలు కల్పిస్తాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లు స్థానికులకు కేటాయిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లకు అందరూ పోటీపడవచ్చు.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేదీ: 22.05.2023
- డీఈఈసెట్ తేది: 01.06.2023
- వెబ్‌సైట్: http://deecet.cdse.telangana.gov.in

క్లుప్తంగా...

ఆవిష్కరణల్లో పరస్పర సహకారం

ఆస్కి, టీ–హబ్ అవగాహన ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ఆవిష్కరణలకు పరస్పర సహకారాన్ని అందించడం, టెక్నాలజీ ఆధారిత స్టార్టప్ కంపెనీలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా టి–హబ్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఏడాది పాటు అమల్లో ఉండే ఈ ఒప్పందంపై ఆస్కి డైరెక్టర్ జనరల్ డాక్టర్ నిర్మల్య బాగ్చి, టి–హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు సంతకాలు చేశారు. ఆవిష్కరణల్లో పురోగతి కోసం అవసరమైన పూర్తి వ్యవస్థను రూపొందించేందుకు ఈ ఒప్పదం దోహదం చేస్తుంది. ప్రభుత్వ పాలనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా ఇన్నోవేషన్ ఛాలెంజ్, హ్యాకథాన్‌లను నిర్వహిస్తారు. కొత్త స్టార్టప్‌లకు ఊతమివ్వడం, స్టార్టప్‌ల కార్యకలాపాలను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వం, విద్యాసంస్థలు, పౌర సమాజంతో ఉమ్మడి సమావేశాలు, సదస్సులు ఏర్పాటు చేస్తారు.

టీఎస్ఐసెట్‌కు రేపటి వరకు గడువు

కేయూ క్యాంపస్: టీఎస్ఐసెట్–2023కు అపరాధ రుసుము రూ.500తో ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సెట్ కన్వీనర్ పి.వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఐసెట్‌కు 74,598 దరఖాస్తులు వచ్చాయని, అభ్యర్థులు ఈ నెల 22 నుంచి సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 26, 27 తేదీల్లో రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు మళ్లీ ఎంసీఏ రాసే చాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఎంసీఏ ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పరీక్ష రాసేందుకు అధికారులు చివరి అవకాశం కల్పించారు. వివిధ కాలేజీల్లో 2000–01 నుంచి 2014–15 మధ్య విద్యా సంవత్సరాల్లో చదివి ఫెయిలయిన విద్యార్థులు పరీక్ష రాయాలనుకుంటే, ఈ నెల 23లోగా ఫీజులు చెల్లించాలని ఓయూ అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫీజు గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువును ఈ నెల 19 వరకు పొడిగించినట్టు ఇంటర్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. వాస్తవానికి పరీక్ష ఫీజు గడువు మంగళవారంతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డ్ తెలిపింది. అదే విధంగా రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ దరఖాస్తుకు చివరి తేదీని ఈ నెల 17 వరకు పొడిగించినట్టు పేర్కొంది.

నేడే పాలిసెట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్–2023) బుధవారం జరుగనుంది. ఇందుకోసం 296 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సాంకేతిక విద్యామండలి కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. ఓఎంఆర్ షీట్‌లో రెండువైపులా వివరాలను నింపి, సంతకం చేయాలన్నారు. విద్యార్థులు తమవెంట బ్లాక్ పెన్సిల్, ఎరేజర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తెచ్చుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని స్పష్టం చేశారు.

నకిలీ చలాన్ల కేసులో నలుగురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: బోధన్ కమర్షియల్ ట్యాక్స్ నకిలీ చలాన్ల కేసులో మరో నలుగురు నిందితులను సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసు దర్యాప్తును బోధన్ టౌన్ పోలీసుల నుంచి సీఐడీ అధికారులు చేపట్టారు. ఇప్పటివరకు 17 మంది నిందితులను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. తప్పించుకుని తిరుగుతున్న నిందితుల కోసం అధికారులు గాలిస్తూనే ఉన్నారు. తాజాగా డీఎస్పీ ఎస్.శ్యామ్‌ప్రసాద్‌రావు నేతృత్వంలోని సీఐడీ అధికారుల బృందం నిందితులు కె.విజయకుమార్, జంగటి రాజయ్య, ఎస్.సాయిలు, సీహెచ్ స్వర్ణలతలను మంగళవారం అరెస్టు చేసింది. నిందితులను కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అరెస్టులో కీలకంగా పనిచేసిన ఇన్‌స్పెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, జె.లింగస్వామి, ఎస్సైలు జి.వీరయ్య, డి.రమేశ్, ఇతర అధికారులు, సిబ్బందిని సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు.

ఇదీ నేపథ్యం..: బోధన్ వాణిజ్య పన్నుల శాఖలో 2012 నుంచి 2017 మధ్య కాలంలో నిందితులు ఒకే చలానాను వేర్వేరు వ్యాపార సంస్థల పేర్ల మీద ఫైల్ చేసి, ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాకు జమచేయకుండా రూ.232కోట్లకు పైచిలుకు సొమ్మును కొల్లగొట్టారు. ఈ కేసులో దళారీగా వ్యవహరించిన శివరాజ్, అతడి అనుచరులతోపాటు వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది సహా పలువురిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. 2017 నుంచి ఈకేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు తాజాగా మరో నలుగురిని అరెస్టు చేశారు.

'నీట్'లాగా ఇంజనీరింగ్‌కూ ఒకే ఎంట్రన్స్!

జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష నిర్వహణ దిశగా కేంద్రం కసరత్తు

- రాష్ట్రాల పరిధిలో జరుగుతున్న ఎంసెట్ తరహా ఎంట్రన్స్‌లకు ఇక స్వస్తి
- ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ముసాయిదా.. ఎక్కువ రాష్ట్రాల ఆమోదం!
- ప్రతిపాదన అమలైతే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల బేరసారాలకు తెర



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్‌లో ఇక రాష్ట్రాల పరిధిలో ఎంసెట్‌ల నిర్వహణ ఉండే అవకాశం కన్పించడం లేదు. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి 'నీట్'ను నిర్వహిస్తున్న మాదిరిగానే అన్ని రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష నిర్వహించే దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిని కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకూ పంపింది. మెజారిటీ రాష్ట్రాలు ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. దీంతో ఈ అంశంపై అవగాహనకు కేంద్రం సెమినార్లు నిర్వహిస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఉన్న డిగ్రీ, పీజీ సీట్ల భర్తీకి కూడా కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ప్రయోగం విజయవంతమైంది. దీంతో జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశపరీక్షపై కేంద్రం దృష్టి పెట్టింది. గత కొన్నేళ్లుగా దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కేంద్రం జేఈఈ మెయిన్ పరీక్ష నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఐఐటీల్లో ప్రవేశాల కోసం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష చేపడుతోంది. ఇదే మాదిరిగా రాష్ట్రాల ఇంజనీరింగ్ కాలేజీలనూ కలుపుకొని ఉమ్మడి ప్రవేశ పరీక్ష, కౌన్సెలింగ్ చేపట్టాలని 2016లోనే ఆలోచన చేసింది. కానీ వివిధ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.

కొనసాగుతున్న చర్చలు

గత నెల 18న భువనేశ్వర్‌లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), యూజీసీ, ఐఐటీల డైరెక్టర్లు, గవర్నింగ్ బాడీ చైర్మన్లతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశపరీక్షపై చర్చించారు. అయితే ఇందుకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు, పొందుపరచాల్సిన నిబంధనలపై వివిధ వాదనలు వినిపించాయి. దీంతో అన్ని కోణాల్లోనూ పరిశీలించి, మార్పుచేర్పులతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఐఐటీ గవర్నింగ్ బాడీ చైర్మన్లను కేంద్ర మంత్రి ఆదేశించారు. దీంతో వారు అన్ని రాష్ట్రాలతో భేటీ అవుతూ అభిప్రాయసేకరణ చేపడుతున్నారు. 2025–26 నాటికి ఈ ప్రయోగాన్ని అమల్లోకి తేవాలనే ఆలోచనలో ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విధానపరమైన నిర్ణయం తీసుకున్నాక ప్రస్తుతం రాష్ట్రాల పరిధిలో ఉన్న కాలేజీలకు రెండేళ్ల సమయం ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. అయితే ఐఐటీల నాణ్యతను ఏమాత్రం తగ్గించకుండా చూడాలని సమావేశంలో పాల్గొన్న విద్యావేత్తలు సూచించారు. నీట్, జేఈఈ మెయిన్ పరీక్షలతోపాటు కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)లో విలీనం చేసే యోచన ఉందని యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్ కూడా గతంలో అనేక సందర్భాల్లో తెలిపారు.

నిబంధనలు పాటిస్తేనే అనుబంధ గుర్తింపు..

ఇంజనీరింగ్ సీట్ల భర్తీ జాతీయ స్థాయిలోకి వెళ్తే పూర్తిగా వెబ్ ఆధారితంగానే ఉంటుందని అధికారులు అంటున్నారు. యాజమాన్య కోటా కూడా కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేస్తారు. అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీలన్నీ ఏఐసీటీఈ నిబంధనలు విధిగా పాటించాల్సి ఉంటుంది. మౌలిక వసతులు, నాణ్యమైన ఫ్యాకల్టీ, కంప్యూటర్ ఆధారిత కోర్సుల్లో బోధన ప్రణాళిక మొత్తం కేంద్ర పరిధిలోకి వెళ్తుంది. ఫలితంగా కొన్ని ప్రైవేటు కాలేజీలు అనేక మార్పులు చేసుకోక తప్పదని ఓ అధికారి పేర్కొన్నారు. ఇప్పటివరకు యూనివర్సిటీ అధికారులే తనిఖీలు చేసేవాళ్లు. ఇకపై జాతీయ స్థాయిలోనూ ప్రత్యేక బృందాలు తనిఖీలు చేసి అనుమతిస్తేనే ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు లభిస్తుందని తెలుస్తోంది. ఈ విధానంతో యాజమాన్య కోటా సీట్ల బేరసారాలకు బ్రేక్ పడుతుందని అధికార వర్గాలు అంటున్నాయి.

లేఖను ఎందుకు దాచారు?

- హత్య జరిగాక ఎవరెవరికి ఫోన్ చేశారు?
- వైఎస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిని ప్రశ్నించిన సీబీఐ
- వైఎస్ అవినాష్ రెడ్డికి మరోసారి నోటీసులు
- 19న విచారణకు రావాలని సూచన

సాక్షి, హైదరాబాద్/పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయన కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డిలను మంగళవారం ప్రశ్నించారు. వివేకా మరణించే ముందు రాసినట్టుగా చెబుతున్న లేఖ గురించే వారిద్దరి నుంచి ఎక్కువగా వివరాలు రాబట్టినట్టు సమాచారం. సీబీఐ నోటీసుల మేరకు సునీత, రాజశేఖరరెడ్డి హైదరాబాద్ కోఠిలోని సీబీఐ కార్యాలయంలో హాజరయ్యారు. వివేకా హత్య తర్వాత జరిగిన పరిణామాలతోపాటు లేఖను ఎందుకు దాచిపెట్టాల్సి వచ్చింది?, తర్వాత పోలీసులకు అందించడం, వివేకా పీఏ కృష్ణారెడ్డికి హత్య జరిగిన రోజు ఎన్నిసార్లు ఫోన్లు చేశారు? ఆయన నుంచి ఎన్ని ఫోన్ కాల్స్ అందుకున్నారు? హత్య జరిగిన సమాచారం అందిన తర్వాత ఎవరెవరితో మాట్లాడారు? ఇలా పలు అంశాలపై సునీత, రాజశేఖరరెడ్డిలను సీబీఐ అధికారులు మరోమారు సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇద్దరి స్టేట్‌మెంట్లను సీబీఐ అధికారులు నమోదు చేశారు.

విచారణకు హాజరుకాని అవినాష్

కాగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 16న మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో హాజరు కావాలని 15వ తేదీన ఆయనకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం తాను ముందుగా నిర్ణయించుకున్న పలు కార్యక్రమాల కారణంగా విచారణకు హాజరు కాలేనని.. నాలుగు రోజుల గడువు కావాలని లేఖ ద్వారా అవినాష్ రెడ్డి సీబీఐ అధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఆయన ఇంటికి సీబీఐ అధికారులు చేరుకున్నారు. అక్కడ ఎంపీ కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో వారి డ్రైవర్‌కు నోటీసులు అందజేసి అతడి సంతకం తీసుకున్నారు. అవినాష్‌రెడ్డి ఈ నెల 19న ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లో సీబీఐ విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

ప్రత్యేక కేటగిరీగా పరిగణించి వసతులు కల్పించండి: భాస్కరరెడ్డి పిటిషన్

జైలులో తనకు ప్రత్యేక కేటగిరీ కింద సదుపాయాలు కల్పించాలని కోరుతూ వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడు (ఏ–7) వైఎస్ భాస్కరరెడ్డి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆయనను గత నెలలో సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించడంతో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ క్రమంలో తన అనారోగ్యాన్ని, వయసును దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కేటగిరీగా పరిగణించి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ భాస్కరరెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న కోర్టు తన ఉత్తర్వులను జూన్ 2కు వాయిదా వేసింది.

'టీఎస్‌పీఎస్సీ లీకేజ్' కేసులో మరో ముగ్గురు

అరెస్టు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ కేసులో మరో ముగ్గురు నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం అరెస్టు చేసింది. వీళ్లు ఏఈఈ, డీఏఓ పరీక్ష పత్రాలు ఖరీదు చేసిన అభ్యర్థులని అధికారులు ప్రకటించారు. వీరితో ఇప్పటి వరకు అరెస్టు అయిన వారి సంఖ్య 30కి చేరింది. కమిషన్ కార్యదర్శి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన ప్రవీణ్‌కుమార్ నుంచి ఏఈఈ పేపర్లు వరంగల్, హైదరాబాద్‌లకు చెందిన దళారులు మనోజ్‌కుమార్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డిలకు చేరాయి. వీటిని ఏడుగురికి విక్రయించారు. ఒక్కొక్కరితో రూ.10 లక్షలకు ఒప్పందం చేసుకుని రూ.1 లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు అడ్వాన్సులు తీసుకుని పేపర్లు అందించారు. మనోజ్, మురళీ విచారణలో వీరి నుంచి పేపర్లు ఖరీదు చేసిన వారి పేర్లు వెలుగులోకి వచ్చాయి. దీంతో గత వారం నలుగురిని అరెస్టు చేసిన సిట్ మంగళవారం క్రాంతి, శశిధర్‌రెడ్డిలను పట్టుకుంది. ఈ ద్వయం మురళీధర్‌రెడ్డి నుంచి ఏఈఈ పేపర్లు ఖరీదు చేసినట్లు గుర్తించింది. మరోపక్క ప్రవీణ్ కుమార్ రూ.6లక్షలు తీసుకుని ఖమ్మంకి చెందిన భార్యాభర్తలు సాయి సుస్మిత, సాయి లౌకిక్‌లకు డీఏఓ పేపర్ విక్రయించాడు. వీరిని సిట్ అధికారులు గత నెలలోనే అరెస్టు చేశారు. సాయి లౌకిక్ ఆ పేపర్‌ను తన స్నేహితుడైన రవి తేజకు విక్రయించాడు. దర్యాప్తులో ఈ విషయం గుర్తించిన పోలీసులు మంగళవారం రవితేజను కటకటాల్లోకి పంపారు. మంగళవారం అరెస్టయిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ నిమిత్తం వీరిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సిట్ నిర్ణయించింది.

పేపర్ లీకేజీపై ఈడీకి బీఎస్పీ ఫిర్యాదు

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వెనుక ఉన్న అసలైన సూత్రధారులను అరెస్టు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు ఈడీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాసిన లేఖను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు వెంకటేష్ చౌహాన్, అరుణ, సంజయ్‌లు ఈడీ కార్యాలయంలో సంబంధిత అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్న విచారణ జరపాలని ఈడీకి ఫిర్యాదు చేశామని తెలిపారు.

వారం రోజులు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17 నుంచి 23 వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశించారు. గ్రామాలలో ప్రతి రోజూ రోడ్లు శుభ్రపరచాలని, గుంతలలో నీరు నిల్వ ఉండకుండా పూడ్చివేయాలని, పిచ్చిమొక్కల తొలగింపు, మురుగునీటి కాలువలు శుభ్రపరచడం వంటి అన్ని పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం పీఆర్ శాఖ డైరెక్టర్ హన్మంతరావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా పంచాయతి అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్లు, బస్టాపులు క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.

'ఎయిర్‌పోర్టు మెట్రో'కు గ్లోబల్ టెండర్లు



- నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్ఏఎంఎల్
- జూలై 5 వరకు దరఖాస్తుకు గడువు
- కాంట్రాక్ట్ అంచనా రూ.5,688 కోట్లు
- రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు నిర్మాణం


సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుకు ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) కాంట్రాక్టర్ ఎంపిక కోసం హెచ్ఏఎంఎల్ టెండర్లను ఆహ్వానించింది. ఈ కాంట్రాక్టు అంచనా రూ 5,688 కోట్లు అని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన కాంట్రాక్టర్ మెట్రో రైలు వ్యవస్థకు అవసరమైన ఎలివేటెడ్ వయాడక్ట్, భూగర్భ పనులు, స్టేషన్లు, ట్రాక్ పనులు, ఎలక్ట్రికల్, మెకానికల్, సరఫరా పనులను చేపట్టాల్సి ఉంటుంది. అలాగే రోలింగ్ స్టాక్ (రైలు బోగీలు), ఎలక్ట్రిక్ ట్రాక్షన్, విద్యుత్ సరఫరా, సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్స్, రైలు నియంత్రణ వ్యవస్థలు, ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ (ఏఎఫ్‌సీ) గేట్లను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, పెగ్ మార్కింగ్, అలైన్‌మెంట్ ఫిక్సేషన్ వంటి ప్రాథమిక పనులన్నింటినీ ఇప్పటికే పూర్తి చేశారు. భూసామర్థ్య పరీక్షల పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. కొత్త సర్వే ప్రకారం రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ స్టేషన్ వరకు దూరం 31 కి.మీ. ఉంది. ఇందులో 29.3 కి.మీ. ఆకాశమార్గం (ఎలివేటెడ్) కాగా. అండర్‌గ్రౌండ్‌లో 1.7 కి.మీ పొడవున పనులు చేపట్టాల్సి ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. విమానాశ్రయ టెర్మినల్‌కు ఆనుకొని ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో కలిపి రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు మొత్తం 9 స్టేషన్లు ఉంటాయి.

ఆఖరు తేదీ జూలై 5

ఎయిర్‌పోర్టు మెట్రో రైలు నిర్మాణం పట్ల ఆసక్తి ఉన్న సంస్థలు జూలై 5లోగా టెండర్ పత్రాలను తెలంగాణ ప్రభుత్వ ఇ–పోర్టల్ https://tender.telangana.gov.inలో అప్‌లోడ్ చేయాలి. విమానాశ్రయ మెట్రో కారిడార్‌కు సమీపంలో అనేక వాణిజ్య, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతోందని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. శివార్లలో మధ్యతరగతి వారికోసం తక్కువ ఖర్చుతో నివాసప్రాంతాలను అభివృద్ధి చేసి అన్ని తరగతులవారు ఎయిర్‌పోర్ట్ మెట్రో ద్వారా గమ్యస్థానాలకు చేరుకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైతే నాలుగు అదనపు స్టేషన్ల నిర్మాణానికీ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

టెండర్ విలువ, ప్రాజెక్టు వ్యయం వేర్వేరు


ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.6,250 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.5,688 కోట్లకే టెండర్లను ఆహ్వానించారు. దీనిపై ఎన్వీఎస్ రెడ్డి స్పందిస్తూ, ప్రాజెక్టు వ్యయం, టెండర్ విలువ రెండూ భిన్నమైనవని చెప్పారు. అంచనా వేసిన టెండర్ విలువలో జీసీ ఖర్చు, ఆకస్మిక పరిస్థితులు, మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ వంటివి ఉండవన్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో మాత్రం అవి ఉంటాయన్నారు. అందుకే ఈ రెండింటి మధ్య తేడా ఉన్నట్లు స్పష్టం చేశారు.



మంగళవారం రాత్రి విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న డా. బీఆర్ అంబేడ్కర్ సచివాలయం, తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం

నాలుగేళ్ల కోర్సుగా బీఈడీ

- సునిశిత విశ్లేషణ సబ్జెక్టు చేర్పు
- విద్యార్థి సైకాలజీపై ప్రధాన దృష్టి
- జాతీయ స్థాయిలో ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: మారుతున్న బోధన విధానాలకు అనుగుణంగా అధ్యాపకుల శైలిలోనూ మార్పులు తేవాలని కేంద్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సుల స్వరూప స్వభావాన్ని మార్చాలని ప్రతిపాదించింది. ఇప్పుడున్న రెండేళ్ళ కాలపరిమితి స్థానంలో కోర్సును నాలుగేళ్ళకు పెంచబోతున్నారు. ఇప్పటికే బీఈడీ కోర్సుల మార్పులకు సంబంధించిన ముసాయిదా ప్రతిని రూపొందించారు. గత నెల 27న ఢిల్లీలో దీనిపై ప్రత్యేక సమావేశం జరిగింది. రాష్ట్రాలకు చెందిన ఉన్నత విద్యా మండళ్ళు, కేంద్ర విద్యాశాఖ అధికారులు ఇందులో పాల్గొన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)కి బీఈడీలో కొత్త కోర్సుల రూపకల్పన బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించారు. జాతీయ విద్యావిధానం–2020లో తీసుకొచ్చిన మార్పులను అనుగుణంగా ఉపాధ్యాయ వృత్తిలోనూ గుణాత్మక మార్పులతో ముసాయిదా రూపొందించారు.

నవీన బోధన విధానం..: కాలానుగుణంగా వస్తున్న మార్పులతో నవీన బోధన విధానంతో కొత్త సబ్జెక్టులను బీఈడీలో చేర్చబోతున్నారు. విద్యార్థి సైకాలజీని అర్థం చేసుకుని, సునిశిత విశ్లేషణతో బోధించే మెళకువలు ఇందులో పొందుపర్చాలని నిర్ణయించారు. బోధన ప్రణాళికలో వర్చువల్, డిజిటల్ పద్ధతులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు. వాస్తవ ప్రపంచంలోకి వెళ్ళి విద్యార్థి సముపార్జించే జ్ఞానాన్ని ఉపాధ్యాయుడు ఏ విధంగా గుర్తించాలనే అంశాలను బీఈడీలో చేర్చబోతున్నారు. ఆన్‌లైన్, డిజిటల్ ప్లాట్ ఫామ్‌కు అనుగుణంగా పుస్తకాల్లో ఉన్న సబ్జెక్టును విద్యార్థికి అర్థమయ్యేలా టెక్నాలజీతో అందించే విధానాన్ని బీఈడీలో పాఠ్యాంశాలుగా చేర్చనున్నారు.

వచ్చే పది నెలల్లో పది లక్షల కేంద్ర ఉద్యోగాలు

వేగంగా భర్తీ చేసేందుకు ప్రధాని పని చేస్తున్నారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఉద్యోగులకు అపాయింట్మెంట్ ఆర్డర్‌ను అందిస్తున్న కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): రాబోయే పది నెలల్లో పది లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడమే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే 3.6 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినట్టు తెలిపారు. తెలంగాణలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే.. కేసుల పేరుతో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రం చేపట్టిన రిక్రూట్‌మెంట్లలో ఎలాంటి చిన్న లోపం, అవినీతికి తావు లేకుండా భర్తీ చేశారని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 71 వేల మందికి ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మంగళవారం వర్చువల్‌గా నియామక పత్రాలు అందించారు. దీనికి సంబంధించి సికింద్రాబాద్ ఎన్వీఐటీ ఆడిటోరియంలో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. పోస్టల్, రైల్వే, ఆడిట్, సీఆర్‌పీఎఫ్ తదితర శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన పలువురికి కిషన్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నూతనంగా ఉద్యోగాలు పొందిన వారికి కిషన్‌రెడ్డి సూచించారు. పగలు, రాత్రి కష్టపడి ఉద్యోగాలు సంపాదించేందుకు సహకరించిన తల్లిదండ్రులను మరచిపోవద్దన్నారు. పొందిన ఉద్యోగం ద్వారా వీలైనంత మేరకు పేదలకు సాయం చేయాలన్నారు.

సీఈఐఆర్‌తో 2,43,875 మొబైల్ ఫోన్లు గుర్తించాం

- నేటి నుంచి సంచార్‌సాథీ పోర్టల్ అందుబాటులోకి
- టెలికాం స్పెషల్ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్



సాక్షి, హైదరాబాద్/రాంగోపాల్‌పేట్: చోరీకి గురైన, కనిపించకుండా పోయిన మొబైల్ ఫోన్లను గుర్తించేందుకు అమల్లోకి తెచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 2,43,875 మొబైల్ ఫోన్లను గుర్తించినట్టు టెలికాం స్పెషల్ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రపంచ టెలీ కమ్యూనికేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి సంచార్ సాథీ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నట్టు వెల్లడించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని సీటీఓ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పోర్టల్‌లోని టాఫ్‌కాప్ (టీఏఎఫ్‌సీఓపీ) మాడ్యుల్ ద్వారా ఒక ఆధార్ కార్డుపై ఎన్ని సిమ్‌కార్డులు వాడుతున్నారనేది తెలుస్తుందని చెప్పారు. దీనివల్ల మన గుర్తింపు కార్డుతో ఎవరైనా సిమ్‌లు వాడుతుంటే గుర్తించవచ్చన్నారు. అదే పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసి, సిమ్‌లను బ్లాక్ చేయవచ్చని చెప్పారు. టాఫ్‌కాఫ్‌ను ఏపీఎల్ఎస్ఏ విజయవాడ బ్రాంచ్ తయారు చేయగా ఏడాదిన్నరగా ఉపయోగిస్తున్నామని ఇప్పుడు జాతీయ స్థాయిలో అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 40.87లక్షల అనుమానాస్పద కనెక్షన్లను గుర్తించి, అందులో 36.61 కనెక్షన్లు రద్దుచేసినట్లు చెప్పారు. సైబర్‌క్రైమ్, బ్యాంకింగ్ మోసాలను నిరోధించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని చెప్పారు.

పర్యావరణ హితం.. సౌకర్యవంతం..

ఈ-గరుడ ఎలక్ట్రిక్ వాహనాల ముఖ్య ఉద్దేశం ఇదే..

- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- మియాపూర్‌లో ఈ– గరుడ ఎలక్ట్రికల్ వాహనాలు ప్రారంభం
- హాజరైన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్



ఈ-గరుడ వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ. చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్

మియాపూర్: కాలుష్య నివారణతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కల్పించడమే ఈ– గరుడ ముఖ్యోద్దేశ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఈ–గరుడ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ.. మియాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోని బస్టాప్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి పువ్వాడ మాట్లాడుతూ రాబోయే తరాలకు కాలుష్య రహిత సమాజం కోసం ఎలక్ట్రికల్ వాహనాలను టీఎస్ఆర్టీసీ విస్తరిస్తోందన్నారు. రానున్న రోజుల్లో 1300 బస్సులు హైదరాబాద్ సిటీలో, 550 సదూర ప్రాంతాలలో నడుపుతామని తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాల బ్యాటరీలకు సంబంధించిన యూనిట్లకు అమర్ రాజా సంస్థతో కలిసి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మహబూబ్‌నగర్‌లో శంఖుస్థాపన చేశారన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు 50 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను నడపాలని నిర్ణయించామని, అందులో ప్రస్తుతం 10 బస్సులు ప్రారంభించామని, విడతల వారీగా మిగతా బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామరని తెలిపారు. ఎన్ని ఇబ్బందులున్నా.. కొత్త బస్సులను ప్రవేశపెడుతూ ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఆర్టీసీ కృషి చేస్తోందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు 10 వేల బస్సులు ప్రజా రవాణాకు వినియోగిస్తున్నామని తెలిపారు. త్వరలో నగరంలో డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ గతంలో ప్రైవేటు వాహనాలను తట్టుకోవడం ఆర్టీసీకి కష్టంగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆర్టీసీ వాహనాలను తట్టుకోవడం ప్రైవేటుకు కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఆర్టీసీ నడుస్తోందని తెలిపారు. కొత్త కారులలో ఉండే ఆధునిక సదుపాయాలు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సుల కారణంగా ట్రాఫిక్ సమస్య పెరిగిందని, నియంత్రించేదుకు బస్సు టెర్మినల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒలెక్ట్రా ప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.